మంగళవారం 10-3-2020

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 349

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'




## మరోసారి వృద్ధి రేటుకు కోత

2020లో 5.3 శాతంగా ఉంటుందని మూడీస్ అంచనా – బిజినెస్‌లో



## భారత బాక్సర్ల 'తీన్‌మార్'...

టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన అమిత్, మేరీకోమ్, సిమ్రన్‌జిత్ –స్పోర్ట్స్‌లో

● టార్గెట్ వెస్ట్ బెంగాల్

## కాషాయదళం కన్ను



దేశంలో కీలకమైన పెద్ద రాష్ట్రం పశ్చిమ బెంగాల్‌లో అధికార పీఠంపై బీజేపీ కన్నేసింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా సోమవారం ప్రధాని మోదీ స్వయంగా ఆ రాష్ట్ర ఎంపీలతో సమావేశమయ్యారు. అక్కడి ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. - 5లో

● కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

## ఉగ్రవాదుల హతం



ఉగ్రసంస్థ లష్కరే తోయిబాకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. జమ్మూకశ్మీర్‌లోని షోపియన్ జిల్లాలో ఈ ఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని రెబాన్ ప్రాంతం వద్ద ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న పక్కా సమాచారంతో భద్రతా బలగాలు సోదాలు చేపట్టాయి. - 5లో

● యస్ బ్యాంక్ సంక్షోభం

## స్కామ్‌పై సీబీ'ఐ'




సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ కుంభకోణం కేసు విచారణను సీబీఐ వేగవంతం చేసింది. డీహెచ్‌ఎఫ్‌ఎల్ సంస్థ నుంచి యస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు రాణా కపూర్ కుటుంబానికి రూ. 600 కోట్లు ముడుపులు ముట్టాయన్న ఆరోపణలకు సంబంధించి సోమవారం 7 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. - బిజినెస్‌లో

● యూట్యూబ్ ఫేమస్

## స్టార్..స్టార్.. విలేజ్ స్టార్



తెలంగాణ పల్లె సంస్కృతికి ప్రతిరూపంగా ఉన్న గంగవ్వ 'మై విలేజ్ షో' ద్వారా యూట్యూబ్ స్టార్‌గా ఎదిగింది. కూలిపనులు చేసుకుంటూ జీవించే గంగవ్వ, అక్షరం నేర్చుకోని గంగవ్వ, ఊరు దాటి బయటకు రాని గంగవ్వ... ఇప్పుడు విదేశాలలోని తెలుగువారి అభిమానాన్నీ చూరగొంటోంది. - ఫ్యామిలీలో



నో కోవిడ్..

## హైదరాబాద్ సేఫ్

ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న కోవిడ్–19 ఆనవాళ్లు గ్రేటర్‌లో తగ్గుముఖం పట్టాయి. ఇటీవల దుబాయ్ నుంచి వచ్చిన మహేంద్రహిల్స్ యువకునికి తాజా వైద్య పరీక్షల్లో కరోనా నెగటివ్ వచ్చినట్లు తెలిసింది. జ్వరం తగ్గడంతో పాటు బీపీ కూడా అదుపులోకి వచ్చినట్లు సమాచారం. - 14లో

## మూడేళ్ల చిన్నారికీ కోవిడ్

- కేరళలో మూడేళ్ల చిన్నారి సహా నలుగురికి తాజాగా కరోనా వైరస్ సోకడంతో ఈ మహమ్మారి బారిన పడ్డవారి సంఖ్య 44కు చేరింది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, జమ్మూలలో ఒక్కో కేసు నమోదు కాగా.. ఇటీవల ఇటలీ నుంచి తిరిగి వచ్చిన మూడేళ్ల చిన్నారి కూడా వ్యాధి బారిన పడినట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. న్యూయార్క్ నుంచి బెంగళూరుకు వచ్చిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికీ కోవిడ్ సోకింది.

-వివరాలు 5లో

## ఇప్పటివరకు 3800 మంది మృతి

- 1,10,000 మందిలో వైరస్
- భారత్ సహా 13 దేశాలపై ఖతార్ నిషేధం

-వివరాలు 5లో

# మహా పతనం

## ప్రపంచవ్యాప్తంగా స్టాక్, కరెన్సీ మార్కెట్లలో కల్లోలం

- కరోనా చిచ్చుకు తోడైన చమురు ధరల పోరు
- రష్యాను దెబ్బతీయటానికి రేట్లు తగ్గించిన సౌదీ
- ఒకేరోజు 30 శాతానికి పైగా పతనమైన ముడిచమురు
- 5–7 శాతం మేర పడ్డ ఆసియా, యూరప్ మార్కెట్లు

ట్రంప్ ట్రేడ్‌వార్ ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను కుదిపేస్తోంది. ఇక కార్చిచ్చులా ప్రపంచాన్ని చుట్టుముట్టేస్తున్న కరోనా.. ఇన్వెస్టర్లను బెంబేలెత్తిస్తోంది. ఈ రెండింటికీ సౌదీ అరేబియా–రష్యా మధ్య మొదలైన చమురు ధరల యుద్ధం ఆజ్యం పోసింది. ఇక చెప్పేదేముంది! మాంద్యం భయాలతో ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లు మహా పతనాన్ని చవిచూశాయి. చమురు ఊచకోతకు గురైంది. ఒక్క జపాన్ యెన్ మినహా... ప్రపంచ కరెన్సీలన్నీ ఊహించని విధంగా పతనమయ్యాయి. ఒక్క మాటలో చెప్పాలంటే... ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా, ఏ దశలోనూ ఇన్వెస్టర్లకు ఉపశమనం కనిపించలేదు.




- ప్రపంచ పరిణామాలకు యస్ బ్యాంకు సంక్షోభం తోడవటంతో బీఎస్‌ఈ సెన్సెక్స్ సోమవారం ఒక్కరోజే 1,942 (5.1%) పాయింట్లు కుదేలైంది. చరిత్రలో ఇదే అత్యంత దారుణ పతనం. నిఫ్టీ సైతం 538 పాయింట్లు (4.9%) నష్టపోయింది. శాతాల పరంగా గత ఐదేళ్లలో ఇదే భారీ నష్టం కాగా.. పాయింట్ల పరంగా ఇది రికార్డు. ఓఎన్‌జీసీ వంటి దిగ్గజ కంపెనీల షేర్లు సైతం 15 ఏళ్ల కనిష్టానికి పడిపోయాయి. ఫలితంగా ఒక్కరోజే ఏకంగా రూ.7 లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది.

- ముడి చమురు ఉత్పత్తి తగ్గించుకునే విషయంలో ఒపెక్ కూటమి – రష్యా మధ్య రేగిన విభేదాలతో.. సౌదీ భారీగా రేట్లు తగ్గించేసింది. ఫలితం.. ఒకేరోజు ముడిచమురుధరలు ఏకంగా 30 శాతానికిపైగా పతనమయ్యాయి. ఒక దశలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 31 డాలర్ల స్థాయికి పడిపోయి, తర్వాత కాస్త కోలుకుంది. 1991 గల్ఫ్ యుద్ధ సమయం తర్వాత ఈ స్థాయి పతనం ఇదే తొలిసారి.

- తాజా పరిణామాలతో రూపాయి ఏకంగా 17 నెలల కనిష్టానికి క్షీణించి డాలర్‌తో పోలిస్తే 74.17 వద్ద క్లోజయ్యింది. జపాన్ యెన్ మినహా అమెరికా డాలర్, ఇతర కరెన్సీలూ రూపాయి దార్లోనే వెళ్లాయి. సోమవారం రాత్రి 11 గంటల సమయానికి అమెరికా మార్కెట్ల ప్రామాణిక సూచీ డోజోన్స్ 1,600 పాయింట్లకు పైగా నష్టంతో (6 శాతం) ట్రేడవుతోంది. జపాన్, జర్మనీ, ఇంగ్లండ్, ఫ్రాన్స్ మార్కెట్లు సైతం 5 నుంచి 7 శాతం మధ్యలో భారీగా నష్ట పోయాయి. మంగళవారం హోలీ సందర్భంగా మన మార్కెట్లకు సెలవు కావటంతో.. పతనానికి కూడా తాత్కాలికంగానైనా విరామం దొరికినట్లయింది.

- పూర్తి వివరాలు బిజినెస్‌లో



జ్యోతిరాదిత్య సింధియా..

- వివరాలు 5లో

## కమల్ సర్కార్‌లో సింధియా చిచ్చు

మధ్యప్రదేశ్‌లో అనూహ్య పరిణామాలు

- బెంగళూరు రిసార్ట్‌లో సింధియా, 17 మంది ఎమ్మెల్యేల మకాం
- రాష్ట్ర కేబినెట్ అత్యవసర భేటీ.. మంత్రుల రాజీనామా
- మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ

అసెంబ్లీలో బలాబలాలు..

| | |
|---|---|
| మొత్తం సీట్లు | 228 (230) |
| కాంగ్రెస్ | 114 |
| బీజేపీ | 107 |
| స్వతంత్రులు | 4 |
| బీఎస్పీ | 2 |
| ఎస్పీ | 1 |

స్వతంత్రులు, బీఎస్పీ, ఎస్పీ సభ్యులు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతిస్తున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మృతి చెందడంతో 2 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

## అఫ్గాన్ అధ్యక్షులుగా పోటాపోటీ ప్రమాణాలు



అబ్దుల్లా అబ్దుల్లా



అష్రాఫ్ ఘనీ

- అఫ్గానిస్తాన్‌లో రాజకీయ సంక్షోభం పెరుగుతోంది. అష్రాఫ్ ఘనీ, అబ్దుల్లా అబ్దుల్లాల మధ్య రాజకీయ పోరు ఎక్కువైంది. సోమవారం ఘనీ, అబ్దుల్లాలు తామే అధ్యక్షులం అంటూ ప్రమాణ స్వీకారాలు జరుపుకున్నారు. దశాబ్దకాలం యుద్ధానికి ఫుల్‌స్టాప్ పెడుతూ అమెరికా దళాలు అఫ్గానిస్తాన్ నుంచి నిష్క్రమిస్తున్న సమయంలో ఈ ఘటనలు జరిగాయి. - 5లో

## 6 లక్షల కోట్లపైనే!

- తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఆరేళ్లలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం ఖర్చయిన మొత్తం అక్షరాలా రూ. 6 లక్షల కోట్లపైనే. రాష్ట్రం ఏర్పడిన అనతి కాలంలోనే ప్రగతికి బాటలు పడడం, హైదరాబాద్ విశ్వనగరంగా రూపాంతరం చెందుతుండటంతో ఆ అభివృద్ధి ఫలాలు రాష్ట్ర ప్రభుత్వానికి కాసుల రూపంలో కలిసొచ్చాయి. దీంతో 2016–17లోనే రాష్ట్ర ప్రభుత్వ రాబడులు రూ. లక్ష కోట్లు దాటాయి.

- వివరాలు 2లో



## 40.66 లక్షల మంది రైతులకు రుణమాఫీ

- రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి 40.66 లక్షల మంది రైతులు అర్హులు కానున్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ), వ్యవసాయ శాఖ ప్రాథమికంగా నిర్ధారించాయి. రూ.25వేల లోపు ఉన్న పంట రుణాలన్నింటినీ ఏకకాలంలో మాఫీ చేస్తామని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ఈ నెలలో రూ.1,198 కోట్లు విడుదల చేయనున్నారు.

- వివరాలు 2లో

## సగం మందికి సంతకం రాదు

రాష్ట్రంలో 35 ఏళ్లు దాటిన వారిలో 48.39% మంది నిరక్షరాస్యులే. అంటే దాదాపు సగం మంది నిరక్షరాస్యులే నన్న మాట. ఇక 50 ఏళ్లు పైబడిన వారిలో 35.85% మందే అక్షరాస్యులు ఉన్నారు. అంతేకాదు.. జాతీయ సగటు అక్షరాస్యత శాతం 72.98 ఉంటే రాష్ట్రంలో అక్షరాస్యత శాతం 66.54 ఉంది. జాతీయ సగటు అక్షరాస్యతతో పోలిస్తే 6.44% తక్కువగా ఉంది. ఈ విషయాన్ని 'సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్' స్పష్టం చేస్తోంది.

- వివరాలు 2లో



రవీంద్రకుమార్ (ఫైల్)

## తుపాకీతో కాల్చుకొని డాక్టర్ ఆత్మహత్య

మృతుడు శ్రీఆదిత్య ఆస్పత్రి ఎండీ

హైదరాబాద్‌లో శ్రీఆదిత్య ఆస్పత్రి ఎండీ డాక్టర్ రవీంద్రకుమార్ తన లైసెన్స్‌డ్ తుపాకీతో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. జవహర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి కాప్రా సాకేత్ మిథిల ఎన్‌క్లేవ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

- వివరాలు 2లో



## ప్రైవేటుకు పరుగు

- రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించేందుకు ప్రైవేటు స్కూళ్ల బాట పడుతున్నారు. దీంతో ప్రైవేటు స్కూళ్లకు వెళ్లే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది.

- వివరాలు 3లో







ఇదంజగత్



... ఎట్టి పరిస్థితుల్లో మీడియా ముందు యస్ అనకండీ!



## రామాయంపేటలో 13 సెం.మీ. వర్షపాతం



- రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

**సాక్షి, హైదరాబాద్:** గత 24 గంటల్లో మెదక్ జిల్లా రామాయంపేటలో అత్యధికంగా 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లా దోమకొండ, మెదక్ జిల్లా మెదక్‌లలో 5 సెం.మీ. చొప్పున, సిద్దిపేట జిల్లా దుబ్బాకలో, కామారెడ్డి జిల్లాలోని తాడ్వాయి, లింగంపేట, మాచారెడ్డిలలో 4 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరత్వాడ నుండి దక్షిణ తమిళనాడు వరకు 0.9 కి.మీ. ఎత్తు వద్ద ఉపరితల ద్రోణి ఏర్పడినట్టు పేర్కొంది. మధ్య మహారాష్ట్ర మరియు దాని పరిసర ప్రాంతాల్లో 1.5 కి.మీ. ఎత్తు వద్ద ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని తెలిపింది. మంగళ, బుధవారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలియజేసింది.

## పీఆర్‌సీ కోసం 13న చలో అసెంబ్లీ

- తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్

**హైదరాబాద్:** ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయ పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దుచేసి కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న నిర్వహించే 'చలో అసెంబ్లీ'లో ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపాల్, ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ పిలుపునిచ్చారు. సోమవారం యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో చలో అసెంబ్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 3.5 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు, 2.5 లక్షల మంది పెన్షనర్లకు, 1.5 లక్షల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు జూన్ 2018 నుంచి పీఆర్‌సీ రావాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి హామీనిచ్చి 22 నెలలు గడుస్తున్నా నేటికీ ఇవ్వకపోవడం దారుణమన్నారు.

**చలో అసెంబ్లీకి అనుమతి లేదు: కొత్వాల్**

**సాక్షి, హైదరాబాద్:** వివిధ సంఘాలు శుక్రవారం తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి అనుమతి లేదని నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ సోమవారం స్పష్టం చేశారు. ఎవరైనా అతిక్రమించే ప్రయత్నం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రభుత్వ చీఫ్ విప్‌తో ప్రకాశ్‌రాజ్ భేటీ

**సాక్షి, హైదరాబాద్:** బిగ్‌బాస్ విజేత రాహుల్ సిప్లిగంజ్‌తో కలిసి సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ సోమవారం అసెంబ్లీ ఆవరణలో ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌తో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వ్యక్తిగత పని నిమత్తం వినయ్ భాస్కర్‌ను కలిసేందుకు వచ్చినట్టు చెప్పారు. రాహుల్‌పై ఇటీవల జరిగిన దాడికి, ఈ భేటీకి ఎలాంటి సంబంధం లేదని వివరణ ఇచ్చారు. రాహుల్‌పై జరిగిన దాడి ఘటనను ప్రస్తావిస్తూ.. పబ్‌కు వెళ్లడం తప్పుకాదని, దాడి జరగడం సరికాదని వ్యాఖ్యానించారు.



గొడవలు, భిన్నాభిప్రాయాలు ఉంటే మాట్లాడుకోవాలని.. సినిమా ఇండస్ట్రీ వాళ్లను ఎవరు పడితే వాళ్లు కొడతారా అని ప్రశ్నించారు. రాహుల్ పక్షాన నిలబడి న్యాయం కోసం పోరాడతామని తెలిపారు. కాగా, ప్రకాశ్‌రాజ్‌తో భేటీకి సంబంధించి వినయ్ భాస్కర్ కూడా స్పందించారు. ఒక సినిమా వేడుకకు సంబంధించిన అంశంపై మాత్రమే తమ మధ్య చర్చ జరిగిందని, సినిమా షూటింగ్‌కు సంబంధించిన పనిమీద ప్రకాశ్‌రాజ్, రాహుల్ సిప్లిగంజ్ తనను కలిశారని వెల్లడించారు. రాహుల్‌తో పబ్‌లో జరిగిన గొడవకు తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టంచేశారు.

## రాష్ట్రంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు అమలు చేయాలి

- హైకోర్టులో 'ఫోరం ఫర్ ఎగైనెస్ట్ కరప్షన్' పిల్

**సాక్షి, హైదరాబాద్:** రోగుల నుంచి ఆస్పత్రులు భారీగా వసూలు చేస్తున్న ఫీజులపై నియంత్రణ ఉండేలా పదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–2010ని అమలు చేసేలా ఆదేశాలివ్వాలని ఫోరం ఫర్ ఎగైనెస్ట్ కరప్షన్ అనే సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, కేంద్ర ఆరోగ్య శాఖలను ప్రతివాదులుగా పేర్కొంది. 'ఆస్పత్రుల్లో కనీస ప్రమాణాలు పాటించడంతో పాటు రోగుల నుంచి నిర్దిష్ట ఫీజులను మాత్రమే వసూలు చేయాలని కేంద్రం చేసిన చట్టాన్ని 2012లో నోటిఫై చేసింది. రాష్ట్ర శాసనసభ కూడా ఆ చట్టాన్ని 2017లో ఆమోదించింది. జిల్లా స్థాయిల్లో అథారిటీలు, రాష్ట్ర స్థాయిలో కౌన్సిల్ ఫర్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఏర్పాటు చేయాలన్న చట్ట నిబంధనల్ని నేటికీ అమలు చేయలేదు. పేదలకు తక్కువ ఫీజుతో వైద్యం అందజేయాలనే చట్టం అమలు జరిగేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఉత్తర్వులు ఇవ్వాలి..' అని పిల్‌లో హైకోర్టును కోరింది.

# 40.66 లక్షల మంది రైతులకు రుణమాఫీ



- ప్రాథమికంగా నిర్ధారించిన ఎస్ఎల్‌బీసీ, వ్యవసాయశాఖ
- రూ.25వేల లోపు రుణాలు ఒకేసారి మాఫీ
- చెక్కుల ద్వారా ఈనెలలోనే పంపిణీ
- మిగిలిన రూ.24,736 కోట్లు విడతలవారీగా మాఫీ

**పంటరుణాల లెక్క ఇదీ..**

| కేటగిరీ | రైతులు (లక్షల్లో) | రుణ మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| రూ.25వేల లోపు | 5.83 | 1,198 |
| రూ.25వేల నుంచి రూ.50 వేలు | 8.14 | 3,104 |
| రూ.50వేల నుంచి రూ.75 వేలు | 8.81 | 5,061 |
| రూ.75వేల నుంచి రూ.ఒక లక్ష | 7.09 | 5,776 |
| రూ.లక్ష పైన ఎంత తీసుకున్నా రూ.లక్ష వరకు మాఫీ చేస్తే.. | 10.79 | 10,795 |

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి 40.66 లక్షల మంది రైతులు అర్హులు కానున్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ), వ్యవసాయ శాఖ ప్రాథమికంగా నిర్ధారించాయి. రూ.25వేల లోపు ఉన్న పంట రుణాలన్నింటినీ ఏకకాలంలో మాఫీ చేస్తామని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ఈ నెలలో రూ.1,198 కోట్లు విడుదల చేయనున్నారు. అయితే, నేరుగా రైతుల ఖాతాల్లోకి నిధులు బదిలీ చేయకుండా సంబంధిత ఎమ్మెల్యేల చేతుల మీదుగా చెక్కుల ద్వారా పంపిణీ చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. తక్కువ మొత్తంలో పంట రుణం తీసుకున్న చిన్న, సన్నకారు రైతుల్లో ఎక్కువ మందికి ఉపయోగకరంగా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన రూ.24,736 కోట్లు విడతలవారీగా మాఫీ చేయనున్నారు. అయితే ప్రభుత్వం రుణమాఫీ అమలు మార్గదర్శకాల్లో ఇచ్చే నిబంధనల ఆధారంగా రైతుల సంఖ్యతోపాటు మాఫీ మొత్తం కూడా కొంత తగ్గే అవకాశం కూడా ఉందని అధికారులు చెబుతున్నారు.

**కేటగిరీలవారీగా నివేదిక...**

రుణమాఫీకి సంబంధించి కేటగిరీలవారీగా ఓ నివేదికను వ్యవసాయశాఖ ప్రభుత్వానికి పంపింది. రూ.25వేల వరకు ఉన్న రుణాలను ఒక కేటగిరీగా, రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు రెండో కేటగిరీగా, రూ.50వేల నుంచి రూ.75వేల వరకు మూడో కేటగిరీగా, రూ.75వేల నుంచి రూ.లక్ష వరకు నాలుగో కేటగిరీగా పేర్కొన్నారు. ఇక రూ.లక్ష పైన ఎంత రుణం తీసుకున్నప్పటికీ రూ.లక్ష మాత్రమే మాఫీ చేయనున్నారు. 2018 డిసెంబర్ 11వ తేదీ వరకు ఉన్న రూ.లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేస్తారు. రూ.25వేల లోపు ఉన్న రుణాలను ఒకేసారి మాఫీ చేశాక, రూ.50వేల వరకు ఉన్న రుణాలను కూడా ఒకేసారి మాఫీ చేయాలంటే రూ.3,104 కోట్లు కావాలి. ఈ ఏడాది బడ్జెట్‌లో రుణమాఫీకి రూ.6,225 కోట్లు ప్రతిపాదించినందున రూ.50వేల వరకు ఉన్న రుణాలను కూడా ఒకేసారి చెక్కుల ద్వారా మాఫీ చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గతంలో రుణమాఫీ సందర్భంగా రైతులకు తలెత్తిన ఇబ్బందులు కలగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఒక అధికారి తెలిపారు.

## 716 కళాశాలలకు... ఏదీ గుర్తింపు..?

- ఈ–పాస్ వెబ్‌సైట్‌లో కనిపించని వివరాలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుకు ఇదే కీలకం
- 2019–20 సంవత్సరం దరఖాస్తుల పరిశీలనకు తీవ్ర ఇబ్బందులు

**సాక్షి, హైదరాబాద్:** పోస్టుమెట్రిక్ విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం దరఖాస్తుల పరిశీలన ప్రహసనంగా మారింది. 2019–20 విద్యా సంవత్సరానికి గాను పలు కళాశాలలు ఇప్పటికీ యూనివర్సిటీ/బోర్డు గుర్తింపు పొందిన పత్రాలను సంక్షేమ శాఖలకు సమర్పించలేదు.ఏటా పునరుద్ధరీకుంచుకున్న తర్వాత వాటిని సంక్షేమశాఖ కార్యాలయంలో, ఈ–పాస్ వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.కానీ ప్రస్తుత విద్యా సంవత్సరానికి చెందిన 716 కాలేజీలు ఇప్పటికీ గుర్తింపు/రెన్యువల్ పత్రాలను సమర్పించకపోవడం గమనార్హం.

**5,712 కళాశాలలకు లభించిన ధ్రువీకరణ..**

రాష్ట్ర వ్యాప్తంగా 6,428 ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, వృత్తివిద్యా కాలేజీలున్నాయి. ఇందులో అత్యధికంగా 2,888 ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు పొంది ఉన్నాయి. 2019–20 విద్యా సంవత్సరానికి గాను అవన్నీ గుర్తింపు పత్రాలు సమర్పించాయి. మిగతా డిగ్రీ, పీజీ, వృత్తి విద్యా కాలేజీల్లో చాలా వరకు గుర్తింపు పత్రాలను సమర్పించలేదు.కొన్ని ఈ–పాస్ వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ పూర్తిస్థాయి డాక్యుమెంట్లు సమర్పించని కారణంగా సంక్షేమ శాఖాధికారులు వాటిని ధ్రువీకరించలేదు.రాష్ట్రంలో 6,428 కాలేజీల్లో ఇప్పటివరకు కేవలం 6,120 మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. ఇందులో 5,712 మాత్రమే ధ్రువీకరణ పొందాయి.

**ఆ కాలేజీ విద్యార్థులకే ఫీజులు...**

ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించేనాటికే గుర్తింపు పత్రాలు, రెన్యువల్ వివరాలను సంక్షేమ శాఖలకు సమర్పించాలి. అలాంటి వాటికే వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. అప్పుడు ఆయా కళాశాలల విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునే వీలుంటుంది.కానీ గుర్తింపు పత్రాల సమర్పణ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే పూర్తి కావడం లేదని, పలు యూనివర్సిటీలు/ బోర్డులు వీటిని జారీ చేసేందుకు తీవ్ర జాప్యం చేస్తున్నందున విద్యార్థుల దరఖాస్తుకు అనుమతి ఇవ్వాలని పలు కాలేజీల యాజమాన్యాలు కోరాయి.దీంతో స్పందించిన ప్రభుత్వం ఆమేరకు అవకాశం కల్పించింది.2019–20 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 12.58లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది.ఈ–పాస్ వెబ్ పోర్టల్‌లో ధ్రువీకరణ పొందిన కాలేజీ విద్యార్థుల దరఖాస్తులు మాత్రమే పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు. ఇంకా ధ్రువీకరణ పొందని వాటి యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. వాటిని అందుకున్న కళాశాలలు స్పందించి పత్రాలు సమర్పించకుంటే ఆ కాలేజీ విద్యార్థుల దరఖాస్తుల పరిశీలనను నిలిపివేస్తారు. మొత్తంగా అన్ని పత్రాలు సమర్పించిన కళాశాలల విద్యార్థుల దరఖాస్తులు మాత్రమే పరిశీలించి ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# 6 లక్షల కోట్లపైనే!

- రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు భారీగా ఖర్చు
- రాబడుల్లో 96 శాతం ఖర్చుతో రికార్డు
- అత్యధికంగా ఈ ఏడాదే ఎక్కువ వ్యయం
- ఇప్పటివరకు వచ్చిన అన్ని రకాల రాబడులు రూ. 6.6 లక్షల కోట్లు
- రాష్ట్రంలోని ప్రతి వ్యక్తిపై ఇప్పటివరకు అయిన ఖర్చు రూ. 1.81 లక్షలు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఆరేళ్లలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం ఖర్చయిన మొత్తం అక్షరాలా రూ. 6 లక్షల కోట్లపైనే. రాష్ట్రం ఏర్పడిన అనతి కాలంలోనే ప్రగతికి బాటలు పడడం, హైదరాబాద్ విశ్వనగరంగా రూపాంతరం చెందుతుండటంతో ఆ అభివృద్ధి ఫలాలు రాష్ట్ర ప్రభుత్వానికి కాసుల రూపంలో కలిసొచ్చాయి. దీంతో 2016–17లోనే రాష్ట్ర ప్రభుత్వ రాబడులు రూ. లక్ష కోట్లు దాటాయి. ప్రభుత్వం కూడా మిగులు బడ్జెట్ గురించి ఆలోచన చేయకుండా రాబడులను దాదాపు పూర్తిగా అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చు చేయడంతో ఇప్పటివరకు రూ. 6.35 లక్షల కోట్లకుపైగా ఖర్చయింది. సంవత్సరాలవారీగా పరిశీలిస్తే 2014–15లో రూ. 61,840 కోట్లు ఖర్చు కాగా ఆ తర్వాతి ఏడాది రూ. 90 వేల కోట్లు దాటింది. ఇక మూడో ఏడాది నుంచి రూ. లక్ష కోట్లు దాటిన ప్రభుత్వ ఖర్చు ప్రస్తుత ఏడాదికి వచ్చే సరికి రూ. 1.42 లక్షల కోట్లకు చేరింది. అంటే ఆరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరపతి 100 శాతంకన్నా ఎక్కువకు చేరిందన్నమాట. గత ఆరేళ్లలో రూ. 6.6 లక్షల కోట్ల రాబడులు రాగా అందులో 96 శాతం మేర అంటే రూ. 6.3 లక్షల కోట్లను ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చు పెట్టింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ ఖర్చు ప్రతి వ్యక్తిపై రూ. 1.81 లక్షలకుపైగా కావడం విశేషం.



**కాగ్ లెక్కల ప్రకారం గత ఐదేళ్లలో రాష్ట్ర రాబడులు, ఖర్చులు (రూ. కోట్లలో)**

| సంవత్సరం | మొత్తం రాబడి | మొత్తం వ్యయం |
|---|---|---|
| 2014-15 | 63,323.29 | 61,840.48 |
| 2015-16 | 96,051.29 | 90,818.44 |
| 2016-17 | 1,17,799.40 | 1,14,397.62 |
| 2017-18 | 1,15,587.35 | 1,09,384.62 |
| 2018-19 | 1,25,554.70 | 1,16,804.25 |
| 2019-20 | 1,43,273.18 | 1,42,152.28 |
| మొత్తం | 6,61,589.21 | 6,35,372.44 |

(నోట్: 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లెక్కలు ఈ నెల 31 వరకు అంచనా మాత్రమే. ఈ ఏడాది లెక్కలు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినవి.)

# సగం మందికి సంతకం రాదు

- మధ్యవయస్కుల్లో నిరక్షరాస్యులు 48.39% మంది
- 50 ఏళ్లు పైబడిన వారిలో 35.85 శాతం మందే అక్షరాస్యులు
- జాతీయ సగటు కంటే రాష్ట్రంలో అక్షరాస్యత 6.44 శాతం తక్కువ
- ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకే 'ఈచ్ వన్ టీచ్ వన్'కు శ్రీకారం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో 35 ఏళ్లు దాటిన వారిలో 48.39 శాతం మంది నిరక్షరాస్యులే ఉన్నారు. అంటే దాదాపు సగం మంది నిరక్షరాస్యులేనన్న మాట. ఇక 50 ఏళ్లు పైబడిన వారిలో 35.85 శాతం మందే అక్షరాస్యులు ఉన్నారు. అంతేకాదు.. జాతీయ సగటు అక్షరాస్యత శాతం 72.98 ఉంటే రాష్ట్రంలో అక్షరాస్యత శాతం 66.54 ఉంది. జాతీయ సగటు అక్షరాస్యతతో పోలిస్తే 6.44 శాతం తక్కువగా ఉంది. ఈ విషయాన్ని 'సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్'స్పష్టం చేస్తోంది. జాతీయ స్థాయిలో రాష్ట్రం దిగువ నుంచి మూడో స్థానంలో ఉండటాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం... యువతకు విద్యను అందించడమే కాదు వయోజనులను అక్షరాస్యులను చేసే కార్యక్రమాన్ని సైతం భుజానికెత్తుకుంది. రాష్ట్రాన్ని సంపూర్ణ అక్షరాస్యతగల రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు స్వయంగా సీఎం కేసీఆర్ నడుం బిగించారు. ఈచ్ వన్ టీచ్ వన్ నినాదాన్ని ఇచ్చి అక్షరయజ్ఞం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో ఎమ్మెల్యేలు సహా ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లోనూ రూ.100 కోట్లు ఇందుకోసమే కేటాయించారు.



**గతేడాది నుంచే చర్యలు చేపట్టినా...**

రాష్ట్రంలో అక్షరాస్యతను పెంచేందుకు ప్రభుత్వం గతేడాదే కార్యాచరణ ప్రారంభించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు 'ఈచ్ వన్ టీచ్ వన్'అమలుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మొదట గ్రామాలపై దృష్టి సారించింది. రెండో దశ పల్లె ప్రగతిలో గ్రామ పంచాయతీలవారీగా 18 ఏళ్లు పైబడిన వారిలో అక్షరాస్యులు ఎందరు.. నిరక్షరాస్యులు ఎందరు అన్నది గుర్తించేందుకు సర్వే నిర్వహించింది. ఆ తరువాత పైలట్ ప్రాజెక్టుగా 'స్టూడెంట్–పేరెంట్/గ్రాండ్ పేరెంట్ లిటరసీ'కార్యక్రమాన్ని గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభించింది. ఇందులో విద్యార్థులు తమ తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు, నానమ్మలకు చదవు చెప్పే కార్యక్రమాన్ని నిర్వహించారు. 1,779 పాఠశాలలకు చెందిన 1,38,707 మంది విద్యార్థులు ఇందులో పాల్గొనగా 1,64,068 మంది నిరక్షరాస్యులు నమోదు చేసుకున్నారు. ఇప్పుడు రెండో దశలో పట్టణాల్లోనూ నిరక్షరాస్యులను గుర్తించి 'ఈచ్ వన్ టీచ్ వన్'ను యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో ప్రజాప్రతినిధులు సహా చదువుకున్న వారందరినీ భాగస్వాములను చేసేందుకు కసరత్తు చేస్తోంది.

**వయసులవారీగా అక్షరాస్యుల శాతం..**

| వయసు | రాష్ట్రంలో | దేశంలో |
|---|---|---|
| 7–14 | 90.56 | 87.92 |
| 15–24 | 86.97 | 86.14 |
| 25–34 | 69.62 | 75.28 |
| 35–49 | 51.61 | 63.73 |
| 50పైబడిన | 35.85 | 49.42 |
| మొత్తం | 66.54 | 72.98 |

## వెదురు సాగుపై కొంకణ్‌లో అధ్యయనం

**మాజీ ఎంపీ వినోద్ పరిశీలన**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో వెదురు సాగుకు మెరుగైన అవకాశాలున్న నేపథ్యంలో దీన్ని సద్వినియోగం చేసుకునేందుకు గాను ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అధ్యయనం ప్రారంభించారు. రాష్ట్రానికి చెందిన వెదురు నిపుణుల బృందంతో కలిసి మహారాష్ట్రలోని సింధ్ దుర్గ్ జిల్లా కుడాల్ తాలూకా శివారులో ఉన్న వెదురు పరిశ్రమలు, క్షేత్రాలను రెండు రోజుల పాటు ఆయన సందర్శించారు. అక్కడి రైతులతో మాట్లాడి వెదురు సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుడాల్ పట్టణ పారిశ్రామికవాడలోని కొంకణ్ వెదురు పరిశ్రమలను పరిశీలించారు. వినోద్ వెంట టీఆర్ఎస్ మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ ఎల్. వెంకట్రాం రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) డైరెక్టర్ అఖిలేందర్ రెడ్డి, ఎన్నారై శ్రీనివాస్ గోగినేని, కెనడా దేశ వెదురు నిపుణులు సుధీర్ కోదాటి, కృష్ణ కోమండ్ల తదితరులున్నారు.

# పూర్తి అప్రమత్తంగా ఉన్నాం

**కోవిడ్ నియంత్రణపై సీఎస్ వివరణ**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కోవిడ్ ప్రబలకుండా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అప్రమత్తతతో ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా క్రమంగా కోవిడ్ పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటు కేంద్రం, అటు రాష్ట్రాలకు సంబంధించిన సంబంధిత విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేసి కోవిడ్‌ను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్రాలకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారిని క్షుణ్నంగా పరిశీలించాలని సూచించారు. సాధారణ ప్రజల్లో కోవిడ్‌పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో కరోనా వైరస్ ప్రబలకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని సోమేశ్‌కుమార్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ యోగితారాణా, హైదరాబాద్ కలెక్టర్ శ్వేతా మొహంతి, టీఎస్ఐఐసీ డైరెక్టర్ ప్రీతి మీనా, ఐఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ డైరెక్టర్ వర్షిణి పాల్గొన్నారు.

# తుపాకీతో కాల్చుకుని డాక్టర్ ఆత్మహత్య

- మృతుడు శ్రీ ఆదిత్య ఆస్పత్రి ఎండీ
- భార్యతో ఘర్షణ.. అనంతరం ఘటన
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

**హైదరాబాద్:** దమ్మాయిగూడలోని శ్రీఆదిత్య ఆస్పత్రి ఎండీ డాక్టర్ రవీంద్రకుమార్ తన లైసెన్స్‌డ్ తుపాకీతో కాల్చుకుని సోమవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి కాప్రా సాకేత్ మిథిల ఎన్‌క్లేవ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ భిక్షపతిరావు తెలిపిన వివరాల ప్రకారం..జిల్లా కేంద్రం సిద్దిపేటకు చెందిన డాక్టర్ రవీంద్రకుమార్, డాక్టర్ స్మిత దంపతులు. వీరికి ఒక కుమారుడు. వీరు ఆరేళ్ల క్రితం దమ్మాయిగూడలో శ్రీ ఆదిత్య ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. కాప్రా సాకేత్ సమీపంలోని మిథిల ఎన్‌క్లేవ్‌లోని ఫ్లాట్ నంబర్ 57లో నివాసం ఉంటున్నారు. ఆదివారం రవీంద్రకుమార్, స్మిత దంపతుల మధ్య బంధువుల ఫంక్షన్‌కు వెళ్లే విషయమై ఘర్షణ జరిగింది. రాత్రి 11 గంటల సమయంలో కుమారుడిని తీసుకుని స్మిత దిల్‌సుఖ్‌నగర్‌లోని తల్లిగారింటికి వెళ్లారు. ఆ తర్వాత రాత్రి 2 గంటల సమయంలో రవీంద్రకుమార్ తన కుమారుడికి ఫోన్‌చేసి మాట్లాడారు. అనంతరం ఆయన తన వద్ద ఉన్న తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

**ఘటన వెలుగు చూసిందిలా..**

స్మిత చెల్లెలు స్వప్న ఆదిత్య ఆసుపత్రిలోనే పని చేస్తోంది. సోమవారం ఉదయం ఆసుపత్రికి వచ్చి రవీంద్రకుమార్‌కు ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయలేదు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఫ్లాట్‌కువెళ్లి చూడగా డాక్టర్ రవీంద్రకుమార్ రక్తపుమడుగులో పడి ఉన్నారు. పక్కనే తుపాకీ ఉంది. వెంటనే ఆమె పోలీసులకు సమాచారమిచ్చారు. కుషాయిగూడ ఏసీపీ శివకుమార్ ఘటన స్థలానికి చేరుకుని డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో పరిసరాల్లో గాలించారు. రవీంద్రకుమార్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని కుటుంబసభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పేర్కొన్నారు. జవహర్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




దమ్మాయిగూడలోని శ్రీ ఆదిత్య ఆసుపత్రి



డాక్టర్ రవీంద్రకుమార్ చనిపోయిన అనంతరం కుడిచేయి కింద పడ్డ తుపాకీ

**డాక్టర్‌కు గతంలో 'మాజీ'ల బెదిరింపులు**

మాజీ నక్సలైట్ల పేరుతో 2015లో డాక్టర్ రవీంద్రకుమార్‌కు బెదిరింపులు వచ్చాయి. అప్పట్లో చాకచక్యంగా వ్యవహరించిన ఆయన తన ఆస్పత్రిలోనే 2016లో వారిని జవహర్‌నగర్ పోలీసులకు పట్టించారు. అప్పటి నుంచి ఫోన్ బెదిరింపులు వస్తుండటంతో లైసెన్స్‌డ్ గన్ తీసుకున్నారు. కాగా, జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక్కరోజు వ్యవధిలో ఓ జవాన్‌తో పాటు డాక్టర్ తమ వద్ద ఉన్న గన్‌లతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడడం కలకలం రేపుతోంది.

# సగం బీసీలకే

- నాలుగు రాజ్యసభ సీట్లలో రెండు బీసీలకే కేటాయించిన వైఎస్సార్‌సీపీ

**సాక్షి, అమరావతి:** బీసీల సాధికారత, సామాజిక న్యాయం దిశగా వడివడిగా అడుగులు వేస్తున్న వైఎస్సార్ సీపీ వారికి మరోసారి పెద్దపీట వేసింది. వైఎస్సార్ సీపీకి లభించే నాలుగు రాజ్యసభ స్థానాల్లో రెండింటిని బీసీలకే కేటాయించి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నిబద్ధతను చాటుకున్నారు. పార్టీ తరపున రాజ్యసభ అభ్యర్థులుగా ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రి మోపిదేవి వెంకటరమణరావు, పార్టీ నేత ఆళ్ల అయోధ్య రామిరెడ్డితోపాటు ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ సన్నిహితుడు, రిలయన్స్ గ్రూప్ కార్పొరేట్ వ్యవహారాల ప్రెసిడెంట్ పరిమల్ ధీరజ్‌లాల్ నత్వానీని ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి, పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, శాసన మండలిలో పార్టీ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు సోమవారం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ ఏపీ నుంచి ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాలను ఏకగ్రీవంగా గెలుచుకోవడం ఖాయమన్నది తెలిసిందే.



అపోలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి బయటకు వస్తున్న దత్తాత్రేయ

# దత్తాత్రేయకు అస్వస్థత

- ఛాతీనొప్పితో అపోలో ఆస్పత్రిలో చేరిక
- వైద్య పరీక్షల అనంతరం డిశ్చార్జి

హైదరాబాద్: హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ అస్వస్థతకు గురయ్యారు. ఛాతీనొప్పితో హైదర్‌గూడ అపోలో ఆస్పత్రిలో చేరారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు హిమాచల్‌ప్రదేశ్‌కు పయనమయ్యే సమయంలో ఆయన తీవ్ర ఛాతీనొప్పికి గురయ్యారు. సహాయకులు వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఆయనకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం అపోలో మేనేజింగ్ డైరెక్టర్ సంగీతరెడ్డి.. దత్తాత్రేయ క్షేమంగా ఉన్నారని మీడియాకు తెలిపారు. మధ్యాహ్నం 3.20 సమయంలో ఆయనను డిశ్చార్జ్ చేశారు. అంతకు ముందు ఆయనను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పరామర్శించారు.

**నేను బాగానే ఉన్నాను**

డిశ్చార్జ్ అనంతరం ఆస్పత్రి వద్ద గవర్నర్ దత్తాత్రేయ మీడియాతో మాట్లాడారు. రెగ్యులర్ చెకప్‌లో భాగంగానే ఆస్పత్రికి వచ్చానని, తనకెలాంటి ఆరోగ్య సమస్యలు లేవన్నారు. కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు చెప్పారన్నారు. రాష్ట్ర ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఆయన హిమాచల్‌ప్రదేశ్ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు.

# ఫారెస్ట్ బ్లాక్‌ల అభివృద్ధి

**పట్టణాలు, దాని పరిసరాల్లో వాయు నాణ్యత పెంచేందుకు ప్రణాళికలు**

**7 ఫారెస్ట్ బ్లాక్‌లు, క్లస్టర్లు ఎకో టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి..**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఫారెస్ట్ బ్లాక్‌ల అభివృద్ధి ప్రాధాన్యత సంతరించుకుంది. హైదరాబాద్‌తో సహా అన్ని నగరాలు, పట్టణాలు, వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో వాయు నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు చేపడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో వివిధ రూపాల్లో కాలుష్యం పెరగడంతో పాటు, పచ్చదనం తగ్గిపోతుండటంతో నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి లభించడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ పట్టణ ప్రాంతాలు, నగరాలకు సమీపంలోని ఫారెస్ట్ బ్లాక్‌లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వం అమలుచేస్తోంది. ఫారెస్ట్ బ్లాక్‌ల బౌండరీలను పరిరక్షించడంతో పాటు ఈ బ్లాక్‌ల అభివృద్ధి ద్వారా పట్టణవాసులకు ఆరోగ్యకరమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి అందుబాటులోకి తెచ్చేందుకు ఉపయోగపడనున్నాయి. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, పర్యాటక, అటవీ, పరిశ్రమలు, తదితర శాఖలను భాగస్వాములను చేయడం ద్వారా ఈ బ్లాక్‌లను ఒక ఉద్యమ స్ఫూర్తితో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలో (వివిధ జిల్లాల్లో) 1.58 లక్ష ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 188 ఫారెస్ట్ బ్లాక్‌లున్నాయి. వాటిలో జనావాసాలకు దగ్గరగా ఉన్న 52 ఫారెస్ట్ బ్లాక్‌లు, క్లస్టర్లను అర్బన్ ఫారెస్ట్ పార్కులుగా అభివృద్ధి చేయనున్నారు. 7 ఫారెస్ట్ బ్లాక్‌లు, క్లస్టర్లు ఎకో టూరిజం పార్కులుగా అభివృద్ధి చేసేందుకు అనువుగా ఉండటంతో వాటిని ఎకో టూరిజం స్పాట్లుగా అభివృద్ధి చేస్తున్నారు. 70 బ్లాక్‌లు, క్లస్టర్లు జనావాసాలకు దూరంగా ఉండటంతో వాటిని కన్జర్వేషన్ బ్లాక్‌లుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మిగతా 89 బ్లాక్‌లు మరో 30 క్లస్టర్లలో ఉన్నాయి. ఇప్పటిదాకా 32 అర్బన్ ఫారెస్ట్ పార్కులు పూర్తయి, ప్రజలకు అందుబాటులోకి వచ్చి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మరో 46 ప్రాంతాల్లో అర్బన్ పార్కుల పనులు ఇప్పటికే మొదలు కాగా, ఇతర చోట్ల పనులు ఇంకా మొదలు కావాల్సి ఉంది.

# ప్రైవేటుకు పరుగు

**ఆంగ్ల మాధ్యమం లేక ప్రభుత్వ స్కూళ్లలో తగ్గుతున్న విద్యార్థులు**

**ప్రైవేటు పాఠశాలల్లో ఏటేటా పెరుగుతున్న ప్రవేశాలు**

**74.02 శాతం సర్కారీ బడుల్లో చదువుతున్నది 46.82 శాతం పిల్లలే**

**అదే 25.98 శాతం ప్రైవేటు స్కూళ్లలో ఏకంగా 53.18 శాతం విద్యార్థులు**

**'సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్'లో వెల్లడి**

**త్వరలోనే ప్రభుత్వ స్కూళ్లలో పూర్తిస్థాయిలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టే దిశగా అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించేందుకు ప్రైవేటు స్కూళ్ల బాట పడుతున్నారు. ఆర్థికంగా కష్టమైనా, అప్పులు చేసి మరీ ప్రైవేటులో చదివించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ప్రైవేటు స్కూళ్లకు వెళ్లే విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. మరోవైపు ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. రాష్ట్రంలో అత్యధికంగా ప్రభుత్వ పాఠశాలలే ఉన్నా ఆంగ్ల మాధ్యమం లేకపోవడంతో విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు దూరం అవుతున్నారు. రాష్ట్రంలో 74.02 శాతం ప్రభుత్వ పాఠశాలలు ఉంటే అందులో కేవలం 46.82 శాతం మంది విద్యార్థులే చదువుతున్నారు. అదే ప్రైవేటు పాఠశాలలు 25.98 శాతమే ఉన్నా వాటిల్లో ఏకంగా 53.18 శాతం పిల్లలు చదువుకుంటున్నారు. 2016–17 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 58.67 లక్షల మంది విద్యార్థులు ఉండగా అందులో ప్రభుత్వ పాఠశాలల్లో 28.33 లక్షల మంది (48.28 శాతం) చదివారు. అదే 2018–19 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 27.49 లక్షలకు 46.82 శాతం) తగ్గిపోయింది. అంటే మూడేళ్లలో 84 వేల మంది (1.46 శాతం) ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిపోయారు. అదే ప్రైవేటు పాఠశాలల్లో 2016–17 విద్యా సంవత్సరంలో 30.34 లక్షల మంది విద్యార్థులు ఉండగా 2018–19 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 31.22 లక్షలకు పెరిగింది. ఇదే విషయాన్ని 'సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్'కూడా స్పష్టం చేసింది. అందుకే ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమాన్ని పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టే దిశగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శాసనమండలిలో వెల్లడించిన అంశం ఇదే విషయాన్ని బలపరుస్తోంది.

**ఇంగ్లిష్ మీడియం స్కూళ్లపై సీఎం ఏమన్నారంటే...**

'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. ఆ నిర్ణయాన్ని అక్కడి ప్రజలు మెచ్చుకుంటున్నారు. నేనే ఒక టీవీ ఇంటర్వ్యూలో చూశా. కూలి పని చేసుకునే మహిళ కూడా ఎంత ఖర్చయినా తమ పిల్లలను ప్రైవేటు స్కూల్‌కు పంపిస్తోంది. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం పెడితే అందులోనే చదివిస్తానని చెప్పింది. అందుకే విద్యావేత్తలు ఈ అంశాన్ని తేల్చాలి. బడ్జెట్ సమావేశాల తరువాత దీనిపై విద్యావేత్తలు, టీచర్ ఎమ్మెల్సీలతో సమావేశమై చర్చించి ఓ విధానాన్ని రూపొందించండి. చివరగా నేను అందులో పాల్గొంటా. ఈ విషయంలో ఎలా ముందుకెళ్లాలన్న అంశంపై నిర్ణయం తీసుకుందాం'అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

**సానుకూల చర్యల దిశగా అడుగులు...**

ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరమే నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ రంగంలోనూ ఆంగ్ల మాధ్యమ స్కూళ్లకు అనుమతులు ఇవ్వడం గతేడాది ప్రారంభించింది. అయితే స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధించే టీచర్లు సిద్ధంగా ఉన్నారని, సరిపడా తరగతి గదులు, వసతులు ఉన్నాయని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు తీర్మానం చేసి పంపిస్తేనే ఇంగ్లిష్ మీడియం స్కూళ్లకు అనుమతులు ఇస్తోంది. అయితే ఇకపై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల తీర్మానంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే ఇంగ్లిష్ మీడియం ఏర్పాటు చేసే దిశగా అడుగుగులు పడుతున్నాయి.

**ప్రభుత్వ పాఠశాలల్లో బీసీలే అత్యధికం..**

రాష్ట్రంలోని సంక్షేమ శాఖల పరిధిలోని గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, కేంద్ర ప్రభుత్వ స్కూళ్లు, ఎయిడెడ్ పాఠశాలలు మినహా మిగతా ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 20,47,503 మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో బీసీ విద్యార్థులే అత్యధికంగా 54.03 శాతం మంది ఉన్నట్లు 'సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్'వెల్లడించింది. జనరల్ విద్యార్థులు 7.65 శాతం ఉంటే ఎస్సీలు 24.52 శాతం ఉన్నట్లు తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా పరిషత్తు పాఠశాలల్లో ఎస్టీలు 13.80 శాతం మంది, బీసీలు 54.03 శాతం మంది చదువుతున్నట్లు వివరించింది. మరోవైపు ఈ పాఠశాలల్లో చదువుతున్న వారిలో అత్యధికంగా బాలికలే ఉన్నారు. అందులోనూ బీసీ బాలికలే ఎక్కువగా ఉండటం గమనార్హం.

**2016-17 నుంచి విద్యార్థుల వివరాలు (లక్షల్లో)..**

| సంవత్సరం | మొత్తం విద్యార్థులు | ప్రభుత్వ స్కూళ్లలో | ప్రైవేటు స్కూళ్లలో.. |
|---|---|---|---|
| 2016–17 | 58.67 | 28.33 | 30.34 |
| 2017–18 | 58.36 | 27.61 | 30.76 |
| 2018–19 | 58.71 | 27.49 | 31.22. |

**ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో బాలబాలికలు...**

| కేటగిరీ | బాలురు | బాలికలు | మొత్తం | శాతం |
|---|---|---|---|---|
| జనరల్ | 73036 | 83622 | 156658 | 7.65 |
| ఎస్సీ | 262328 | 239801 | 502129 | 24.52 |
| ఎస్టీ | 149223 | 133257 | 282480 | 13.80 |
| బీసీ | 536319 | 569917 | 1106236 | 54.03 |
| మొత్తం | 1020906 | 1026597 | 2047503 | 100 |

**యాజమాన్యాలవారీగా పాఠశాలలు, విద్యార్థులు..**

| యాజమాన్యం | స్కూళ్లు | విద్యార్థులు | విద్యార్థుల శాతం |
|---|---|---|---|
| ప్రభుత్వ | 26050 | 2047503 | 34.87 |
| ఇతర ప్రత్యేక స్కూళ్లు | 82 | 4647 | 0.08 |
| మోడల్ స్కూళ్లు | 194 | 124034 | 2.11 |
| కేజీబీవీ | 475 | 87106 | 1.48 |
| విద్యాశాఖ గురుకులాలు | 35 | 17613 | 0.3 |
| సోషల్‌వెల్ఫేర్ గురుకులాలు | 237 | 106224 | 1.81 |
| గిరిజన గురుకులాలు | 125 | 37242 | 0.63 |
| గిరిజన ఆశ్రమ స్కూళ్లు | 1774 | 99984 | 1.7 |
| బీసీ గురుకులాలు | 142 | 40938 | 0.7 |
| మైనారిటీ గురుకులాలు | 205 | 46609 | 0.79 |
| ఎయిడెడ్ | 678 | 98928 | 1.69 |
| కేంద్ర పాఠశాలలు | 51 | 38337 | 0.65 |
| ప్రైవేటు | 10549 | 3122026 | 53.18 |
| మొత్తం | 40597 | 5871081 | -- |

## సీఎం కేసీఆర్ హోలీ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంగుల పండుగను ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.




## ఆ లాబీయిస్టులే పార్టీకి శాపం: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: సొంత ప్రయోజనాల కోసం ఢిల్లీలో లాబీయింగ్ చేసుకునే నాయకులే కాంగ్రెస్ పార్టీకి శాపంగా మారారని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విమర్శించారు. ఢిల్లీలో లాబీయింగ్ తమ పార్టీ నేతలకు అనివార్యమని, అయితే వారిలో కొందరు పార్టీకి లాభం జరగాలని కోరుకునే వారుంటారని, మరికొందరు కేవలం వ్యక్తిగతంగా లాభం పొందాలనే ఆలోచనతోనే లాబీయింగ్ చేస్తారని, వారితోనే తమ పార్టీకి నష్టమని వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇది తమ పార్టీ దురదృష్టమని, వారి కారణంగా చాలా మంది హీరోలు ఢిల్లీలో జీరోలవుతున్నారని చెప్పారు. అలాంటివారి విషయంలో సోనియాగాంధీ అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్రంలో పార్టీ బాగుపడేలా చూడాలని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని, ఇలాంటి సమయంలో లాబీయింగ్‌లతో అంతర్గత పోరు మంచిది కాదని జగ్గారెడ్డి సూచించారు. జీవో 111పై రాజకీయ రాద్ధాంతం చేయడం అనవసరమని పేర్కొన్నారు.

## బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం

**13న కలెక్టరేట్ల వద్ద ధర్నా, రాస్తారోకోలు: జాజుల**



హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. లక్షా 82 వేల కోట్ల రూపాయల బడ్జెట్‌లో బీసీలకు రూ.4,356 కోట్లే కేటాయించడమేంటని ప్రశ్నించిన ఆయన.. భిక్షమేస్తున్నారా? అని నిలదీశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రూ.2.29 లక్షల కోట్ల అప్పు చేసిందని, అందులో బీసీలు రూ.1.15 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. బడ్జెట్‌లో బీసీ సబ్‌ప్లాన్ ఊసేలేదని, రూ.5,000 కోట్ల హామీ ఏమైందని ప్రశ్నించారు. బీసీలకు జరిగిన అన్యాయంపై ఈ నెల 13న అన్ని కలెక్టరేట్లు, ఆర్డీవో, ఎంఆర్‌వో కార్యాలయాల ఎదుట నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని, బీసీలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘాల నాయకులు కనకల శ్యాంనంద, కుల్కచర్ల శ్రీనివాస్, జాజుల లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లపై క్రీమీలేయర్ ఎత్తివేయాలి

**బీసీ ఉద్యోగ సంఘాల డిమాండ్**



హైదరాబాద్: బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమీలేయర్‌ను తొలగించాలని వివిధ బీసీ ఉద్యోగుల సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం, కేంద్ర ప్రభుత్వ ఓబీసీ ఉద్యోగుల సమైక్య, వైద్య ఆరోగ్య శాఖ, బీసీ ఉపాధ్యాయుల, మిధాని, ఎస్‌బీహెచ్, ఆంధ్రాబ్యాంక్, హెచ్‌సీఎల్, ఎన్‌ఎఫ్‌సీ తదితర 24 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకుల సమావేశం బీసీ భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. రిజర్వేషన్లు ఏడు వర్గాలకు ఉన్నాయని, ఏ వర్గానికి లేనటువంటి క్రీమీలేయర్ బీసీలకు పెట్టడం అన్యాయమన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్య్రం వచ్చి 72 ఏళ్లయినా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీ ఉద్యోగుల శాతం 12 శాతం దాటలేదన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. సమావేశానికి రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎలమశెట్టి నిరంజన్ అధ్యక్షత వహించగా పలువురు బీసీ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కాగా, బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించాలంటూ ఈ నెల 18, 19 తేదీల్లో తలపెట్టిన చలో ఢిల్లీని విజయవంతం చేయాలని ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి.

## జెడ్పీటీసీల సమస్యలను పరిష్కరించాలి: జెడ్పీటీసీ ఫోరం

సాక్షి, హైదరాబాద్: జెడ్పీటీసీల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలంగాణ జెడ్పీటీసీ ఫోరం ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్‌లో స్థానిక సంస్థలకు మొండిచేయి చూపారని సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. తమను ప్రజాప్రతినిధులుగా గుర్తించి అభివృద్ధిపనుల కోసం జెడ్పీటీసీలకు ప్రతి ఏటా రూ.30 లక్షలు, ఎంపీటీసీలకు రూ.10లక్షల చొప్పున కేటాయించాలని కోరారు.

## రైతును రాజు చేసేలా బడ్జెట్: లక్ష్మారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రైతును రాజు చేసేలా బడ్జెట్ ఉందని రైతు రుణ విముక్తి కమిషన్ సభ్యుడు కె.లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి ఎక్కువ నిధులు కేటాయించి రైతుకు భరోసా కల్పించారన్నారు. ముఖ్యంగా రైతు రుణమాఫీ, రైతు బంధు, బీమా, సాగునీరు, వ్యవసాయ విద్యుత్ రాయితీలు, వ్యవసాయ మార్కెటింగ్, ఇతర వ్యవసాయ రంగాలకు రూ.45వేల కోట్లు కేటాయించడం దేశానికే ఆదర్శమన్నారు.

# ఆర్థిక మాంద్యంలోనూ బీసీ సంక్షేమానికి పెద్దపీట

**మీడియాతో మంత్రులు తలసాని, శ్రీనివాస్ గౌడ్, గంగుల**



టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న తలసాని. చిత్రంలో గంగుల, శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఆర్థికమాంద్యంలోనూ వెనుకబడిన తరగతుల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ 2020–21కు ఆర్థిక రంగ నిపుణులతో పాటు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయని రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వి.శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్ తెలిపారు. టీఆర్‌ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో సోమవారం మంత్రులు మీడియాతో మాట్లాడారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేటాయింపులు పెరిగాయని, 70 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో బీసీలకు న్యాయం జరుగుతోందని పశు సంవర్ధక శాఖ మంత్రి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సబ్‌ప్లాన్ కంటే ఎక్కువ మేలు బీసీలకు కలిగేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని, కేసీఆర్‌ను బీసీలు శాశ్వతంగా గుర్తు పెట్టుకుంటారని తలసాని అన్నారు. గతంలో అంకెల కోసం బడ్జెట్ రూపొందిస్తే, తాము ఆచరణ సాధ్యమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. బడ్జెట్ తీరుతెన్నులపై ప్రతిపక్షాలు అర్థం లేని విమర్శలు చేస్తున్నాయని తలసాని వ్యాఖ్యానించారు. ఆర్థిక మాంద్యంలోనూ బీసీలు, అణగారిన వర్గాల కోసం రూ.30వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించామని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తాము బీసీ అనుకూల విధానాన్ని కొనసాగిస్తున్నందునే బీజేపీ పార్టీ బీసీ సామాజిక వర్గానికి చెందిన లక్ష్మణ్‌ను పార్టీ అధ్యక్షుడిగా కొనసాగిస్తోందన్నారు. దశాబ్దాల తరబడి కేంద్రంలో అధికారంలో కొనసాగిన కాంగ్రెస్, బీజేపీ కనీసం బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. కేసీఆర్‌ను మరో జ్యోతీరావు పూలేగా అభివర్ణించిన శ్రీనివాస్‌గౌడ్ పని చేసే వ్యక్తిని ప్రతిపక్షాలు విమర్శించడం సరికాదన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శిస్తే బీజేపీ, కాంగ్రెస్ పార్టీని బీసీ వర్గాలు కక్ష కట్టి మరీ ఓడిస్తాయని హెచ్చరించారు. బీసీలకు సబ్ ప్లాన్ అవసరమనుకుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ దానిని భవిష్యత్తులో పరిశీలిస్తారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు.

**ఎంబీసీలకు రూ.500 కోట్లు..**

అత్యంత వెనుకబడిన తరగతులకు (ఎంబీసీ) చెందిన వారి కోసం రూ.500 కోట్లు కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సమైక్య రాష్ట్రంలో ఇంత పెద్దమొత్తంలో బీసీల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులు జరగలేదని, అనేక ఇతర పథకాల ద్వారా కూడా బీసీలకు మేలు కలుగుతుందన్నారు. బీసీ ఫెడరేషన్ల ఖాతాలో నిధులు లేవనే ఆరోపణలను ఖండిస్తూ, గీత కార్మికుల సంక్షేమానికి గతంతో పోలిస్తే నిధుల కేటాయింపు పెరిగిందన్నారు. గతంలో ఎన్నికల సమయంలో వివిధ వర్గాలకు బడ్జెట్ కేటాయింపులు పెంచేవని, కానీ తమ ప్రభుత్వ విధానం మాత్రం అన్నివేళలా అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు.

## కొత్తగూడెం ప్రేమజంట కిడ్నాప్ యత్నం

- ఏపీలోని మచిలీపట్నంలో ఘటన
- సినీ ఫక్కీలో వెంబడించి పట్టుకున్న అక్కడి పోలీసులు

సాక్షి, మచిలీపట్నం: ఆదివారం రాత్రి 11 గంటలు దాటింది.. ఏపీలోని కృష్ణా జిల్లా మచిలీపట్నం బస్టాండ్.. ఓ యువజంట బస్టాండ్ టేబుల్‌పై కూర్చుంది. నలుగురు వ్యక్తులు మెరుపు వేగంతో వచ్చి ఆ జంటను చుట్టుముట్టారు. అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే బలవంతంగా ఈడ్చుకుంటూ విజయవాడ బస్సు ఎక్కించారు. మాట్లాడకుండా వారి నోరు నొక్కేశారు. ఇంతలో తన స్నేహితుడిని బస్సు ఎక్కించేందుకు బస్టాండ్‌కు వచ్చిన మచిలీపట్నం పీఆర్వో జాకబ్ ఆ జంటకు ఏ ఆపద వచ్చిందోనని బస్సును ఆపే ప్రయత్నం చేశారు. సాధ్యం కాకపోవడంతో 'సాక్షి' రిపోర్టర్‌కు సమాచారం ఇచ్చారు. తర్వాత ఫోన్‌లో పోలీసులకు చెప్పడంతో నైట్ పెట్రోలింగ్ చేస్తున్న పామర్రు పోలీసులు సినీ ఫక్కీలో బస్సును వెంబడించారు. ఆ జంటతో పాటు వార్ని బలవంతంగా తీసుకెళ్తున్న ఆ నలుగురు వ్యక్తులను బస్సు నుంచి అదుపులోకి తీసుకున్నారు. ఆరా తీయగా, వారు తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం ప్రాంతానికి చెందిన వారని గుర్తించారు. నాలుగు రోజుల క్రితం పారిపోయి బందరు ప్రాంతానికి వచ్చారు. ఎక్కడా ఆశ్రమం దొరక్కపోవడంతో రాత్రి పూట బస్టాండ్‌లో తలదాచుకునే వారని పోలీసుల విచారణలో గుర్తించారు. ప్రేమికులను తీసుకెళ్లేందుకు వచ్చిన వారిని మందలించారు. కొత్తగూడెం పోలీసులకు సమాచారం ఇచ్చి వారిని ఆ రాష్ట్రానికి ప్రత్యేక వాహనంలో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

## పీఆర్‌సీ, నిరుద్యోగుల సమస్యలపై త్వరలో ఉద్యమం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్**



సాక్షి, హైదరాబాద్ : నిరుద్యోగుల సమస్యలు, ఉద్యోగుల పీఆర్సీ కోసం త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ మాటలకు, టీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు, ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు పొంతనే లేదన్నారు. నిలువెల్లా అబద్ధాలతో కూడిన మోసపూరిత బడ్జెట్‌గా అభివర్ణించారు. రైతులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు, బీసీలు, ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీలు ఇలా అన్ని వర్గాలను మోసం చేశారని దుయ్యబట్టారు. ప్రస్తుత బడ్జెట్ 'బడ్జెట్ బారెడు–ఖర్చు జానెడు, పేరు గొప్ప–ఊరు దిబ్బ'అన్న చందంగా ఉందని విమర్శించారు. తలసరి ఆదాయం చెప్పిన ప్రభుత్వం అప్పును ఎందుకు చెప్పడం లేదు? లోటును ఎలా పూడ్చుతారో చెప్పలేదేంటని ప్రశ్నలు సంధించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, డబుల్ బెడ్‌రూం ఇళ్లు.. వంటి కీలకమైనవాటిని గాలి కొదిలేశారన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయకుండా నిరుద్యోగులను దారుణంగా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక్కొక్కరి తలపై రూ.91 వేలు అప్పు పెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని విమర్శించారు. 'నిరుద్యోగ భృతి అని చెప్పి ఏడాదిన్నర కావొస్తున్నా అతీగతి లేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకుండా, తాజాగా డబ్బులు ఇస్తామని కొత్త మోసం చేయబోతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు త్వరలో ఉన్నందునే నగరానికి రూ.పది వేల కోట్లు అంటున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంపై సాకు వేసి తమ అసమర్థతను కప్పిపుచ్చుకుంటున్నారన్నారు. జిల్లాకో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అన్నారు. ఏమైందని ప్రశ్నించారు. కరోనాకు పారాసిటమాల్ మందును డాక్టర్ కేసీఆర్ కనుగొన్నారా? అని ప్రశ్నించారు. ఎంఐఎంకు తలొగ్గి సీఏఏపై తీర్మానం చేస్తామంటున్నారని విమర్శించారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

SUNBEAM SCHOOL
VELLORE CAMPUS
WANTED EXPERT FACULTY
NEET Physics, Chemistry, Botany, Zoology
Package: 10 to 18 lakhs and above p.a.
JEE Advanced Physics, Chemistry, Maths
Package: 24 lakhs and above p.a.
Stay and other perks applicable
apply to vicechairman@sunbeamcbse.org
Contact: 70407 70407 www.sunbeamcbse.org

LOYOLA PUBLIC SCHOOL
Loyola Nagar, Nallapadu, Guntur-522005, Andhra Pradesh
email : loyolapublicschool.lps@gmail.com
Contact : 0863-2290268, 2951642, 98493 31642, 9121606671
A Catholic Minority Co-Ed. administered by the Society of Jesus, Established in 1964 and Affiliated to CISCE, New Delhi.
Syllabus - ICSE (Classes I to X) and ISC (Classes XI & XII)
TEACHING STAFF REQUIRED
- English & Mathematics (Classes IV to XII),
- Telugu & Hindi (Classes I to VIII)
- Biology, Physics & Chemistry (Classes VI to XII)
- History & Geography, Computer Applications (Classes VI to X)
- Accounts, History, Commerce, Economics, Business Studies (Classes XI to XII)
- Typist (English, Telugu & Hindi) with Pagemaker & Photoshop

NOTE: Qualification for ICSE (P.G., B.Ed.) Qualification for ISC (M.Ed, M.Phil., Ph.D)
Apply resume along with xerox copies of their certificates on or before (26-3-2020) by post/hand.
Date of Interview: 5th April 2020(Sunday) at 8:30 AM onwards/ Principal

# బాలికల హాస్టల్‌లో దూరిన యువకులు

- లైట్లు ఆర్పి గదిలోకి వెళ్లిన వైనం
- ప్రేమించాలంటూ బాలికలపై ఒత్తిడి
- నిందితులపై కేసు నమోదు

**కెరమెరి (ఆసిఫాబాద్):** ఆశ్రమ వసతి గృహాలకు రక్షణ లేకుండా పోయింది. ఇటీవల నార్నూర్ మండలంలోని ఓ హాస్టల్ గదిలో యువకుడు పగలంతా ఉన్న విషయాన్ని మరచిపోకముందే కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం మోడీ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ముగ్గురు యువకులు దూరి ప్రేమించాలంటూ బాలికలపై ఒత్తిడి తీసుకొచ్చిన సంఘటన చర్చనీయాంశమైంది. డీఎస్పీ సత్యనారాయణ కథనం ప్రకారం.. కెరమెరి మండలంలోని దేవాపూర్‌కు చెందిన రాథోడ్ భూపేందర్ (21), ఇదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలుడు, నార్నూర్ మండలం ఉమ్రి గ్రామానికి చెందిన రాథోడ్ బ్రహ్మనంద్ (21) ఆదివారం రాత్రి మోడీ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో లైట్లు ఆర్పి దూరారు. అదే పాఠశాలలో చదువుతున్న ముగ్గురు అమ్మాయిలను ప్రేమించాలంటూ ఒత్తిడి తీసుకొచ్చారు. ఇది గమనించిన మిగతా అమ్మాయిలు కేకలు పెడుతూ సిబ్బందికి సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న ఆ ముగ్గురు యువకులు పాఠశాల నుంచి పారిపోయారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సోమవారం ఆ ముగ్గురు బాలికలను పాఠశాల సిబ్బంది సమక్షంలో వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు వెల్లడించారు.



యశ్వంత్, రాకేష్, తిరుపతి మృతదేహాలు


కల్యాన్ (ఫైల్)

# పండుగ పూట విషాదం

- చెరువులో మునిగి నలుగురు విద్యార్థుల మృతి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఘటన

**సంగెం/భూపాలపల్లి అర్బన్/మల్హర్:** హోలీ వేడుకలు ముగించుకుని స్నానాల కోసం వెళ్లిన నలుగురు విద్యార్థులు చెరువులో మునిగి మృతి చెందారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సోమవారం వేర్వేరు ప్రాంతాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. వివరాలు.. వరంగల్ రూరల్ జిల్లా సంగెం మండలం కాపులకనిపర్తి గ్రామానికి చెందిన కందికట్ల యశ్వంత్ (13) బర్ల రాజ్‌కుమార్ (13), సదిరం రాకేష్ (12), దౌడు రాకేష్ (9) ఉదయం స్నేహితులతో కలసి హోలీ ఆడుకున్నారు. అనంతరం గ్రామంలోని పాయచెరువులో స్నానం చేసేందుకు వెళ్లి నలుగురు చెరువులోకి దిగారు. యశ్వంత్, దౌడు రాకేష్ మొరం కోసం తీసిన గోతిలో పడిపోయి చనిపోయారు. వారి వెనుక వెళ్లిన సదిరం రాకేష్ తృటిలో ప్రాణాల నుంచి బయటపడ్డాడు. అలాగే.. భూపాలపల్లి పట్టణంలోని జవహర్ నగర్ కాలనీ చెందిన మాచర్ల లక్ష్మీనారాయణ కుమారుడు మాచర్ల కల్యాన్(16) మల్హార్ మండలం తాడ్వాయి గ్రామ సమీప చెరువుకు వెళ్లారు. అందరూ నీటిలో దిగి ఈత కొడుతున్నారు. కల్యాన్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి పోయాడు. గమనించిన స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. హసన్‌పర్తి మండలం వడ్డెపెల్లి గ్రామం నిరూప్‌నగర్ తండాకు చెందిన భూక్య కవిత, యాదగిరి దంపతుల కుమారుడు భూక్య తిరుపతి (16) గ్రామంలోని దామోదర చెరువులోకి ఈతకు వెళ్లారు. తిరుపతి లోతైన గుంతలోకి ప్రమాదవశాత్తు జారి నీటిలో మునిగి పోయాడు.



## బురద మంచిదేగా..!

ఒంటికి బురద మంచిదేగా అంటున్నారు జగిత్యాల జిల్లాలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు. ప్రపంచాన్ని కరోనా వైరస్ వణికిస్తుండటంతో వీరు ఇలా వెరైటీగా హోలీ జరుపుకున్నారు. జగిత్యాల జిల్లాలోని పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం హోలీ వేడుకలను బురదలో నిర్వహించుకున్నారు. రంగులు ఆరోగ్యానికి హానికరంగా మారుతుండటంతో పాటు బురదతో మట్టిలోని పోషకాలు శరీరానికి లాభం చేస్తాయని ఇలా హోలీ నిర్వహించుకున్నట్లు వారు తెలిపారు.

– ఏలేటి శైలేందర్‌రెడ్డి, సాక్షి ఫొటోగ్రాఫర్, జగిత్యాల

**SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF A.P.LIMITED**
Corporate Office : H.No.19-13-65/A, Srinivasapuram, Tiruchanoor Road, Tirupati - 517503
**Tender Notice No. CGM/Projects/TPT/09/2019-20, Dt.10.03.2020**
Bids through "ape-procurement" are invited from the eligible bidders for the following works in Tirupati city of APSPDCL. The tenders will be made available in the website www.apeprocurement.gov.in as per the dates mentioned hereunder.

| Name of the Work | Date from which tender available |
| --- | --- |
| **System improvement project** for design, manufacture, supply, installation, testing and commissioning of 2 nos. 33/11kv GIS containerized substations **(e-house)** with 2 x 8.0 MVA PTRs each and other accessories & cable termination kits in Tirupati town on **semi-turnkey basis under smart city project** | 10.03.2020 23:00 Hr |

CHIEF GENERAL MANAGER/Projects.

**తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ, హైదరాబాద్**
గగన్ విహార్, 4వ అంతస్తు, నాంపల్లి, హైదరాబాద్
ఆర్.సి.నెం. 9/టియస్.ఆర్.జె.సి–సెట్/2020, తేది: 03.03.2020
**తెలంగాణ రాష్ట్ర గురుకుల (రెసిడెన్షియల్) జూనియర్ కాలేజీలలో ప్రవేశం కొరకు TSRJC-CET (టియస్.ఆర్.జె.సి–సెట్)–2020**
**ప్రవేశ పరీక్షా ప్రకటన**
తెలంగాణ రాష్ట్ర గురుకుల (రెసిడెన్షియల్) జూనియర్ కాలేజీలలో 2020–21 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఇంగ్లీషు మీడియం –MPC/BPC/MEC) లో 35 తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశం కొరకు తేది: 10.05.2020 నాడు జరుగు TSRJC-CET-2020 ప్రవేశ పరీక్షకు మార్చి–2020లో 10వ తరగతి పరీక్షకి హాజరౌతున్న తెలంగాణ 33 జిల్లాల విద్యార్థుల నుండి ఆన్‌లైన్ (http://tsrjdc.cgg.gov.in) ద్వారా దరఖాస్తులు తేది.16.03.2020 నుండి 15.04.2020 వరకు కోరబడుచున్నవి. దరఖాస్తు రుసుము: రూ.200/-. ప్రవేశ పరీక్షలో ప్రతిభ మరియు రిజర్వేషన్ ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగును. ఇతర వివరాల కొరకు http://tsrjdc.cgg.gov.in లో పొందుపర్చిన ఇన్ఫర్మేషన్ బుల్లెటిన్ చూడవచ్చును. వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 040-24734899, 9490967222.
సం/– కార్యదర్శి
Dipr Ro No.827-PP/CL/ADVT/1/2019-20 Dt.07/03/20



## 'వసంత' రాముడు

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దివ్యక్షేత్రంలో సోమవారం వసంతోత్సవం, డోలోత్సవం కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను బేడా మండపంలో వేంచేయింపజేసి విశ్వక్సేన ఆరాధన, పుణ్యావాచనం చేశారు. శ్రీ రామనవమి తలంబ్రాల కోసం తీసుకొచ్చిన బియ్యంపై ప్రోక్షించారు. తర్వాత డోలోత్సవం నిర్వహించారు. -భద్రాచలంటౌన్



## వైభవంగా లక్ష్మీనృసింహుని తెప్పోత్సవం

జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీనృసింహుని తెప్పోత్సవం–డోలోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామిని అశ్వావాహనంపై ఆసీనులను చేసి ఆలయం నుంచి బ్రహ్మపుష్కరిణికి తీసుకురాగా.. స్వామివారు హంస వాహనంపై ఊరేగారు. అనంతరం భోగ మండపంలో డోలోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. -ధర్మపురి

# కువైట్ బాటలో ఖతర్

**14 దేశాల నుంచి రాకపోకలపై నిషేధం**

- 'కరోనా' కట్టడికి ముందస్తు చర్యలు
- తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు రాకపోకలు బంద్
- ఇబ్బందుల్లో రాష్ట్ర కార్మికులు

**మోర్తాడ్:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ కట్టడికి ఖతర్ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. తమ దేశంలో కరోనా వైరస్ (కోవిడ్–19) కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో అప్రమత్తమైన అక్కడి ప్రభుత్వం వైరస్ నియంత్రణకు కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా భారత్ సహా 14 దేశాల నుంచి తమ దేశంలోకి రాకపోకలపై నిషేధం విధించింది. దీంతో ఉపాధి కోసం ఖతర్ వెళ్లే తెలంగాణ వాసులు ఇప్పట్లో అక్కడకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. పలువురు కార్మికులకు వీసాతో పాటు ముందస్తుగానే విమాన టిక్కెట్ కొనుక్కున్నా, తాజా పరిణామాలతో ఆ దేశం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. విమాన సర్వీసుల రద్దుపై ఆదివారం నుంచే అమలులోకి వచ్చిన నిర్ణయం తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొనసాగనుందని తెలుస్తోంది. కాగా, కరోనా వైరస్ వల్ల తమ దేశ ప్రజలు ఇబ్బందిపడుతున్నారని గుర్తించిన కువైట్ ప్రభుత్వం కూడా ఎనిమిది దేశాలకు విమాన సర్వీసులను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అదే బాటలో తాజాగా ఖతర్ ప్రభుత్వం కూడా రాకపోకలపై నిషేధం విధించింది. ఈ నిర్ణయంతో భారత్, చైనా, బంగ్లాదేశ్, ఈజిప్టు, ఇరాన్, ఇరాక్, లెబనాన్, నేపాల్, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా, శ్రీలంక, సిరియా, థాయిలాండ్ నుంచి ఖతర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. ఖతర్‌లో ఆదివారం వరకు 24 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో వైరస్ ప్రభావం ఉన్న ఈ 14 దేశాల నుంచి రాకపోకలపై నిషేధం విధించారు. ఖతర్‌లోని వివిధ నిర్మాణ కంపెనీలు, వ్యాపార, వాణిజ్య సంస్థలలో వేలాది మంది తెలంగాణ వాసులు ఉపాధి పొందుతున్నారు. రోజూ ఎంతో మంది అక్కడి నుంచి స్వదేశానికి రావడం, తిరిగి వెళ్లడం జరుగుతుంది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ఇప్పట్లో రాలేం..



ఖతర్ నుంచి ఇప్పట్లో ఇండియాకు రాలేం. అలాగే మన దేశం నుంచి ఖతర్‌కు వచ్చే వారు కూడా కొన్ని రోజుల పాటు ఓపిక పట్టాల్సిందే. కరోనా విస్తరించకుండా ఉండడానికి ఖతర్ ప్రభుత్వం మన దేశంతో సహా 14 దేశాల రాకపోకలపై నిషేధం విధించింది. ఖతర్‌లో ఉన్న తెలంగాణ కార్మికులు ఇంటికి రావడానికి కొంత సమయం పడుతుంది. అలాగే కొత్తగా వీసాలు తీసుకున్న వారు కూడా కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

– శ్రీధర్ గౌడ్, ఖతర్ (షామీర్‌పేట్, మేడ్చల్ జిల్లా)



## గ్లౌజ్ తొడిగి, చెత్త బుట్ట పట్టి..

ఇంటింటికీ వెళ్లి పారిశుధ్యంపై అవగాహన కల్పించిన హరీశ్‌రావు

**సిద్దిపేట జోన్:** మంత్రి హరీశ్ రావు సిద్దిపేటలో ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. సోమవారం ఉదయం ఆరుగంటలకు సిద్దిపేటలోని 33వ వార్డులో ఆయన మార్నింగ్ వాక్ చేశారు. మూడు గంటల పాటు ప్రతి ఇంటికి పారిశుధ్య వాహనంతో పాటు వెళ్లి ప్రజలు పారేస్తున్న తడి, పొడి చెత్తను పరిశీలించారు. కొన్నిచోట్ల మహిళలు తెచ్చిన చెత్త బుట్టలను పరిశీలించి అందులో తడి చెత్తలో పొడి చెత్తను కలపడాన్ని చూసిన ఆయన, మహిళలకు తడి, పొడి చెత్తను వేరుగా ఇవ్వడంపై అవగాహన కల్పించారు. ఒక దశలో చేతికి గ్లౌజ్‌లు ధరించి చెత్త బుట్టను చేతబట్టి తడి, పొడి చెత్తను వేరు చేసి క్షేత్ర స్థాయిలో వార్డు ప్రజలకు విశదీకరించారు.

# ఇలా 'చితి'కి..

**ముగిసిన మారుతిరావు అంత్యక్రియలు**

- శ్మశానవాటిక వద్ద అమృతను అడ్డుకున్న బంధువులు
- ఆస్తి కోసమే అమృత డ్రామాలు : శ్రవణ్

**మిర్యాలగూడ:** సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో ప్రధాన నిందితుడు తిరునగరు మారుతిరావు అంత్యక్రియలు నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో సోమవారం మధ్యాహ్నం ముగిశాయి. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉన్న ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం ఆయన ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అంత్యక్రియలకు పట్టణవాసులు, బంధువులు భారీగా తరలి వచ్చారు. మారుతిరావు భార్య గిరిజ విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఉదయం 10.45 గంటలకు రెడ్డికాలనీలోని ఇంటి నుంచి మారుతిరావు అంతిమయాత్ర ప్రారంభమైంది. మధ్యాహ్నం 12 గంటలకు షాబ్‌నగర్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మారుతిరావు చితికి ఆయన తమ్ముడు శ్రవణ్ నిప్పంటించారు.

**అమృతను అడ్డుకున్న బంధువులు..**

ఇదిలా ఉండగా తన తండ్రిని కడసారి చూడటానికి అమృత పోలీసు బందోబస్తుతో శ్మశానవాటిక వద్దకు చేరుకుంది. పోలీసు వాహనంలోనే అమృతను ఇంటి వద్ద నుంచి శ్మశానవాటికకు తీసుకొచ్చారు. కాగా అమృత అక్కడికి చేరుకునే లోగా మారుతిరావు మృతదేహాన్ని చితిపై ఉంచారు. చితివద్దకు పోలీసులతో కలసి వెళ్లిన అమృతను మారుతిరావు బంధువులు, పట్టణ వాసులు అడ్డుకున్నారు. అమృత గోబ్యాక్.. మారుతిరావు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. దాంతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితిని గమనించి పోలీసులు అమృతను వెంటనే తమ వాహనంలో ఆమె ఇంటికి తీసుకెళ్లారు.

**ఆస్తి కోసం అమృత డ్రామాలు : శ్రవణ్**

'మారుతిరావు చస్తే తనకు శుభవార్త'అని చెప్పిన అమృతకు ఇప్పుడు ఆయన చనిపోయిన తర్వాత అతనిపై ప్రేమ పుట్టుకురావడం చూస్తే, ఆస్తికోసం డ్రామా ఆడుతున్నట్టు ఉందని మారుతిరావు తమ్ముడు శ్రవణ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన తన అన్న నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, మారుతిరావు భార్య పుస్తె తీసిన రోజే తాను పుస్తె తీస్తానని అమృత చెప్పిందని, అలాగే మారుతిరావును బహిరంగంగా ఉరితీయాలని అమృత డిమాండ్ చేసిందని అన్నారు. తన వల్ల ఎవరికీ ప్రాణహాని ఉండదని, అమృత తనపై చేసిన ఆరోపణల్లో నిజం లేదని అన్నారు. ప్రణయ్ హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేకున్నా శిక్ష అనుభవించానని, కేసు విషయంలో ఏనాడు కూడా రాజీ కోసం అమృత వద్దకు వెళ్లలేదని తెలిపారు. శ్మశానవాటిక వద్ద ఆమెను తాను అడ్డుకోలేదని, తల్లిపై ప్రేమ ఉంటే ఆమె అక్కడే ఉన్నా ఎందుకు మాట్లాడలేదన్నారు.


మిర్యాలగూడలో మారుతిరావు చితికి నిప్పంటిస్తున్న సోదరుడు శ్రవణ్

### ఆస్తిపై ఎలాంటి ఆశలు లేవు: అమృత



తన తండ్రి మారుతిరావు ఆస్తిపై తనకు ఎలాంటి ఆశలు లేవని అమృత పేర్కొంది. మారుతిరావు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదంది. పశ్చాత్తాపం చెందో, శిక్షపడుతుందనో ఆత్మహత్య చేసుకొని ఉండకపోవచ్చుననే అభిప్రాయం వ్యక్తం చేసింది. తన తండ్రికి బినామీ పేర్ల మీద ఆస్తులు ఉన్నట్లు తెలిసిందని, ఆస్తి విషయంలో బాబాయి శ్రవణ్ కొట్టినట్లు కూడా తెలిసిందని, ఆత్మహత్యకు వేరే కారణాలు ఉండొచ్చని పేర్కొంది. శ్రవణ్ వల్ల తన తల్లికి కూడా ప్రాణ హాని ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసింది.

# చీకటి' సూరీడి.. బతుకు ఛిద్రం!

**ప్రకృతి విరుద్ధ వాతావరణంలో పనిచేస్తున్నా కనీస సౌకర్యాలు కరువు**

- సింగరేణి లారీ లోడింగ్, అన్ లోడింగ్ కార్మికుల పరిస్థితి దయనీయం
- 6 జిల్లాల్లోని 11 ఏరియాల్లో 1,755 మంది కార్మికులు
- ఆదుకోవాలని సీఎంకు విజ్ఞప్తి

**సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం:** తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తున్న సింగరేణి సంస్థలో వివిధ విభాగాల కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రకృతి విరుద్ధ వాతావరణంలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు, వైద్యం పాటు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. సింగరేణి సంస్థ అభ్యున్నతి కోసం పాటుపడుతున్న 'చీకటి సూరీడు'బతుకు అంధకారంలో మగ్గుతోంది. ఈ సంస్థలో రెగ్యులర్ కార్మికులతో పాటు సుమారు 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులు సైతం సమాన పాత్ర పోషిస్తున్నారు. వీరిలో బొగ్గు లారీల లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులకు మాత్రం తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఆరు జిల్లాల పరిధిలో సింగరేణి విస్తరించి ఉన్న 11 ఏరియాల్లో మొత్తం 1,755 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.6 వేల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారు. 2009 కనీస వేతన చట్టం జీఓ వీరికి వర్తించాల్సి ఉన్నప్పటికీ సింగరేణి యాజమాన్యం దాన్ని అమలు చేయడం లేదు. మాస్కులు, రక్షణ పరికరాలు, పనిముట్లు కూడా ఇవ్వరు. చివరకు తాగు నీరు సైతం ఏర్పాటు చేయకపోవడంతో కార్మికులు కన్నీరు పెడుతున్నారు. సింగరేణిలో లారీ లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికుల కంటే చాలా ఏళ్ల తరువాత వచ్చిన కాంట్రాక్టు కార్మికులను సైతం జీవో 29 ప్రకారం రెగ్యులర్ చేసినప్పటికీ వీరిని మాత్రం పట్టించుకోకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

**రక్షణ సౌకర్యాలు లేవు**

కాంట్రాక్టు కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలూ లేవు. ఇక ఏదైనా జబ్బు చేస్తే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడమే తప్ప సింగరేణి ఆస్పత్రిలో కనీసం ఔట్ పేషెంట్ విభాగంలో కూడా వైద్యం అందడం లేదు. వచ్చే తక్కువ వేతనాలతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేని దీనస్థితిలో వారున్నారు. వీరికి పని ప్రదేశాల్లో రక్షణ రాలతోపాటు బూట్లు, హెల్మెట్లు, మాస్కులు, చెమ్మాస్ వంటి పరికరాలు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవికాలంలో కూడా అంతంత మాత్రమే. ప్రమాదకర స్థలాల్లో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ సదుపాయాలు కల్పించాలనే నిబంధనలున్నా అమలుకు నోచుకోవడం లేదు. రక్షణ పరికరాలు ... పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. గతంలో పలువురు కార్మికులను పర్మినెంట్ చేస్తూ జీవో విడుదల చేసినప్పటికీ వీరికి ఆ భాగ్యం కలుగలేదు.


సీహెచ్‌పీ వద్ద లారీ లోడింగ్ చేస్తున్న కార్మికులు

### దశాబ్దాలుగా శ్రమదోపిడీ

సింగరేణిలో ఈ కార్మికులు దశాబ్దాలుగా శ్రమ దోపిడీకి గురవుతున్నారు. కార్మికులు తమ చెమటను చిందించి బొగ్గు ఉత్పత్తి చేస్తుంటే అందుకు కాంట్రాక్టు కార్మికులు తోడుగా నిలుస్తున్నారు. అన్నిరకాల పనులకు కాంట్రాక్టు కార్మికులనే ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. ముఖ్యంగా బొగ్గు లోడింగ్, అన్‌లోడింగ్, సేల్ పికింగ్ చేసే కార్మికులకు 30 ఏళ్లుగా కనీస వేతనాలు ఇవ్వడం లేదు. ఈ విషయమై ఈ కార్మికులు హైకోర్టులో పిటిషన్ వేశారు. అయినా యాజమాన్యంలో మాత్రం స్పందన కరువు.



### కనీన వేతనాలు అమలు చేయాలి

రేయింబవళ్లు దుమ్ము ధూళిలో లోడింగ్ అన్‌లోడింగ్ కార్మికులు కష్టపడుతూ సింగరేణి బొగ్గు వినియోగదారులను పెంచే ప్రయత్నం చేస్తున్నారు. యాజమాన్యం కనీస వేతనాలు ఇవ్వకుండా కార్మికుల శ్రమను దోచుకుంటోంది. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు, సేవా రంగంలో పనిచేస్తున్న వారికి కనీస వేతన చట్టం ప్రకారం హక్కులు వర్తింపజేస్తున్న సింగరేణి యాజమాన్యం లోడింగ్ అన్‌లోడింగ్ కార్మికుల విషయంలో ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. సింగరేణి సంస్థ నినాదమైన 'ఒకే గమ్యం.. ఒకే కుటుంబం.. ఒకే లక్ష్యం'అనే స్ఫూర్తి ప్రకారం మాకు న్యాయం చేయాలి.

– యాకూబ్‌షావలి, సింగరేణి కోల్ లారీ లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

## క్లుప్తంగా...

### తగ్గిన 'పెట్రో' ధరలు

**న్యూఢిల్లీ:** సామాన్యుడికి కాస్తంత ఊరట లభించింది. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో పెట్రోల్‌పై 24–27 పైసలు, డీజిల్‌పై 25–26 పైసలు తగ్గింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దేశంలో పెట్రోల్ ధర లీటర్ రూ.71కి పడిపోయింది. 1991 గల్ఫ్‌యుద్ధం తర్వాత ఇంత భారీగా ధరలు పడిపోవడం ఇదే ప్రథమం. చమురు ఉత్పత్తి చేసే సౌదీ నేతృత్వంలోని ఒపెక్, రష్యా మధ్య విభేదాలు ధరల యుద్ధానికి తెరలేపాయి. దీంతో సోమవారం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ రూ.70.59కి చేరుకుంది. 2019 జూలై తర్వాత ఇదే తక్కువ ధర. డీజిల్ ధర కూడా లీటర్ రూ.63.26కి పడిపోయింది. దేశీయ చమురు అవసరాల్లో 84 శాతం వరకు భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది.

### 'పద్మ' క్విజ్‌పై మోదీ ట్వీట్

**న్యూఢిల్లీ:** పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించే క్విజ్ గురించి ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఈ క్విజ్‌లోని ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వడం ద్వారా పద్మ అవార్డుల కార్యక్రమంలో పాల్గొనవచ్చు. 'వివిధ రంగాల్లో కృషి చేసే వ్యక్తులకు ఏటా ఇచ్చే పద్మ అవార్డ్స్‌లో పాల్గొనే అవకాశం కల్పించే క్విజ్ ఇది' అంటూ మోదీ ట్వీట్ చేశారు. అందులో పాల్గొని అవకాశాన్ని పొందాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది దాదాపు 140 పద్మ అవార్డులను ఇవ్వనున్నారు.

### రాజకీయ పార్టీల ఎన్నికల ఖర్చుపైనా పరిమితి?

**న్యూఢిల్లీ:** ఎన్నికల్లో పెట్టే ఖర్చులపై అభ్యర్థుల మాదిరిగానే పార్టీలకు పరిమితులు ఉండాలని నిపుణుల బృందం ఒకటి ఎన్నికల కమిషన్‌కు సూచించింది. ఎన్నికలను మరింత సమర్థంగా నిర్వహించే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ గత ఏడాది పలు వర్కింగ్ గ్రూపులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ''ప్రస్తుతం రాజకీయ పార్టీలు ఎన్నికల కోసం పెట్టే ఖర్చుపై ఎలాంటి పరిమితి లేదు. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలంటే ఈ ఖర్చులపై పరిమితి అవసరమెంతైనా ఉంది''అని ఒక వర్కింగ్ గ్రూపు సూచించింది. రాజకీయ పార్టీలు గరిష్టంగా పెట్టగల ఖర్చులను అభ్యర్థుల పరిమితికి కొని రెట్లు ఎక్కువగా విధించాలని ఎన్నికల కమిషన్ 2015లో కేంద్ర న్యాయశాఖకు సూచించిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. అయితే ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎన్నికల ఖర్చులపై పారదర్శకత కోసం పలు స్వచ్ఛంద సంస్థలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

### ఆ పోస్టర్లు తొలగించాలి

**అలహాబాద్:** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)ను వ్యతిరేకించిన వారి ఫొటోలతో కూడిన పోస్టర్లను వెంటనే తొలగించాలని లక్నో అధికార యంత్రాంగాన్ని అలహాబాద్ హైకోర్టు సోమవారం ఆదేశించింది. సీఏఏ వ్యతిరేక అల్లర్లలో ఆస్తుల ధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ యూపీ ప్రభుత్వ యంత్రాంగం కొందరు ఆందోళనకారుల ఫొటోలతో పోస్టర్లను అంటించింది. ఈ కేసును హైకోర్టు విచారించింది. తమ ఆదేశాల అమలుపై 16లోగా నివేదిక సమర్పించాలని లక్నో పోలీస్ కమిషర్‌కు సూచించింది. 'పోస్టర్లు అంటించడం అనేది.. వ్యక్తుల గోప్యతలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడమే'అని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రభుత్వ చర్య రాజ్యాంగంలోని ఆర్టికల్ 21కు విరుద్ధమని పేర్కొంది.

### అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ 15 మంది గల్లంతు

**వాషింగ్టన్:** అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన 15 మంది పంజాబీ యువకులు గల్లంతయ్యారు. వీరిలో 6 మంది బహమాస్ ద్వీపం నుంచి అమెరికాలోకి ప్రవేశిస్తూ గల్లంతుకాగా, మరో 9 మంది మెక్సికో–అమెరికా సరిహద్దు గుండా ప్రవేశించే ప్రయత్నం చేస్తూ గల్లంతయ్యారని ఉత్తర అమెరికా పంజాబీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాత్నం చాహల్ తెలిపారు. యువకులను అమెరికాకు పంపేందుకు ఢిల్లీలోని ఓ ఏజెంట్‌కు రూ. 19.5 లక్షలు ఇచ్చారని చాహల్ ఆరోపించారు. అమెరికా వెళ్లిన తర్వాత యువకులతో మాట్లాడేందుకు మరో రూ. 45 లక్షలు మరి కొంత మంది ఏజెంట్లకు ఇచ్చారని తెలిపారు. వారు మెక్సికో చేరిన తర్వాత నుంచి యువకుల నుంచి అసలు సమాచారమే లేదని తెలిపారు. వారిని కనుక్కునే ప్రయత్నం చేయాలంటూ చాహల్ భారత ప్రభుత్వాన్ని, పంజాబ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కమల్ సర్కార్‌లో సింధియా చిచ్చు

## మధ్యప్రదేశ్‌లో అనూహ్య పరిణామాలు

- బెంగళూరు రిసార్టులో సింధియా, 17 మంది ఎమ్మెల్యేల మకాం
- రాష్ట్ర కేబినెట్ అత్యవసర భేటీ.. మంత్రుల రాజీనామా
- మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ!



కమల్‌నాథ్



సింధియా

**భోపాల్/సాక్షి, బెంగళూరు:** మధ్యప్రదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాజ్యసభ ఎన్నికల సమయంలో అధికార కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. పార్టీ కీలకనేత జ్యోతిరాదిత్య సింధియా, ఆరుగురు మంత్రులు సహా మొత్తం 17 మంది ఎమ్మెల్యేలు సోమవారం బెంగళూరుకు మకాం మార్చారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ తమ ఎమ్మెల్యేలను వలలో వేసుకుంటోందంటూ ఇటీవల కాంగ్రెస్ ఆరోపణలు చేయడం.. ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిన ఎమ్మెల్యేలు తిరిగివచ్చి సర్కారుకు మద్దతు పలకడం తెలిసిందే. అసెంబ్లీలో బొటాబొటీ మెజారిటీ ఉన్న కమల్‌నాథ్ ప్రభుత్వానికి ఈ పరిణామం షాక్ ఇచ్చింది. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న కమల్‌నాథ్ పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని సోమవారం రాత్రి భోపాల్ చేరుకున్నారు. వెంటనే దిగ్విజయ్‌సింగ్ తదితర సీనియర్ నేతలతో తన నివాసంలో రెండు గంటలపాటు అత్యవసర సమాలోచనలు జరిపారు. రాత్రి 10 గంటలకు కేబినెట్ భేటీ ఏర్పాటుచేసి, వివిధ పరిణామాలపై చర్చించారు. అనంతరం, హాజరైన 22 మంది మంత్రులు రాజీనామా చేశారు. దీంతో కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు మార్గం సుగమమైంది. ఫలితంగా అసంతృప్త ఎమ్మెల్యేలకు పదవులు దక్కే అవకాశం ఉంది. బెంగళూరు రిసార్టులో ఉన్న సింధియా వర్గం ఎమ్మెల్యేలంతా తిరిగి వస్తారని కమల్‌నాథ్ శిబిరం చెబుతోంది. సింధియాను శాంతింపజేసేందుకు పీసీసీ అధ్యక్ష పదవి లేదా రాజ్యసభ సభ్యత్వాన్ని ఇచ్చే అవకాశాలున్నాయని అనుకుంటున్నారు. మరోవైపు, సింధియా బీజేపీలో చేరతారని.. ఆయనకు రాజ్యసభ సభ్యత్వంతోపాటు కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కే అవకాశాలున్నాయని ఊహాగానాలు వస్తున్నాయి.

**రిసార్టులో మకాం**

కాంగ్రెస్ అసంతృప్త నేత, మాజీ ఎంపీ జ్యోతిరాదిత్య సింధియా మద్దతుదారులైన 17 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రత్యేక విమానాల్లో సోమవారం బెంగళూరుకు వచ్చి, రోడ్డు మార్గంలో బెంగళూరు రాజానుకుంటె సమీపంలో ఉన్న ఓ రిసార్టుకు వెళ్లారు. ఆరోగ్య, కార్మిక, రవాణా, మహిళా శిశు సంక్షేమ, ఆహార, పౌర సరఫరాలు, విద్యా శాఖలకు చెందిన ఆరుగురు మంత్రులు తులసి సిలావత్, మహేంద్ర సింగ్ సిసోడియా, గోవింద్ సింగ్ రాజ్‌పుత్, ఇమార్తీ దేవి, ప్రద్యుమ్నసింగ్ తోమర్, ప్రభురా చౌధరితోపాటు ఎమ్మెల్యేలు సింధియా వెంట ఉన్నారు. వీరి ఫోన్లు స్విచ్చాఫ్ చేసి ఉండగా, సింధియా మాత్రం ఫోన్ కాల్ రిసీవ్ చేసుకోవడం లేదని పీటీఐ తెలిపింది. ఒకట్రెండు రోజుల్లో జ్యోతిరాదిత్య సింధియా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్, కర్ణాటక సీఎల్పీ నేత సిద్ధరామయ్యతో ఫోన్‌లో మాట్లాడారు. బెంగళూరు వచ్చిన మధ్యప్రదేశ్ ఎమ్మెల్యేలు తమకు అందుబాటులో లేరని సిద్ధరామయ్య చెప్పినట్లు సమాచారం. అనంతరం మాజీ మంత్రి జి.పరమేశ్వర్, కేపీసీసీ అధ్యక్షుడు దినేశ్ గుండూరావుకు భోపాల్ రావాల్సిందిగా నాయకత్వం నుంచి పిలుపు వచ్చింది.

**ఏమిటీ సమస్య?**

సీఎం కమల్‌నాథ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవిని కూడా నిర్వహిస్తున్నారు. ఈ పదవి కోసం ఇద్దరు నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం మూడు రాజ్యసభ (కాంగ్రెస్‌కు చెందిన దిగ్విజయ్ సింగ్, బీజేపీకి చెందిన ప్రభాత్ ఝా, సత్యనారాయణ్ జతియా) సీట్ల కోసం ఈ నెల 26వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత బలాబలాల ప్రకారం.. కాంగ్రెస్, బీజేపీ చెరో సీటు గెలుచుకోవడం ఖాయం. తాజా పరిణామంతో కాంగ్రెస్‌కు మూడో సీటు దక్కడం ప్రశ్నార్థకంగా మారింది. ఈ అవకాశాన్ని అనుకూలంగా మార్చుకుని ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ యత్నిస్తోందనే అనుమానాలు ఉన్నాయి. పరిస్థితిని పార్టీ చీఫ్ సోనియాకు వివరించేందుకు కమల్‌నాథ్ ఆదివారం ఢిల్లీ వెళ్లారు. ఆయన 12న తిరిగి రావాల్సి ఉంది.

### నేడు బీజేపీ ఎమ్మెల్యేల భేటీ

16న రాష్ట్ర బడ్జెట్, 26న రాజ్యసభ ఎన్నికలపై చర్చించేందుకు మంగళవారం బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరగనుంది. ఈ భేటీలో మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌ను శాసన సభా పక్ష నేతగా ఎన్నుకునే అవకాశాలున్నాయి. బీజేపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు నారాయణ్ త్రిపాఠీ, శరద్ కోల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 3వ తేదీన జరిగిన బీజేపీ సమావేశానికి సైతం వీరు గైర్హాజరయ్యారు. కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలపై బీజేపీ నేతల్లోనూ ఉత్కంఠ పెరిగింది. రెండు రాజ్యసభ సీట్ల కోసం పార్టీ నేతలు రాంమాధవ్, కైలాష్ విజయ్‌వర్గీయ సహా 22 మంది పేర్లను సోమవారం రాష్ట్ర నాయకత్వం అధిష్టానానికి పంపింది.

# మూడేళ్ల చిన్నారికీ కోవిడ్

- దేశంలో మొత్తంగా 44 మందికి కరోనా వైరస్
- ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్



వుహాన్‌లో రోగులంతా డిశ్చార్జ్ కావడంతో ఖాళీగా ఉన్న తాత్కాలిక ఆస్పత్రి

**న్యూఢిల్లీ:** కేరళలో మూడేళ్ల చిన్నారి సహా నలుగురికి తాజాగా కరోనా వైరస్ సోకడంతో ఈ మహమ్మారి బారిన పడ్డవారి సంఖ్య 44కు చేరింది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, జమ్మూలలో ఒక్కో కేసు నమోదు కాగా.. ఇటీవల ఇటలీ నుంచి తిరిగి వచ్చిన మూడేళ్ల చిన్నారి వ్యాధి బారిన పడినట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. న్యూయార్క్ నుంచి బెంగళూరుకు వచ్చిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి కోవిడ్ సోకింది. జమ్మూలో కోవిడ్ బారిన పడ్డ వ్యక్తి ఇరాన్‌కు వెళ్లినట్లు తెలిసిందని, ఉత్తర ప్రదేశ్ బాధితుడు కరోనా వైరస్ సోకిన ఆరుగురితో ఆగ్రాలో సన్నిహితంగా గడిపారని ఆరోగ్య శాఖ తన ప్రకటనలో వివరించింది. మరోవైపు రాజధాని ఢిల్లీలో మరో కేసు నమోదైన నేపథ్యంలో ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్.. సీఎం కేజ్రీవాల్, లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్‌లతో ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. 'వైరస్ నియంత్రణపై అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు పంపిస్తున్నాం'అని మంత్రి తెలిపారు. 8255 విమానాల్లోని 8.74 లక్షల అంతర్జాతీయ ప్రయాణీకులకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కేరళలోని కొచ్చీలో వైరస్ బారిన పడ్డ మూడేళ్ల చిన్నారి రెండు రోజుల క్రితమే తల్లిదండ్రులతో కలిసి ఇటలీ నుంచి వచ్చింది. వైరస్ భయాందోళనలు ఎలా ఉన్నా కేరళలో మంగళవారం నాటి ఆటుక్కాళ పొంగలలో లక్షలాది మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం గమనార్హం. కర్ణాటకలో మొదటి కోవిడ్ కేసు వెలుగుచూసింది. అమెరికా నుంచి బెంగళూరుకు వచ్చిన 40ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి కోవిడ్ సోకిందని రాష్ట్ర వైద్య విద్యా శాఖ మంత్రి సుధాకర్ తెలిపారు. మార్చి 1న భార్య, కుమార్తెతో న్యూయార్క్ నుంచి బెంగళూరుకు ఆ ఉద్యోగి వచ్చారు.

## ఇప్పటివరకు 3,800 మంది మృతి

- 1,10,000 మందిలో వైరస్
- భారత్‌పై ఖతార్ నిషేధం

**ప్యారిస్/బీజింగ్/ఖతార్/టెహ్రాన్:** ప్రపంచం మొత్తమ్మీద వంద దేశాలకు విస్తరించిన కోవిడ్ కారణంగా ఇప్పటివరకూ 3,800 మంది మరణించారు. లక్షాపదివేల మంది వైరస్ బారిన పడ్డారు. వైరస్ కట్టడికి ఇటలీలో సుమారు కోటీ యాభై లక్షల జనాభా ఉన్న దేశ ఉత్తర ప్రాంత సరిహద్దులను సీజ్ చేయాలని ఇటలీ యోచిస్తోంది. భారత్ సహా 14 దేశాలకు రాకపోకలపై ఖతార్ నిషేధం విధించింది. వైరస్‌కు కేంద్ర బిందువుగా భావిస్తున్న చైనాలో మరణాల సంఖ్య తగ్గుతోంది. సోమవారం కొత్తగా కోవిడ్ బారిన పడ్డ వారి సంఖ్య 40 మాత్రమేనని చైనా తెలిపింది. ఇరాన్‌లో ఒక్క సోమవారమే 600 మంది ఈ వ్యాధి బారిన పడినట్లు తెలియడం ఆందోళన కలిగించే అంశం. చైనాలో కోవిడ్ మరణాల సంఖ్య 3119కి చేరింది. పరిస్థితి అదుపులోకి వస్తే నిర్బంధాలను త్వరలో ఎత్తేసే చాన్సుందని ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు.

**ఇరాన్‌లో ఏడువేల మంది బాధితులు**

ఇరాన్‌లో కరోనా వైరస్ బాధితుల సంఖ్య 7161కి చేరుకుంది. వ్యాధి కారణంగా సోమవారం 43 మంది మరణించగా ఇప్పటివరకూ ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 237గా ఉంది. టెహ్రాన్‌లో మొత్తం 1945 కోవిడ్ కేసులు ఉండగా.. ఖోమ్‌లో 712 కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

**మిలాన్ విలవిల**

పర్యాటకుల స్వర్గధామం మిలాన్ కరోనా వైరస్ దెబ్బకు విలవిల్లాడిపోతోంది. వీధులు, బీచ్‌లు నిర్మానుష్యంగా మారిపోగా వెనిస్ నగర సందర్శనకు వాడే గండోలా (చిన్న పడవలు) బోసిపోయి కనిపించాయి. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారు నెలల జైలు లేదా 206 యూరోల జరిమానాకు సిద్ధం కావాలని, తగిన అత్యవసర కారణాలు ఉన్న వారే క్వారంటైన్ జోన్ నుంచి బయటకు రావాలని స్పష్టం చేసింది.

**మద్యం తాగి 27 మంది మృతి**

మద్యం తాగితే కరోనాను నియంత్రించవచ్చంటూ సోషల్ మీడియాలో వచ్చిన వదంతులు నమ్మి అతిగా మద్యం తాగి 27 మంది మృతి చెందిన ఘటన ఇరాన్‌లో జరిగింది. 'తమకున్న లక్షణాలను చూసి కరోనాగా వారు భ్రమపడి అతిగా ఆల్కహాల్ తాగడంతో మరణించారు' అని వైద్యులు స్పష్టం చేశారు.



**సమానత్వ పోరాటం..** మహిళా దినోత్సవం సందర్భంగా చిలీలోని శాండియాగో సిటీలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వేలాది మంది మహిళలు. లింగ అసమానతలు తొలగిపోవాలంటూ చేసిన ఆందోళనలో మహిళలపైకి పోలీసులు బాష్పవాయుగోళాలు ప్రయోగించి వారిని చెదరగొట్టారు

# అధ్యక్షులుగా పోటాపోటీ ప్రమాణాలు

**అఫ్గానిస్తాన్‌లో ముదురుతున్న రాజకీయ సంక్షోభం**



వేర్వేరు కార్యక్రమాల్లో అధ్యక్షులుగా ప్రమాణంచేస్తున్న అబ్దుల్లా, ఘనీ

**కాబూల్:** అఫ్గానిస్తాన్‌లో రాజకీయ సంక్షోభం పెరుగుతోంది. అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ, అతడి మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అబ్దుల్లా అబ్దుల్లాల మధ్య రాజకీయ పోరు ఎక్కువైంది. సోమవారం ఘనీ, అబ్దుల్లాలు తామే అధ్యక్షులం అంటూ ప్రమాణ స్వీకారోత్సవాలు జరుపుకున్నారు. దశాబ్దకాలం యుద్ధానికి ఫుల్‌స్టాప్ పెడుతూ అమెరికా దళాలు అఫ్గానిస్తాన్ నుంచి నిష్క్రమిస్తున్న సమయంలో ఈ ఘటనలు జరిగాయి. గత ఏడాది సెప్టెంబరులో అఫ్గానిస్తాన్ అధ్యక్షుడి కోసం ఎన్నికలు జరిగాయి. అయితే ఘనీ, అబ్దుల్లా వర్గాలు రెండు ఎన్నికల్లో మోసాలు జరిగాయని ఆరోపణలు పరస్పర ఆరోపణలకు దిగడంతో ఫలితాల వెల్లడిలో ఆలస్యమైంది. చివరకు గత నెలలో ఘనీ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. సంప్రదాయ దుస్తులతో అధ్యక్ష భవనానికి విచ్చేసిన అష్రాఫ్ మద్దతుదారులు, ఉన్నతాధికారులు దౌత్యవేత్తలు, అమెరికా ప్రత్యేక ప్రతినిధి జలమే ఖాలిజాద్‌ల సమక్షంలో ప్రమాణం చేశారు. దాదాపుగా అదే సమయానికి అధ్యక్ష భవనం మరో మూల సూటు బూటులతో విచ్చేసిన అబ్దుల్లా అబ్దుల్లా కూడా తనను తాను అధ్యక్షుడిగా ప్రకటించుకుని దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, సరిహద్దులను కాపాడతానని ప్రమాణం చేశారు. అయిత అష్రాఫ్ ఘనీ ప్రమాణ స్వీకారం జరుగుతున్న సమయంలో వందలాదిమంది ప్రజలు చూస్తూండగా రెండు భారీ పేలుళ్లు సంభవించాయి. అయినప్పటికీ ఆ ప్రాంగణాన్ని వదిలి వెళ్లేందుకు అష్రాఫ్ ఘని నిరాకరించడం 'ప్రాణాలు త్యాగం చేయాల్సి వచ్చినా వెనుకాడేది లేదు' అని వ్యాఖ్యానించడంతో కొంత సమయం తరువాత అక్కడ మళ్లీ ప్రజలు, మద్దతుదారులు గుమికూడారు. అష్రాఫ్‌ను చప్పట్లతో స్వాగతించారు. అయితే ఇలా ఇరు రాజకీయ పక్షాలు పోటాపోటీ ప్రమాణాలు చేయడంపై అఫ్గానిస్తాన్ ప్రజలు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి ఇరు నేతలు చర్చలు జరిపితే మేలని ప్రజలు సూచిస్తున్నారు.

# బెంగాల్‌పై కాషాయదళం కన్ను

**పార్టీ ఎంపీలతో ప్రధాని మోదీ భేటీ**

**న్యూఢిల్లీ:** దేశంలో కీలకమైన పెద్ద రాష్ట్రం పశ్చిమ బెంగాల్‌లో అధికార పీఠంపై బీజేపీ కన్నేసింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా సోమవారం ప్రధాని మోదీ స్వయంగా ఆ రాష్ట్ర ఎంపీలతో సమావేశమయ్యారు. అక్కడి ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో స్పందనను వారిని అడిగి తెలుసుకున్నారు. 'రాష్ట్రానికి చెందిన మా పార్టీ ఎంపీలను వ్యక్తిగతంగా కలవాలని ప్రధాని మోదీ నిర్ణయించారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి పనులపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ పరిణామం రానున్న ఎన్నికల సమరంలో పాల్గొనేలా వారిలో స్థైర్యాన్ని, ఉత్సాహాన్ని నింపుతుంది'అని బీజేపీ బెంగాల్ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ తెలిపారు. 'ఎన్నికల్లో పార్టీ గెలవాలంటే ఏం చేయాల్సిన అవసరం ఉంటుంది? కేంద్ర ప్రభుత్వం గురించి, పథకాల గురించి ప్రజలేమనుకుంటున్నారు? అనే విషయాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు'మరో ఎంపీ లాకెట్ ఛటర్జీ వెల్లడించారు. 2016 ఎన్నికల్లో అసెంబ్లీలోని 295 స్థానాలకు గాను టీఎంసీ 211 సీట్లు, కాంగ్రెస్, సీపీఎం కలిపి 70 సీట్లు గెలుచుకోగా బీజేపీకి కేవలం మూడు సీట్లే దక్కాయి. టీఎంసీకి 45 శాతం ఓట్లు దక్కగా, బీజేపీకి 10శాతం మాత్రమే పడ్డాయి. కానీ, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 42 లోక్‌సభ స్థానాలకు గాను బీజేపీ 18 సీట్లు కైవసం చేసుకుంది. ఓటింగ్ శాతం పరంగా చూస్తే టీఎంసీకి 44 శాతం, బీజేపీకి 40 శాతం ఓట్లు పడ్డాయి. ఈ అనూహ్య ఫలితాలు టీఎంసీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీని షాక్‌కు గురిచేశాయి.

# ఇద్దరు ఉగ్రవాదుల హతం

**శ్రీనగర్:** ఉగ్రసంస్థ లష్కరే తోయిబాకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. జమ్మూకశ్మీర్‌లోని షోపియన్ జిల్లాలో సోమవారం ఉదయం ఈ ఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని రెబాన్ ప్రాంతం వద్ద ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న పక్కా సమాచారంతో భద్రతా బలగాలు సోదాలు చేపట్టాయి. తారసపడిన ఉగ్రవాదులు బలగాలపైకి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. దీంతో ఉగ్రవాదులు మృతిచెందారు.

**కశ్మీర్‌లో జైశంకర్ ఆకస్మిక పర్యటన**

విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ సోమవారం కశ్మీర్‌లో ఆకస్మిక పర్యటనకు వచ్చారు. కశ్మీర్‌లోయలో భద్రతా పరిస్థితులను ఆర్మీ కమాండర్ ద్వారా తెలుసుకునేందుకు వచ్చారని అధికారులు చెబుతున్నారు. అందులో భాగంగానే కరోనా కారణంగా ఇరాన్‌లో ఉండిపోయిన పలువురు భారతీయులు, భారతీయ విద్యార్థుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఇరాన్‌లో ఉండిపోయిన భారతీయులకు కోవిడ్ సోకలేదన్నారు.

# లగేరహో లక్సెంబర్గ్

| ప్రజలందరికీ ఉచిత రవాణా | రద్దీకి చెక్ పెట్టడమే లక్ష్యం | ప్రతి పౌరుడిపై 600 యూరోలు ఖర్చుచేస్తున్న ప్రభుత్వం |
|---|---|---|



**యూ**రోపియన్ యూనియన్‌లోని లక్సెంబర్గ్ ఇప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. ప్రజారవాణా వ్యవస్థని పటిష్టపరచడం ద్వారా ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు సరికొత్త మార్గానికి లగ్జెంబర్గ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బస్సులు, ట్రామ్‌లు, రైళ్లు ఈ మూడింటిలో ఏ రవాణామార్గాన్ని ఎంచుకున్నప్పటికీ అందులో మీరు హాయిగా పైసా ఖర్చు లేకుండా ప్రయాణం చేసేయొచ్చు. ప్రజలందరికీ ప్రభుత్వం ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తోంది. యావత్ ప్రజారవాణా వ్యవస్థని నిజంగానే ప్రజలకు అంకితమిచ్చింది. ఒకరోజో, రెండ్రోజులో కాదుసుమండీ. లక్సెంబర్గ్‌లో ప్రజలందరికీ ఇక ప్రయాణం ప్రతిరోజూ ఉచితమే. యూరప్‌లోని అతిచిన్న దేశమైన లక్సెంబర్గ్ జనాభా కేవలం 6,14,000. జనాభా గత 20 ఏళ్లలో 40 శాతం పెరిగింది. దీంతో విపరీతంగా పెరిగిన రద్దీని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఈ మార్గాన్ని ఎంచుకుంది.

**రద్దీని తగ్గించేందుకే..**

ప్రపంచ ప్రజల ముందున్న ప్రధానమైన సవాళ్లలో ట్రాఫిక్, పర్యావరణ సమస్యలు అత్యంత కీలకమైనవి. పర్యావరణం, రద్దీ (ట్రాఫిక్ సమస్య) ఒక దానిపై మరొకటి ఆధారపడి ఉన్న సమస్యలు కూడా. ఇక లక్సెంబర్గ్ సంగతి సరేసరి. విపరీతమైన ట్రాఫిక్ సమస్య. ప్రధాన రోడ్లన్నీ పాడైపోయాయి. బస్సులు పాతబడిపోయాయి. రైళ్ల రాకపోకలు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రభుత్వం విమర్శలనెదుర్కొంటోంది. దీనికి తోడు లక్సెంబర్గ్‌లో పనిచేస్తోన్న ఉద్యోగుల్లో సగానికి సగం మంది అంటే 2 లక్షల మంది బెల్జియం, ఫ్రాన్స్, జర్మనీల నుంచి లక్సెంబర్గ్‌కి వచ్చేవారే. అక్కడ అధిక వేతనాలు ఉండడమే అందుకు కారణం.

**ఖర్చు మోపెడు**

దీనివల్ల టిక్కెట్ల ద్వారా నష్టపోయే మొత్తం 44 మిలియన్ డాలర్లు. అయితే ఈ మొత్తాన్ని పన్ను చెల్లింపుదారుల నుంచి వసూలు చేస్తారు. ఉచిత రవాణా మొత్తానికి అయ్యే ఖర్చు 50 కోట్ల యూరోలు. ఈ ప్రాజెక్టు కారణంగా ఎవ్వరూ ఉద్యోగాలు కోల్పోరు. ఫస్ట్‌క్లాస్ ప్రయాణికులే టిక్కెట్లు కొంటారు కనుక టిక్కెట్ల తనిఖీకి వెచ్చించాల్సిన సమయం తగ్గుతుంది. లక్సెంబర్గ్‌లో చాలా మంది కార్మికులకు సబ్సిడీతో కూడిన పాస్‌లు ఉంటాయి. టిక్కెట్టు కొనుక్కునేవారు తక్కువగానే ఉంటారు. ఇప్పుడు మిగిలిన వారికి కూడా ప్రయాణం ఉచితం కావడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

### ఒక్కో వ్యక్తిపై 600 యూరోలు

**ఉ**చిత ప్రయాణ సౌకర్యానికి మరో కారణం ప్రజారవాణా వ్యవస్థని బలోపేతం చేయడం. రాబోయే ఐదేళ్లలో ప్రజారవాణాని ఉపయోగించే వారి సంఖ్య 20 శాతం పెంచాలని అక్కడి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇతర యూరోపియన్ దేశాలకంటే లక్సెంబర్గ్ ప్రజారవాణా వ్యవస్థపై అత్యధికంగా ఖర్చు చేస్తోంది. ఒక్కో వ్యక్తిపై ఏడాదికి 600 యూరోలు ఖర్చు చేస్తోంది.

### పెట్రోల్, డీజిల్ ధరలు తక్కువ

**ల**క్సెంబర్గ్‌లో కార్లు అధికం. వేతనాలు ఎక్కువ. పెట్రోల్, డీజిల్ ధరలు తక్కువగా కావడంతో కార్ల వాడకం ఎక్కువ. ఈ ట్రాఫిక్‌ను తగ్గించేందుకే ఈ ఉచిత బాట. లక్సెంబర్గ్ ప్రజలతో పాటే పర్యాటకులకు సైతం అక్కడ ప్రయాణం ఉచితమే. అయితే ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణించే వారికి మాత్రం టిక్కెట్టు వడ్డింపులు భారీగానే ఉంటాయి.

సాక్షి
మంగళవారం, మార్చి, 10

# బావురుమంటున్న బడులు

మన బడుల స్థితిగతులు బాగోలేవని మరోసారి తేటతెల్లమయింది. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు అనుబంధంగావున్న పార్లమెంటరీ స్థాయీ సంఘం గతవారం సమర్పించిన నివేదిక సర్కారీ బడుల తీరేమిటో కుండ బద్దలు కొట్టింది. దేశంలోని 40 శాతానికిపైగా బడులకు ఆట స్థలాలు, విద్యుత్ సదుపాయంవంటివి లేవని అది తేల్చి చెప్పింది. పిల్లలకు చదువుతోపాటు ఆటలాడుకునే సదుపాయం వుంటేనే వారు భవిష్యత్తులో అన్నివిధాలా ఎదుగుతారన్నది విద్యావేత్త, మాజీ రాష్ట్రపతి స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణన్ మాట. పిన్న వయసులో ఆటలాడే అలవాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదం చేయడమే కాదు... మున్ముందు వారిని మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతుంది. అన్నిటా చురుగ్గా వుంచుతుంది. క్రమశిక్షణ నేర్పుతుంది. పిల్లల్లో సమష్టి తత్వాన్ని, నాయకత్వ లక్షణాలను పెంచుతుంది. ఆరోగ్యకరమైన పోటీని అలవాటు చేస్తుంది. ఎదిగాక ఏ రంగంలోనైనా సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని సొంతం చేస్తుంది. దేశ జనాభాలో సగానికిపైగా పాతికేళ్లలోపువారే. వీరంతా పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకుంటున్నవారు. వీరే మరో పదిపదిహేనేళ్లలో వివిధ రంగాల్లో ప్రభావవంతమైన పాత్ర పోషించాల్సి వుంటుంది. కానీ ప్రామాణికమైన చదువు అందించడం మాట అటుంచి, కనీసం ఆటలాడుకోవడానికి గుప్పెడు స్థలం కూడా చూపలేని దుస్థితి వుంటే అంతకన్నా దారుణం మరేమైనా వుంటుందా? క్రీడా వికాసానికి దూరంగా వుండే పిల్లలు చదువుల్లోనూ వెనకబడతారు. తగినంత చొరవ కొరవడి అనంతరకాలంలో మెరుగైన ఉద్యోగావకాశాలకు కూడా దూరమవుతారు.

ఆరేళ్ల నుంచి పద్దెనిమిదేళ్లలోపుండే పిల్లల చదువుకు పాఠశాల విద్యా విభాగం పూచీ పడుతుంది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఈ విభాగానికి ఈసారి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ. 59,845 కోట్లు కేటాయించింది. ఆ శాఖకు మొత్తంగా కేటాయించిన రూ. 99,312 కోట్లలో ఇది 60 శాతం. చెప్పుకోవడానికిది ఘనంగా వుంటుంది. కానీ ఆ విభాగం అడిగిన మొత్తం రూ. 82,570 కోట్లలో కేటాయించిన మొత్తం కేవలం 27శాతం మాత్రమేనంటే విచారం కలుగుతుంది. ఇంకా విషాదమేమంటే నిరుటి బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే ఈసారి పెరిగింది 5.9 శాతం మాత్రమే. బడుల్లో ఆట స్థలాలు లేకపోవడం పిల్లల సర్వతో ముఖాభివృద్ధికి ఎలా ఆటంకమవుతుందో ఏడెనిమిదేళ్లక్రితం క్రికెట్ క్రీడా దిగ్గజం సచిన్ టెండూల్కర్ చెప్పాడు. పార్లమెంటు సభ్యుడిగా ఆయన ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదిక సమర్పించాడు. క్రికెట్ ఆటలో ప్రవేశించి పదహారేళ్ల వయసులోనే ప్రతిష్టాత్మకమైన మ్యాచ్‌లలో ఆడి, అనంతర కాలంలో భారత క్రికెట్ జట్టులోకి ప్రవేశించిన సచిన్ తన ఎదుగుదలకు చిన్ననాడు చదువుకున్న బడిలోని ఆట స్థలమే దోహదపడిందని వివరించాడు. కానీ ఆ నివేదికను పట్టించుకున్నవారేరి? ఆటల్లో అంతర్జాతీయ పోటీలు జరిగినప్పుడల్లా మన దేశం నగుబాటు పాలవుతోంది. క్రికెట్, టెన్నిస్, షూటింగ్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, హాకీ వంటి వేర్వేరు క్రీడాంశాల్లో దిగ్గజాలు లేరని కాదు. కానీ ఇంత పెద్ద జనాభా వున్న దేశానికి ఆ సంఖ్య చాలదు. ఇంచుమించు ప్రతి ఈవెంటులోనూ నువ్వా నేనా అన్నట్టు పోరాడి పతకాలను సొంతం చేసుకునే చైనా... ఆటలపై ఎంత శ్రద్ధ పెడుతున్నదో తెలిస్తే అబ్బురపడతాం. చిన్నతనంలోనే పిల్లల నైపుణ్యాన్ని గుర్తించి, వారిని సానబట్టేందుకు అక్కడ నిరంతరాయంగా ప్రణాళికాబద్ధమైన కృషి సాగుతూంటుంది.

పార్లమెంటరీ స్థాయీ సంఘం ఒక్క క్రీడా స్థలాల విషయంలో మాత్రమే కాదు... విద్యుత్, లాబొరేటరీలు, లైబ్రరీలు వంటి ఇతర మౌలిక సదుపాయాలను నిర్లక్ష్యం చేయడంపైనా నిశితంగా విమర్శించింది. తరగతి గదుల నిర్మాణం, ప్రయోగశాలల ఏర్పాటు, లైబ్రరీల నిర్వహణ వంటి అంశాల్లో సర్కారీ బడులు వెనకబడివుంటున్నాయని తెలిపింది. 2019–20లో 2,613 ప్రాజెక్టులకు అనుమతినిస్తే, అందులో మొదటి తొమ్మిది నెలల్లో పూర్తయినవి కేవలం మూడు మాత్రమేనని ఎత్తిచూపింది. చాలా పాఠశాలలకు ప్రహరీ గోడల్లేవని, ఇది పిల్లల భద్రతకు, ఆ బడులకు సంబంధించిన ఆస్తికి చేటు తెస్తుందని హెచ్చరించింది. స్థాయీ సంఘం ఓ మంచి సూచన చేసింది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఆ బడుల ప్రహరీ గోడల నిర్మాణం చేయిస్తే మంచిదని ప్రతిపాదించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని ప్రస్తావించాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై శ్రద్ధ పెట్టారు. గత నవంబర్‌లో 'మన బడి నాడు–నేడు' అనే వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో తొలి దశలో 50 మండలాల్లోని 1059 బడుల్ని గుర్తించి, అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించే పనులు ప్రారంభించారు. మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, అదనపు తరగతి గదుల నిర్మాణం, బ్లాక్‌బోర్డుల ఏర్పాటు, ప్రహరీల నిర్మాణంవంటివి ఇందులో వున్నాయి. ఈ బడులు గతంలో ఎలావున్నాయి... వసతులు కల్పించాక ఎలా మారాయి అన్న సంగతి తెలిసేలా ఫొటోలు కూడా తీయించాలని నిర్ణయించారు. వసతుల కల్పనకు రూ. 1,500 కోట్లు కేటాయించారు. ఇలాంటి పట్టుదలను ప్రదర్శిస్తే అన్ని రాష్ట్రాల సర్కారీ బడుల్లోనూ మెరుగైన వసతులు ఏర్పడతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుకు కేరళ, తమిళనాడు, పంజాబ్ వంటి రాష్ట్రాలు చెప్పుకోదగ్గ కృషి చేస్తున్నాయి. ప్రైవేటు బడులు క్రీడాస్థలాలు ఉన్నట్టు చూపితేనే వాటికి గుర్తింపు కొనసాగించే నిబంధన అమల్లోవుంది. కానీ సర్కారీ బడుల విషయంలో ఇలాంటివి పాటించడం లేదని తాజా నివేదిక చూస్తే అర్థమవుతుంది. కనీసం ఇప్పటికైనా శ్రద్ధ పెడితే సర్కారీ బడుల్లో చదివే పిల్లలు కూడా అన్నివిధాలా ఎదగడానికి అవకాశం ఏర్పడుతుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.పాడ్యమి రా.9.41 వరకు, తదుపరి విదియ, నక్షత్రం ఉత్తర రా.12.29 వరకు, తదుపరి హస్త, వర్జ్యం ఉ.8.49 నుంచి 10.20 వరకు, దుర్ముహూర్తం ఉ.8.32 నుంచి 9.20 వరకు, తదుపరి రా.10.54 నుంచి 11.44 వరకు అమృతఘడియలు... సా.5.45 నుంచి 7.12 వరకు.

సూర్యోదయం : 6.17
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

# అంబేడ్కర్ సవరణకే 'ఎసరా'?

బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ ఆదినుంచీ ఉద్యోగ సద్యోగాల్లో, విద్యాసంస్థల్లో, స్థానిక సంస్థల్లో సూత్రబద్ధమైన రిజర్వేషన్లు నిర్దేశించాన్నది తెలిసిన విషయమే. ఆ వర్గాల సముద్ధరణ పూర్తి స్థాయిలో జరిగే వరకూ రిజర్వేషన్లు కొనసాగాలన్నది ఆయన అభిమతం. అయితే ప్రస్తుత వ్యవస్థలో తనలాంటి దళిత వ్యతిరేకులు ఉన్నంత కాలం.. అంబేడ్కర్ లక్ష్యం నెరవేరదన్న నమ్మకం చంద్రబాబులో బలంగా ఉంది. కనుకనే సుప్రీంలో రిట్ ద్వారా రిజర్వేషన్ల శాతాన్ని 34 నుంచి 24 శాతానికి అంటే 10 శాతానికి తగ్గించేలా కుట్రపన్ని 'సంతృప్తి' చెందాడు. కానీ, వైఎస్సార్‌సీపీ పాలకులు ఆ తగ్గిన 10 శాతం రిజర్వేషన్లను తమ పార్టీ ద్వారానే నింపదలిచి, బీసీలకు అండగా నిలిచారు.



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

భారత రాజ్యాంగంలోని 16(4)వ నిబంధన కుల ప్రాతిపదికపైన వివక్షతో కూడుకున్నది. అది ప్రభుత్వ ఉద్యోగాలలో, విద్యాసంస్థలలో వెనుకబడిన వర్గాల ప్రవేశం విషయంలో ప్రమోషన్ల విషయంలో వివక్షతో కూడిన నిబంధన. కాబట్టి ఆ నిబంధన చెల్లనేరదు. కనుక, కులం పేరుతో ఒక వ్యక్తిని వెలివేసే సమాజంలో దళిత బలహీన వర్గాలకు (ఎస్సీ, ఎస్టీ, బీసీ) రిజర్వేషన్ల కల్పన ఆచరణలో అసాధ్యం. కాబట్టి సమాజంలో బడుగు, బలహీన వర్గాల వారి సంక్షేమాన్ని కాపాడటానికి ప్రభుత్వం సాధ్యమైన చర్యలన్నింటినీ తీసుకోవాలి. ఆదేశిక సూత్రాలలోని 46వ నిబంధనను ప్రభుత్వం తప్పక పాటించాల్సిన విధిగా రాజ్యాంగం నిర్దేశించింది. బడుగు, బలహీనవర్గాలంటే నా ఉద్దేశం.. తమ కాళ్లపై తాము నిలబడలేని స్థితిలో ఉన్నవారనే, ఈ విషయంలో ఆదేశిక సూత్రాలలోని 46వ నిబంధన లక్ష్యాన్ని నెరవేర్చేదాకా ప్రభుత్వమూ, దేశ పార్లమెంటూ విశ్రమించరాదు, ఇవి తమ బాధ్యతను పూర్తిగా నిర్వర్తించి తీరాలి. ఈ ఆశయం నెరవేరేదాకా ఆదేశసూత్రాల్లోని 29వ రాజ్యాంగ నిబంధన (క్లాజ్ 2), 16వ రాజ్యాంగ నిబంధన (క్లాజు 4) ప్రకారం బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఆటకం కలుగుతూనే ఉంటుంది కాబట్టే ఎస్సీ, ఎస్టీ తదితర వెనుకబడిన (ఓబీసీ) వర్గాలకు అనుకూలంగా 15వ రాజ్యాంగ నిబంధనను సవరించి ప్రత్యేకంగా 5వ క్లాజును భారత రాజ్యాంగంలో చేర్చవలసివచ్చింది. ఈ కొత్త క్లాజు ప్రకారం పార్లమెంటు, రాష్ట్రాల శాసనవేదికలు తమకు అనుకూలమైన చట్టాలు చేసుకోవచ్చు.

*– రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రైటింగ్స్ అండ్ స్పీచెస్.*

## రెండో మాట



ప్రభుత్వ ఉద్యోగాలలో, విద్యాసంస్థలలో బడుగు బలహీన వర్గాలకు పూర్తి న్యాయం జరిగే వరకూ ఒక్క పార్లమెంటుకే కాదు. రాష్ట్రాల శాసనవేదికలకు కూడా, తమకు అనుకూలమైన చట్టాలు చేసుకునే హక్కు ఉందని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్.. నిర్దేశించి, శాసించారు. కానీ ఆ రాజ్యాంగపరమైన బాధ్యతలనుంచి తప్పుకుని అష్టావక్ర మార్గాలకు మళ్లి అడుగు ఊడిన తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ల ప్రాతిపదికపై జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న అభ్యుదయకర విధానాన్ని అడ్డుకోజూస్తున్నారు. కానీ కనీస సంక్షేమ పాలనా విధానాలు కూడా అలర్జీగా భావిస్తున్న బాబు, అతని పార్టీ. ఇటీవల రాష్ట్ర శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో పొందిన అవమానకరమైన ఓటమి నుంచి కూడా గుణపాఠం నేర్చుకునే దశలో లేరు.

శ్రీకృష్ణదేవరాయల పాలన గురించి ఒక ప్రశస్తి ఉంది. రైతాంగ శ్రేయస్సుకు కాడీ, మేడికి అంకితమై ప్రజాసేవలో శ్రమ జీవనాన్ని శ్లాఘించి, నమస్కరించిన రాయలు... పాలకుడైన వాడు చేతలలోనే కాదు, తన గుండెల్లో సహితం ప్రజల అభివృద్ధిని సదా కాంక్షించాలని కోరుకున్నవాడు. కానీ సమాజాభ్యున్నతికి ఏ శ్రమశక్తి దోహదపడుతుందో ఆ వర్గాల (బడుగు, బలహీన వర్గాలే జనాభాలో హెచ్చుమంది) మౌలిక జీవన ప్రమాణాలను పెంచేందుకు దోహదకారి కాగల ఉపాధి, ఉద్యోగ సదుపాయాలను రిజర్వేషన్ల ద్వారా, ప్రమోషన్ల ద్వారా కల్పించేందుకు జరిగే కృషిని అడ్డుకోజూస్తే పరిణామం ఎలా ఉంటుందో జగన్ నిరూపించారు. జనరల్ ఎన్నికల్లో గోళ్లు ఊడి, ముఖాలు కందగడ్డలై చేసేది లేక దింపుడు కళ్లెం ఆశతో చంద్రబాబు, అతని పాలనలో లాభించిన కొందరు వందిమాగధులు తప్ప బుద్ధి ఉన్న వాళ్లెవరూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు మోకాలడ్డలేరు.

రాష్ట్రంలో మూడు రకాల స్థానిక సంస్థలకు (జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికలు+గ్రామ పంచాయతీలు) ఎన్నికల సంరంభం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కొద్ది రోజుల క్రితం టీడీపీ నాయకత్వం హీన రాజకీయాలకు తెరలేపి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్లకు మోకాలడ్డుతూ రాష్ట్ర హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేయించింది.. దాన్ని రాష్ట్ర గౌరవ న్యాయస్థానం కొట్టివేయగా.. తనకు తెలిసిన పాత కుట్రలో భాగంగానే సుప్రీంకోర్టుకు బాబు వర్గం ఎగబాకింది. ఈ 'ఎగబాకుడు' ఇవాళ్టి కొత్త 'విద్య' కాదు, గత పాలనలో చంద్రబాబు అన్యమార్గాల ద్వారా ఉమ్మడి రాష్ట్ర హైకోర్టును ఉపయోగించుకున్న అలవాటుతోనే ఇప్పుడు సుప్రీంకోర్టుకూ ఎగబాకారు. దేశ అత్యున్నత న్యాయస్థానంగా మనం భావించి ఆదరించుకునే సుప్రీంకోర్టు ప్రస్తుత అనిశ్చిత పరిణామాల దృష్ట్యా, ఎప్పుడు, ఏ నిర్ణయం ప్రకటిస్తుందో తెలియని అనూహ్యమైన దశలో ఉన్నాం. అలాంటి ఏ కారణం వల్లోకానీ ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను సుమారు 60 శాతం వరకు కల్పించాలన్న నిర్ణయానికి అవరోధం ఏర్పడింది.

అయితే 2019 ఎన్నికల్లో బలహీనపడిపోయి 'డీలా' అయిపోయిన బాబు వర్గం 'సుప్రీం'ను కదపడంలో ఒక ఆశ ఉండి ఉంటుంది. బడుగు, బలహీన వర్గాలకు ఆదినుంచీ ఉద్యోగ సద్యోగాల్లో, విద్యాసంస్థల్లో, స్థానిక సంస్థల్లో నిర్దేశిస్తున్న సూత్రబద్ధమైన రిజర్వేషన్లను అంబేడ్కర్ కల్పించారు. ఆ వర్గాల సముద్ధరణ పూర్తి స్థాయిలో జరిగే వరకూ రిజర్వేషన్లు కొనసాగాలన్న నాటి లక్ష్యం.. ప్రస్తుత వ్యవస్థలో తనలాంటి సమసమాజ వ్యతిరేకులు ఉన్నంత కాలం నెరవేరదన్న నమ్మకం బాబులో బలంగా ఉంది. కనుకనే చంద్రబాబు వర్గం హీన మనస్తత్వంవల్ల సుప్రీంలో రిట్ ద్వారా రిజర్వేషన్ల శాతాన్ని 34 నుంచి 24 శాతానికి అంటే 10 శాతానికి కుదించివేసి మరీ 'సంతృప్తి' చెందింది.. కానీ 'తలదన్నేవాడి తాడిని తన్నేవాళ్లు' ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారన్న ఇంగితం కూడా బాబు వర్గానికి లేకపోయింది. బాబు పన్నాగాన్ని పసికట్టిన వైఎస్సార్‌సీపీ పాలకులు ఆ తగ్గిన 10 శాతం రిజర్వేషన్లను తమ పార్టీ ద్వారానే నింపడానికి నిర్ణయించి ప్రతిసవాలు విసిరారు. తగ్గిన సీట్లను పార్టీ పరంగా భర్తీ చేసి 34 శాతం జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను నిలపాలని నిర్ణయించారు. మొత్తంమీద చూస్తే చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడూ, కోల్పోయినప్పుడూ చేస్తూ వచ్చిన పని–బీసీ రిజర్వేషన్లు పూర్తి కాకుండా జాగ్రత్తపడుతూ రావడమే. సుప్రీం నిర్ణయాన్ని అడ్డుపెట్టుకున్న బాబు గమనించాల్సిన కీలకమైన అంశాన్ని మాత్రం ఎవరూ మరచిపోరాదు. ఎందుకంటే సుప్రీం నిర్ణయాల్లో కూడా తరచూ మనం చూసే తీర్పులు కొన్ని పరస్పరం విరుద్ధంగా ఉంటున్నాయి. 'సుప్రీం' లోనే కాదు, తీర్పులిచ్చే వివిధ 'బెంచ్' తీర్పులు కూడా పరస్పరం విరుద్ధంగా ఉంటున్నాయి. ఉదాహరణకు రాష్ట్రంలో వైఎస్ మరణానంతరం కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్లకు అనుకూలంగా రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇవ్వగా, దాన్ని వేరే డివిజన్ బెంచ్ కొట్టివేసింది.

రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో అంతర్భాగంగా నమోదైన 46వ నిబంధన.. రిజర్వేషన్లను అమలు జరిపే బాధ్యతను పార్లమెంటుకూ, రాష్ట్ర శాసనసభలకూ అప్పగించింది. బహుశా ఈ నిర్దేశాన్ని ఉల్లంఘించడాన్ని దృష్టిలో పెట్టుకునే జేఎన్‌యూ రాజకీయ శాస్త్రాచార్యుడు ప్రొఫెసర్ నరేంద్ర కుమార్ 'సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పులు అంబేడ్కర్ ప్రతిపాదించగా సభ ఆమోదించిన తొలి రాజ్యాంగ సవరణ (రిజర్వేషన్ల నిబంధన)కే విరుద్ధమని' శఠించాల్సి వచ్చింది. బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్ పౌరుల స్థాయిలో 'ఒక హక్కు' కాకపోయినా.. బలహీన వర్గాలకు ఉద్యోగ సద్యోగాలలో, ఎన్నికలలో తగినంత ప్రాతినిధ్యాన్ని నికరం చేయడం ప్రభుత్వ బాధ్యత అనీ, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు సానుకూలంగా నిర్ణయించే అధికారం ఉందనీ గతంలోనే తీర్పులున్న విషయం మరవరాదు (అజిత్ సింగ్ వర్సెస్ పంజాబ్ స్టేట్, సి.ఎ. రాజేంద్రన్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం).

మనం తరచుగా గాంధీజీ 'గ్రామ స్వరాజ్యం' గురించి మాట్లాడుకుంటున్నాం, ఆ గ్రామ స్వరాజ్య సాధన ఆశయంగా మహోన్నతమైనదే. కానీ భూస్వామ్య వ్యవస్థ బంధాలు పూర్తిగా గ్రామసీమల్లో తొలగకుండానే, పెట్టుబడిదారీ వ్యవస్థా బంధాలు బలంగా నెలకొంటున్న మన సమాజంలో.. 'గ్రామ స్వరాజ్యం' బలమైన వ్యవస్థగా పాతుకుపోవడం కష్టసాధ్యమని కూడా మరచిపోరాదు. బహుశా ఈ కారణం చేతనే డాక్టర్ అంబేడ్కర్, భూస్వామ్య వ్యవస్థా బంధాలు కూలంకషంగా తొలగకుండా గ్రామ స్వరాజ్యమనే మహత్తర ఆశయం నెరవేరడం కష్టసాధ్యమన్న వేదనను వెలిబుచ్చాల్సి వచ్చింది. 'ఎవరైనా ఎస్సీ, ఎస్టీలలో పుట్టాలని కోరుకుంటారా?' అన్న అహంకారాన్ని చంద్రబాబు ప్రదర్శించడమే ఇందుకు సరైన ఉదాహరణ. మన గ్రామసేవల్లో ఈనాటికీ, వెలివాడల్లోనూ, మలివాడల్లోనూ ఈ జాడ్యం ఈ క్షణం దాకా తొలగిపోవడం లేదని, ఇందుకు కారణం కుల, మత, వర్గ, లింగ వ్యత్యాస ధోరణులు సమూలంగా తొలగక పోవడమేనని బేషరతుగా మనసుల్లో ఎలాంటి 'రిజర్వేషన్లు' లేకుండా ఒప్పేసుకోవడంలోనే విజ్ఞత ఉంటుంది. నేటి పెక్కుమంది పాలకులూ, న్యాయమూర్తులూ, న్యాయవాదులూ, న్యాయస్థానాలూ ఈ 'మాలోకాని'కి అతీతులు కారు!

abkprasad2006@yahoo.co.in

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



### సెలవు



"ప్రైవేట్, పబ్లిక్ సంస్థల్లో పనిచేసే మహిళలకు నెలవారీ సెలవును మేము ఎట్టి పరిస్థితుల్లో సమర్థించం. ఈ పేరుతో వారిని పక్కనబెట్టి, వారు వృత్తిరీత్యా ఎదగకుండా అడ్డుకుంటారు. ప్రస్తుతం ప్రతి ఐదుగురు మహిళల్లో ముగ్గురు ఒక కిలోమీటర్ కంటే ఎక్కువ దూరం ప్రయాణించడం లేదు. తద్వారా వాళ్లు మంచి అవకాశాలను కోల్పోతున్నారు. నెలవారీ అంశాన్ని ఒకసాధారణ శారీరక ప్రక్రియగా కాకుండా, ప్రతి నెలా ఒక గ్రాండ్ ఈవెంట్‌లా నిర్వహిస్తారు. నేను పీరియడ్స్‌లో ఉన్నప్పుడే యుద్ధాన్ని కవర్ చేశా. మహిళలు యుద్ధ విమానాలు నడుపగలరు, హక్కుల కోసమూ పోరాడగలరు"

– బర్ఖాదత్, జర్నలిస్ట్

### అసహజం



"పర్యాటకులు లేని రోమ్ నగరం ఎంత అసహజంగా ఉంది. వచ్చేనెల 3వ తేదీ వరకు ఇటలీలోని అన్ని మ్యూజియంలు, పురావస్తు ప్రదర్శనశాలలు మూసివేశారు. కలోసియం దగ్గర కూడా పర్యాటకులు కనబడకపోవడం అసహజంగానే ఉంది. కరోనా వైరస్ భయంతో ఈ నిర్ణయం తీసుకోవడంతో ఈ విచిత్ర పరిస్థితి నెలకొంది"

– కొట్నీ మార్స్, జర్నలిస్ట్

### విచారణ



"ముస్తాఫాబాద్, కర్దాంపురి, కబీర్ నగర్ ప్రాంతాల్లోని పార్కుల నుంచీ, రోడ్ల మీంచి, ఇళ్ల నుంచీ ముస్లిం యువకులను తీసుకుపోయి, విచారణ పేరిట స్టేషన్లలో పెట్టి పోలీసులు చితగ్గొడుతున్నారు. వారిని వదిలిపెట్టడానికి డబ్బులు వసూలు చేయడంతోపాటు వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు. ఇలా స్టేషన్లలో మగ్గుతున్నవారి సంఖ్య వందల్లో ఉంటుంది"

– కవల్ ప్రీత్ కౌర్, విద్యార్థి నేత

### ఒప్పుకోను



"మహిళలకు పీరియడ్స్ సమయంలో ప్రతినెలా సెలవులు ఇవ్వాలనే అంశాన్ని నేను కూడా అంగీకరించను. అదేమీ రోగం కాదు, నాకు సెలవు అవసరం లేదు. అదే సమయంలో నేను ట్రెక్కింగ్‌కు వెళ్తా, రోజంతా శిక్షణా తరగతులు నిర్వహిస్తా, రోడ్ ట్రిప్స్‌కు వెళ్తా, కాన్ఫరెన్స్, యోగా క్లాసుల్లో పాల్గొంటా. జిమ్‌కు కూడా వెళతా. సెలవేమీ అక్కర్లేదుగానీ, బయటి స్థలాల్లో మంచి సౌకర్యాలు కల్పిస్తే చాలు"

– మీరా విశ్వనాథన్, ఫిట్‌నెస్ ట్రెయినర్

### ఓట్లు



"స్థానిక ఎన్నికల్లో ఏమని ఓట్లు అడుగుతావు బాబూ? 'ఇన్ సైడర్' భూముల ధరలు పడిపోకుండా చూడాలని ప్రాధేయపడతావా? ఇళ్ల పట్టాలెందుకు ఎలాగోలా ఇప్పుడు బతకడం లేదా అని అంటావా? మందు, మనీ పంచకుండా ఎలక్షన్లెలా జరుపుతారని ప్రశ్నిస్తావా? కుటుంబాలు వీధిలో పడితేనేం మద్యం ధరలు తగ్గించాలంటావా?"

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

### వెయ్యి



"అధికారికంగా వెయ్యి మ్యాచ్‌లు ఆడినందుకు చాలా గర్వంగా ఉంది. ప్రతి ముఖ్యమైన విజయం మనల్ని మళ్లీ మళ్లీ పైకి తీసుకువస్తుంది. నా సహచర ఆటగాళ్లకీ, కోచ్‌లకీ, నా కుటుంబానికీ, స్నేహితులకీ కృతజ్ఞతలు. ఈ స్థానానికి చేరుకోవడానికి దోహదపడిన అభిమానులందరికీ రుణపడి ఉంటా"

– క్రిస్టియానో రొనాల్డో, ఫుట్‌బాల్ ఆటగాడు

## ఇన్‌బాక్స్

### తొలి ఉపాధ్యాయురాలు

స్త్రీ అభ్యున్నతికి కృషి చేసిన మొట్ట మొదటి బహుజన మహిళ సావిత్రిబాయి పూలే. ఆమె మహారాష్ట్రలో 1831 జనవరి 3న ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. జ్యోతిరావు పూలేతో వివాహం అనంతరం భర్త ప్రోత్సాహంతో ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి, అహ్మద్‌నగర్లో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మి, 1848లో భర్తతో కలిసి దిగువ కులాల బాలికల కోసం పుణెలో మొట్ట మొదటి పాఠశాలను ప్రారంభించారు.



1852లో 'మహిళా సేవ మండల్' స్థాపించారు. లింగ వివక్ష, పితృ స్వామ్యాలకు వ్యతిరేకంగా పోరాడారు. 1873లో పూలేతో కలిసి సత్యశోధక సమాజాన్ని ప్రారంభించి బాల్య వివాహాలకు, మూఢ నమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని నడిపారు. వితంతు పునర్వివాహాల కోసం కృషి చేశారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నంపెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లలో వెలుగు నింపారు. వితంతు స్త్రీల శిరోముండనాన్ని అడ్డుకున్నారు. సత్యశోధక్ సమాజ్‌లోని 'మహిళా విభాగం' వివాహాల వంటి శుభ కార్యాలకు పురోహితులు లేకుండానే నిర్వహించే విధానానికి శ్రీకారం చుట్టింది. సావిత్రిబాయి దంపతులిద్దరూ పిల్లలను కనకుండా యశ్వంత్ రావు అనే అనాథ బాలున్ని దత్త పుత్రుడిగా పెంచుకున్నారు. 1854లో ఆమె తన కవితా సంపుటి 'కావ్య పూలే'ను ప్రచురించారు. ప్లేగు వ్యాధిని రూపుమాపడానికి కొడుకు యశ్వంత్‌తో కలిసి సేవలందించారు. చివరకు ఆమె కూడా ప్లేగు వ్యాధి బారినపడి మార్చి 10, 1897న మరణించారు. ఆమె జ్ఞాపకార్థం 1997లో తపాలా స్టాంపును విడుదల చేసింది.

(నేడు సావిత్రీబాయి పూలే వర్ధంతి)

– సంపతి రమేశ్

# బీజేపీకి బిహార్ ఎంత ముఖ్యం?

## సందర్భం



పెంటపాటి పుల్లారావు

నోట్ల రద్దు విషయంలో నరేంద్ర మోదీని తప్పుపట్ట వచ్చునేమోగానీ, జమిలి ఎన్నికల అంశంలో మాత్రం ఆయన్ని ఒప్పుకోవచ్చు. 2019 మేలో పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే, 2019 నవంబర్‌లో మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలు వచ్చాయి. 2020 జనవరిలో జార్ఖండ్, ఫిబ్రవరిలో ఢిల్లీ ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల హడావుడి నుండి దేశం కొద్దిగా విశ్రాంతి తీసుకుంటుండగానే అక్టోబర్‌లో మళ్లీ బిహార్ ఎన్నికలు దూసుకొస్తున్నాయి.

ఢిల్లీ లాంటి చిన్న రాష్ట్రమే బీజేపీని ఎంత టెన్షన్ పెట్టిందో చూశాం. అలాంటిది బిహార్ ఎన్నికలు ఊహించండి! గత ఎన్నికల్లో నితీశ్ కుమార్‌తో కలిసి బీజేపీ 40 లోక్‌సభ సీట్లకు 39 గెలుచుకుంది. ఈసారి నితీశ్ ఓడిపోయాడంటే, బీజేపీకి ఆదరణ తగ్గిందన్న విమర్శను ఎదుర్కోవాల్సి ఉంటుంది. బీజేపీతో కలిసి నితీశ్ 2005, 2010ల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు. 2015లో మోదీ ప్రధాని అయ్యాక బీజేపీని వదిలి, లాలూ ప్రసాద్ యాదవ్‌తో 'మహాఘట్ బంధన్' గా జట్టు కట్టారు. 243 సీట్లకు 178 సీట్లు గెలిచి, బీజేపీని 55 సీట్లకే పరిమితం చేసి, ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అయితే, ఉప ముఖ్యమంత్రిగా ఉన్న లాలూ కొడుకు తేజస్వి యాదవ్ మీద అవినీతి ఆరోపణలు రాగానే లాలూను వదిలి నితీశ్ బీజేపీతో ప్రభుత్వాన్ని కొనసాగించారు.

బిహార్ ఎన్నికల్లో ప్రస్తుతం నితీశ్, బీజేపీ, రామ్ విలాస్ పాశ్వాన్ ఎన్డీయే పక్షంగా, లాలూ, కాంగ్రెస్ మరో వర్గంగా బరిలో ఉన్నాయి. నితీశ్ 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశారు. లాలూ, రాబ్డీదేవి పదిహేనేళ్లు సీఎం పీఠం మీద కూర్చున్నారు. నితీశ్ ప్రతినిధిగా జితన్ రామ్ మాంఝీ ఒక్క ఏడాది ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నారు. అంటే 30 ఏళ్లుగా నితీశ్, లాలూ కుటుంబమే బిహార్‌ను ఏలుతున్నది.

నితీశ్ మార్చి ఒకటినే పట్నాలో ఎన్నికల శంఖారావం పూరించారు. 200 అసెంబ్లీ స్థానాలు గెలవడానికి ప్రయత్నిస్తానని ప్రకటించారు. లాలూలా తాను అవినీతిపరుణ్ని కాదన్న సందేశాన్ని గట్టిగానే ప్రజల్లోకి తీసుకువెళ్లగలిగారు. అయితే, హఠాత్తుగా నితీశ్ పార్టీని వీడిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ తాను కూడా బిహార్ ఎన్నికల బరిలో ఉంటానని ప్రకటించారు. లాలూ కంటే నితీశ్ ఉత్తముడే కావొచ్చు, కానీ దేశంలో ఉన్న ముఖ్యమంత్రులందరిలోకీ ఉత్తముడా అని కిశోర్ ప్రశ్నిస్తున్నారు.

ఒక మనిషి, ఒక కులం పార్టీలైన జితన్ రామ్ మాంఝీ(హెచ్ఏఎం), ఉపేంద్ర కుశ్వాహా (ఆర్ఎల్ఎస్పీ), ముకేశ్ సాహ్నీ(వీఐపీ పార్టీ) లాంటివాళ్లు మూడోశక్తిగా బరిలో ఉన్నారు. వీళ్లు లాలూతో జట్టుగా ఉన్నప్పటికీ తేజస్వితో సఖ్యతగా లేరు. లాలూ జైల్లో ఉండటంతో తేజస్వి సంకీర్ణానికి నాయకత్వం నెరపుతున్నారు. లాలూకు యాదవులు, ముస్లిముల్లో మంచి ఆదరణ ఉంది. కానీ నితీశ్ ముందు తేజస్విలాంటి పరిపక్వత లేని మనిషి నిలబడలేడని ఈ పార్టీ నాయకుల అభిప్రాయం. అందుకే శరద్ యాదవ్‌ను సీఎం అభ్యర్థిగా కోరుతున్నారు. వీళ్లది ఉత్త శబ్ద కాలుష్యమే అని తేజస్వి విమర్శిస్తున్నప్పటికీ పార్టీని తీవ్ర గందరగోళంలో పడేయటంలో వీళ్లు విజయం సాధించగలరు. పప్పు యాదవ్ నేతృత్వంలోని జన్ అధికార్ పార్టీ, కన్హయ్య కుమార్ నేతృత్వంలోని వామపక్ష పార్టీలు కూడా ఎన్నికల బరిలో ఉన్నాయి. ఇవి రెండూ భారీగానే జనాన్ని ఆకర్షిస్తాయి. అయితే, వామపక్షాలను కలుపుకొని పోవడానికి లాలూ సిద్ధంగా లేరు. తెలివైన కన్హయ్య కుమార్ గనక గట్టిగా నిలదొక్కుకుంటే, అది తన కొడుకు తేజస్వి భవితవ్యానికి చరమగీతం అవుతుందని లాలూ నమ్మిక. 2019లో కూడా వామపక్షీయులతో లాలూ చేతులు కలపనిది ఇందుకే.

గతేడాది మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, పంజాబ్, ఢిల్లీ, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో బీజేపీ ఓడింది. ఢిల్లీ తప్ప ఇవన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలే. మళ్లీ గనక నితీశ్‌ని ముఖ్యమంత్రిని చేయలేకపోతే బీజేపీ పూర్తిగా బలహీనపడిందన్న ముద్ర పడుతుంది. మునిగిపోయే ఓడలోంచి ఎలుకలు కూడా దూకి వెళ్లిపోతాయి. పైగా ఈ ఫలితాలు ఎన్నికలు సమీపించిన బెంగాల్‌లోనూ, ఈశాన్య రాష్ట్రాలు, అస్సాంలోనూ ప్రభావం చూపిస్తాయి. అందుకే ఈ ఎన్నికలకు బీజేపీ అంత ప్రాముఖ్యత ఇస్తోంది. ఆ కారణంగానే ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనూ జరగని విధంగా, సీఏఏకు వ్యతిరేకంగా నితీశ్ ప్రభుత్వం తీర్మానం చేయడానికి అంగీకరించింది. రాజకీయాల్లో గెలుపులు శాశ్వతం కాదు. వరుస వైఫల్యాల వల్ల గతేడాది మేలో వచ్చిన భారీ విజయం మరుగున పడింది. అందుకే బిహార్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవడానికి బీజేపీ సిద్ధంగా లేదు.

వ్యాసకర్త ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

# చీకట్లో వెలుగు

దారుణాలను చూసి ఒక్కొక్క ప్రాణమూ భయపడుతుంది. వేసవి తాపానికి ఒక్కొక్క జీవీ తల్లడిల్లుతుంది. చెట్టు కొమ్మలో నివాసముంటున్న పక్షి పిడుగు శబ్దానికి భయపడి తన పిల్లలను రెక్కలతో దగ్గరకు తీసుకుంటుంది. పిల్లిని చూసి ఎలుక బొరియలోకి పోయి దాక్కుంటుంది. కుక్కను చూసి పిల్లి వణుక్కుంటూ పారిపోతుంది. పామును చూసి కప్ప నీటిలోకి దూకుతుంది. కొంగను చూసి చేప నీటిపైకి రావడానికి ఆలోచిస్తుంది. పులిని చూసి జింక భయపడి దాక్కుంటుంది. తీపి తెలియని ప్రాణాలకు ప్రతిదీ దారుణంగానే కనిపిస్తాయి. యజమాని చేతిలో కర్రను చూసిన ఆవు దాని నిర్దయను తలచుకుని భయపడుతుంది. మరణభయం ప్రతి జీవికి ఉంటుంది. నియంత్రణ అనేది లేకుండా కలవరాలను మరచి ఎటువంటి క్రూరత్వాలు లేకుండా బతకాలనే ప్రతి జీవీ కోరిక. బానిస వెన్ను వంగే ఉంటుంది. బానిస కళ్ళు భయంతో చూస్తుంటాయి. బానిస గొంతులో వణుకుంటుంది. బానిస రక్తంలో జోరుండదు. మాట తప్పించి బానిసకూ మృగానికీ మధ్య భేదముండదు. అన్నం కలిపి అయిదు వేళ్ళతో తీసుకోవడంలో స్వతంత్రత ఉండకూడదా అనుకుంటుంది మనసు.



జ్యోతిర్మయం

బానిస బతుకు నుంచి విముక్తి పొందిన తర్వాత మనిషిలో అహం తొంగి చూస్తుంది. నియమాలను నిర్లక్ష్యం చేస్తాడు. ఎవరిని చూసినా ఏదో ఒక లోపం చూపిస్తాడు. ప్రపంచమే తన చేతిలో ఉందని విర్రవీగుతాడు. మళ్ళీ అతను బానిసత్వంలోకి వెళ్ళిపోతే తప్ప సుఖాన్ని తెలుసుకోలేడు. అప్పుడు అనుకుంటాడు, అమ్మో మళ్ళీ బానిసత్వమా అని బాధపడతాడు. అలాంటి ఆలోచన రావడంతోనే అతనిలో భయం మొదలవుతుంది. పొందిన సుఖాన్ని నిలబెట్టుకోలేకపోయానే అని చింతిస్తాడు. ఇక లాభం లేదు, ఈసారి బానిసత్వం నుంచి బయటకు వస్తే తనకు దక్కిన సుఖాన్ని ఆరునూరైనా నిలుపుకుంటాను. ఇప్పటికి తనకు బుద్ధి వచ్చింది. సాటివారినీ తనవారేనన్న భావంతో మెలుగుతాను. ఇందులో ఎలాంటి లోపముండదు అనుకుంటాడు. జీవితం చీకటి వెలుగుల మిశ్రమం. చీకట్లోనే వెలుగూ ఉంటుందనేది నిజం.

– యమిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 10-3-2020



నన్ను నవ్వించాలి
– సినిమా పేజీలో



## చిన్నారి హోలీ!

**కోలకతా వీధుల్లోకి బుజ్జిబుజ్జి రంగులొచ్చాయి. పసుపు వన్నెలు తీసుకొచ్చాయి. ఇంద్రధనువులు చిన్నబోయాయి. అవి మన చెంపకు చిట్టి చేతులు ఆనించి జీవితాన్ని వర్ణభరితం చేశాయి.**

**ఫొటో: కోలకతాలో బాలికల హోలీ**



యూట్యూబ్ స్టార్ గంగవ్వ

# స్టార్... స్టార్... విలేజ్ స్టార్

**గంగవ్వా... నీతో ఒక సెల్ఫీ...**
**గంగవ్వా... ఒక షేక్‌హ్యాండ్ ఇవ్వవా...**
**గంగవ్వా... ఏదైనా మాట్లాడవా...**
**గంగవ్వను చూస్తే అందరికీ ఉత్సాహమే. అందరికీ సంతోషమే.**
**గంగవ్వ సెలబ్రిటీ. ఊరి నుంచి నగరానికి, నగరం నుంచి దేశానికి తెలిసి సెలబ్రిటీ.**
**ఆమె మాట ఆమె గుర్తింపు కార్డు.**
**తెలంగాణ భాషకు, యాసకు, సంస్కృతికి ఆమె అనధికార అంబాసిడర్.**
**ఆమె చేస్తున్న 'మై విలేజ్ షో' యూ ట్యూబ్ బాహుబలి అంత పెద్ద హిట్.**
**అందుకే గంగవ్వ సన్మానాలందుకుంటోంది. సత్కారాలు పొందుతూ ఉంది.**

తెలంగాణ పల్లె సంస్కృతికి ప్రతిరూపంగా ఉన్న గంగవ్వ 'మై విలేజ్ షో' ద్వారా యూ ట్యూబ్ స్టార్‌గా ఎదిగింది. కూలిపనులు చేసుకుంటూ జీవించే గంగవ్వ, అక్షరం నేర్చుకోని గంగవ్వ, ఊరు దాటి బయటకు రాని గంగవ్వ... ఇప్పుడు దేశ ఎల్లలు దాటి విదేశాలలోని తెలుగువారి అభిమానాన్నీ చూరగొంటోంది. సినిమాల్లో నటిస్తోంది. తెలంగాణ గ్రామీణ సంస్కృతిని తనదైన యాసతో సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నందుకు ప్రభుత్వం ఆమెను మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా లక్షరూపాయల నగదు పురస్కారంతో సత్కరించింది. ఈ సందర్భంగా తన గురించి అడిగితే కష్టాలను తట్టుకొని ఎలా నిలబడిందో తెలిపింది.

'మాది జగిత్యాల జిల్లాలోని మల్యాల మండలంలోని లంబాడిపల్లి గ్రామం. మా నాయిన లచ్చయ్య నాకు ఊహ తెలియక ముందే కన్నుమూశాడు. పదమూడేళ్ల వయసులో అమ్మ అనారోగ్యంతో చనిపోయింది. తమ్ముళ్ల బాధ్యత తీసుకున్నా. నాకు ముగ్గురు పిల్లలు. మా ఆయన గంగయ్య ఏ పనీ చేయక తాగుడుకు బానిసయ్యాడు. ఏ రాత్రీ గొడవ లేకుండా తెల్లారలేదు. పగటిపూట కూలిపనులకు వెళుతూ, రాత్రిపూట బీడీలు చుట్టేదాన్ని. కంటినిండా నిద్ర అన్న విషయమే మర్చిపోయా. బాగా సంపాదిస్తానని మా ఆయన పదిహేనేళ్ల క్రితం గల్ఫ్‌కి వెళ్లాడు. వెళ్లింది వెళ్లడమే... తను ఉన్నాడో లేడో కూడా తెలిసింది కాదు. నయాపైసా పంపిందిలేదు. ఆ తర్వాత ఎప్పుడో అక్కడే చనిపోయాడని తెలిసింది.



పూరి జగన్నాథ్‌తో...

### భుజాన సచ్చిపోయిన బిడ్డతో...

నా చిన్న బిడ్డ అనితకు ఎనిమిదేళ్ల వయసులో మస్తు జొరం వచ్చింది. అప్పుడు మా ఆయన గల్ఫ్‌లో ఉన్నడు. జగిత్యాలలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చిన. వారం రోజులు గడిచాక డాక్టర్ 'ఇక నీ బిడ్డను ఇంటికి తీసుకపో' అన్నాడు. నా బిడ్డకు నయం అయ్యింది. డాక్టరు మంచోడు అనుకున్న. తనని భుజాన వేసుకుని బస్టాండుకు వెళ్లా. అనిత కాళ్లు, మెడ వేలాడుతుండడంతో బస్టాండులో ఎవరో చూసి సచ్చిపోయిన బిడ్డను ఎందుకు ఎత్తుకున్నవ్ అని అడిగిండ్రు. సచ్చిపోలే నిద్రపోయింది అని చెప్పిన. సచ్చిపోయినోళ్ల కాళ్లే ఇట్లా వేలాడుతయ్ అది కూడా నీకు తెల్వదా అనడంతో బిడ్డను కిందికి దించి, చూసేసరికి ఊపిరి ఆగిపోయిందని తెలిసింది. బస్టాండులోనే శవాన్ని పెట్టుకుని ఏడ్చిన...' అంటూ బిడ్డను గుర్తుకు చేసుకొని కంటనీరు పెట్టుకుంది గంగవ్వ.

### దశ తిప్పిన యూట్యూబ్

వ్యవసాయ కూలీగా పని చేసుకుంట బతుకు వెళ్లదీస్తున్న గంగవ్వకు 'మై విలేజ్ షో' అనే యూ ట్యూబ్ షో మరో జన్మనిచ్చిందని చెప్పింది. తనకే తెలియని తనలోని సహజ నటిని ప్రపంచానికి పరిచయం చేసింది. తన స్వభావంతో, తన మాటతో, తన విరుపుతో గంగవ్వ నటించడం వల్ల ప్రేక్షకులకు విపరీతంగా నచ్చింది. ఆమె ఉన్న ఎపిసోడ్ హిట్ అని పేరుపడింది. గంగవ్వ ఇప్పటి వరకు సుమారు 100 షార్ట్ ఫిల్మ్స్‌లో నటించింది. తన ఇంట్లో టీవీ కూడా లేని గంగవ్వ టీవీ, సినిమా స్టార్‌గా ఎదిగింది. గంగవ్వ సహజ నటనను చూసిన సినిమా డైరెక్టర్లు అవకాశం ఇవ్వడంతో మల్లేశం, ఇస్మార్ట్ శంకర్ సినిమాల్లో అవకాశం కల్పించారు. టీవీ ఛానల్‌లో ప్రసారమైన సిక్స్‌సెన్స్ కార్యక్రమంలో విజేతగా నిలిచి అబ్బురపరిచింది.



మహిళా దినోత్సవం సందర్భంగా 'గ్రామీణ సంస్కృతి ప్రచారకర్త'గా అవార్డు అందుకుంటూ

### ప్రపంచస్థాయిలో గుర్తింపు

మారుమూల గ్రామం లంబాడిపల్లికి చెందిన మిల్కూరి గంగవ్వ పేరు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మారుమోగుతోంది. బ్రిటీష్ బ్రాడ్ కాస్టింగ్ సంస్థ తరపున రివర్స్ స్టోరీ అంశంపై గంగవ్వ క్షేత్రస్థాయిలో పర్యటించి రిపోర్టింగ్ చేసింది. అమెరికా, ఆస్ట్రేలియాలోని తెలుగువాళ్లు గంగవ్వను కలిసేందుకు ఇష్టపడుతున్నారు. ఒక్కసారి నీ తిట్లతో దీవించు అంటూ గంగవ్వను వెతుక్కుంటూ వెళ్లి, ఆమె మాటలు, తిట్లు వింటూ సంబరపడిపోతున్నారు. పదేళ్ల చిన్నారుల నుండి పండు ముసలివాళ్ల వరకు గంగవ్వను చూడాలని, మాట్లాడాలని పోటీ పడుతున్నారు. సోషల్ మీడియా, రూరల్ మీడియా విభాగంలో గంగవ్వ తన ప్రతిభకు పురస్కారాలు అందుకుంది.

'బతుకంతా మస్తు కష్టపడ్డ. రాట కొట్టిన, మోట కొట్టిన, బారాన కోసం కూళ్లకు పోయిన. ఫలితం లేకపోయింది. ఇప్పుడు మీ అందరి వల్ల ఇయ్యాల పేరొచ్చింది. చిన్నగున్నమని చింత చేయద్దు. పెద్ద పోకడకు పోవద్దు. పెద్దగ పెంచుకుంట పోతే ఇంక మనకు బాగా పేరొస్తది' అంటూ పురస్కారం అందుకున్న సందర్భంగా ఇలా అమూల్యమైన మాటలు తెలిపింది గంగవ్వ.

**– నిర్మలారెడ్డి, జవ్వాజి చంద్రశేఖర్**, మల్యాల
ఫొటోలు: **బొమ్మెన కుమార్**

### నాకింత గుర్తింపు వస్తదనుకోలేదు

బడికి పోలేదు. పలక బలపం పట్టి చదువు నేర్సుకోలేదు కాని ఇప్పుడు ఇంగ్లిష్ కూడా కొంచెం కొంచెం మాట్లాడుతున్న. డైరెక్టర్ పూరి సార్ నన్ను పిలిచి సినిమాల నటించమంటే 'నటించుడు రాదు సారూ మీరు చెప్పింది చెప్పినట్లు సేత్తా' అంటే కొద్దిసేపు ఇస్మార్ట్ శంకర్ సినిమాలో తీసుకున్నడు. మల్లేశం సినిమాలో చేసిన. టీవీలో ఓ యాడాది యాంకర్‌గా చేసిన. ఎక్కడైనా నమ్మకంగా ఉండి, ఆత్మవిశ్వాసంతో పని చేస్తే విజయం లభిస్తుంది.

– గంగవ్వ, యూట్యూబ్ స్టార్

**గల్ఫ్ పోరు**

# ఆమె సమరం



భర్త పోషన్నతో గంగజల

'గంగా.. నేను మిమ్ముల మల్లా చూస్తనో లేదో.. ' అంటూ ఏడ్చేస్తున్నాడు పోషన్న– ఇండియాలో ఉన్న తన భార్య గంగజలకు వీడియో కాల్ చేసి.

'ఏ.. ఊకో.. గా జ్వరానికే గట్ల బేజారైతే ఎట్ల? ఏంగాదు' భర్తకు ధైర్యం చెప్తోంది గంగజల.

'లేదే.. కుడి షెయ్యి లేస్తలేదు.. చూస్నవ్ కదా.. ఏం మింగస్తలేదు.. మాట సూత సక్క గొస్త...' అంటూండగానే అతని మాట పడిపోయింది. ఏదో చెప్పబోతున్నాడు.. గొంతు పెగలట్లేదు. దుఃఖం వస్తోంది అతనికి. ఏడుస్తున్నాడు.

దుబాయ్‌లోని వర్కర్స్ క్యాంప్ గదిలో తన భర్త పడ్తున్న అవస్థ ఇండియాలో ఉన్న గంగజలకు భయం పుట్టించింది. అయితే ధైర్యం కోల్పోలేదు ఆమె. వెంటనే దుబాయ్‌లోనే ఉన్న గల్ఫ్ గ్రూప్ సేవా సమితి సభ్యులకు వాట్సప్‌లో వాయిస్ మెసేజ్ పెట్టింది. ఆ గ్రూప్ ద్వారా  పోషన్నకు పని ఇప్పించిన 'స్టార్ సర్వీస్ ఎల్ఎల్‌సి' సిబ్బంది మీద ఒత్తిడి పెట్టించింది. 'పోషన్నను ఆసుపత్రిలో చేర్పించండి లేదంటే వీసా ఇప్పించి ఇండియాకైనా పంపించండి' అని వొత్తిడి తెచ్చింది. తప్పించుకోలేక పోషన్నను ఆసుపత్రిలో చేర్పించారు ఆ ఉద్యోగనియామక ఏజెన్సీ సిబ్బంది.

### దీనికి ముందు సంగతి

కొక్కెరకాని పోషన్న ఉరఫ్ కొక్కెని పోషన్న యేడాదిన్నర కిందట దుబాయ్‌కి వెళ్లాడు. వీసాకోసం స్థానిక సబ్ ఏజెంట్, జగిత్యాల్‌లో ఉన్న లైసెన్స్‌డ్ గల్ఫ్ రిక్రూటింగ్ ఏజెంట్ (గల్ఫ్‌లో ఉపాధి చూపించేందుకు కేంద్రప్రభుత్వం ద్వారా అనుమతిపత్రం పొందిన ఏజెంట్)కి దాదాపు 70 వేల రూపాయలు చెల్లించాడు. స్టార్ సర్వీస్ ఎల్ఎల్‌సీ అనే దుబాయ్ ఏజెన్సీ ద్వారా అక్కడ పోషన్నకు పని ఇప్పించారు ఇక్కడి ఏజెంట్లు. ఇచ్చిన పని చేసుకుంటూ పోతున్న పోషన్నకు ఒకరోజు జ్వరంతో మొదలైన అనారోగ్యం పక్షవాతానికి దారితీసింది. తను పనిచేస్తున్న కంపెనీ తరఫున పోషన్నకు ఇన్సూరెన్స్ లేకపోవడంతో ఆ సంస్థగానీ, ఉద్యోగం చూపించిన ఏజెన్సీగానీ పట్టించుకోలేదు. పోషన్నకు బీపీ ఎక్కువై, సరైన సమయంలో వైద్యం అందక కుడి చేయి అచేతనమైంది. ఆ తర్వాత  మాటా పడిపోయింది.

### బీమా లేకే

నిజానికి పోషన్నకు దొరికింది వర్క్ వీసా కాదు. విజిట్ వీసా. దీనివల్లే అక్కడ కంపెనీ అతనికి ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డ్ రెండూ ఇవ్వలేదు. ఫలితంగా పోషన్న అనారోగ్యం పక్షవాతం దాకా పోయింది. దీనికంతటికీ కారకులు.. పోషన్నను దుబాయ్‌కి పంపిన ఏజెంట్లే. ***వాళ్లు అతనికి వర్క్ వీసా కాకుండా విజిట్ వీసా ఇవ్వడం వల్ల వలస కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే 'ప్రవాస భారతీయ బీమా' పథకం వర్తించలేదు. రెండేళ్లకు కలిపి 325 రూపాయల ప్రీమియం చెల్లిస్తే వలస వెళ్లినచోట ఏదైనా ప్రమాదం జరిగినా, అంగవైకల్యం సంభవించినా పదిలక్షల రూపాయల బీమా వర్తిస్తుంది.*** పోషన్నలా అనారోగ్యం కలిగితే లక్ష రూపాయలతో పాటు, స్వదేశం రావడానికి ఎయిర్ టికెట్టూ దొరుకుతుంది. ఈ విషయం పోషన్నకు, గంగజలకు తెలియక చాలా నష్టపోయింది ఆ కుటుంబం. ఏజెంట్లు తమకు చేసిన అన్యాయం మీద కడుపు మండింది ఆమెకు.

### ఈ మోసం ఎంత కాలం?



జగిత్యాల జిల్లా, ధర్మపురి మండలం, జైన గ్రామంలో ఉండే గంగజల  ఇంటర్ చదివింది. ఆపై చదివించే స్థోమత లేని ఆమె కుటుంబం అప్పటికే దుబాయ్ వెళ్లొచ్చిన  పోషన్నకు ఇచ్చి పెళ్లి చేసింది. పెళ్లయిన యేడాదిన్నరకే పిల్లాడు పుట్టాడు. పెళ్లి, భార్య డెలివరీకి అయిన అప్పులు, ఊర్లో పనీ దొరక్క మళ్లీ గల్ఫ్‌కు వెళ్లాలనుకున్నాడు పోషన్న. తన బంగారం అమ్మి, లక్షాయాభైవేల రూపాయలు భర్తకు ఇచ్చింది గంగజల. ఇరాక్‌కు వీసా ఇప్పిస్తానని ఆ డబ్బు తీసుకున్న ఏజెంట్ పారిపోయాడు. కొన్నాళ్లాగి గల్ఫ్ కోసం మళ్లీ ప్రయత్నించిన పోషన్నకు ఈసారి దుబాయ్‌కి వీసా దొరకడంతో దుబాయ్‌కు వెళ్లాడు. ఈ రకమైన మోసానికి గురయ్యాడు.

### పోరాటం షురూ

తన భర్తకు వీసా ఇప్పించిన ఏజెంట్‌ను నిలదీసింది గంగజల. 'విజిట్ వీసాకు బీమా ఉండదు' అని చెప్పాడు. 'పనికోసం దరఖాస్తు పెట్టుకుంటే విజిటింగ్ వీసా ఎలా ఇచ్చారు?' అని ప్రశ్నించింది. మోసానికి పాల్పడినందుకు బీమా కింద వచ్చే లక్షరూపాయలు ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేసింది. ఈ విషయమై కలెక్టర్, ప్రొటెక్టర్ ఆఫ్ ఇమ్మిగ్రెంట్స్ (హైదరాబాద్, ఢిల్లీ)కూ దరఖాస్తు చేసుకుంది. విచారణకు ఆదేశమిచ్చారు జిల్లా కలెక్టర్. ఇది తెలిసి ఎంతోకొంత డబ్బిచ్చి పక్కకు తప్పుకోవాలనుకున్నాడు ఏజెంట్. ఒప్పుకోని గంగజల.. 'ఇంటర్ వరకు చదువుకున్న నాకే మోసం జరిగితే అసలు అక్షరం ముక్క తెల్వకుండా గల్ఫ్‌కు పోతున్న ఎంతమందికి ఇంకెంత మోసం జర్గుతుండచ్చు? మా ఆయన మంచంల పడేదాకా ఈ పాలసీ గురించి తెల్వకపోయే. నా అసుంటోళ్లు ఇంకెంతమంది ఉన్నరో? గందుకే కొట్లాడుతున్నా. ఈ కొట్లాటతోని వేరోళ్లకన్నా తెలివస్తది.. తెలుసుకుంటరు. ఇందుకోసం అవసరమనుకుంటే ఢిల్లీకీ పోతా' అంటోంది గంగజల.

**– సరస్వతి రమ**

**ఉమెన్స్ డే**

## వినూత్న దినోత్సవం



**మహిళా దినోత్సవం అంటే మహిళలలో స్థయిర్యం నింపాల్సిన దినోత్సవం. ఇవాళ కేన్సర్ బారిన పడుతున్నవారిలో స్త్రీల సంఖ్య పెరుగుతోంది. కుటుంబం, భర్త, బాధ్యతలు వీటి నడుమ ఈ మహమ్మారితో పోరాడాలంటే మనందరం ఒక్కటే అనే భావన కావాలి. అందుకే ముంబైలోని ఒక క్యాన్సర్ సహాయక సంస్థ క్యాన్సర్‌తో పోరాడుతున్న స్త్రీల కోసం ప్రత్యేకంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించింది. ఈ వేడుకలకు బాలీవుడ్ నటి నీతూ చంద్ర, గాయని నేహ బసిన్ హాజరయ్యారు. వారిని ఆటపాటలతో ఉత్సాహపరిచారు. 'కేన్సర్‌తో పోరాడి గెలిచి తీరుతాం' అని ఈ సందర్భంగా ఆ స్త్రీలంతా ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం అంటే అన్ని సంఘర్షణల్లో ఉన్న స్త్రీల దినోత్సవం కూడా.**

**హెల్త్ టిప్స్**

## తలనొప్పి నుంచి ఉపశమనానికి...

- దాల్చిన చెక్కను పొడిగా చేసి నీటిలో కలిపి నుదుటిపై రాసుకుని అరగంట తరువాత వేడి నీటితో కడిగేయాలి. ఇలా చేయడం వలన తలనొప్పి నుంచి ఉపశమనం పొందుతారు.
- తాజా ద్రాక్ష పళ్లతో జ్యూస్ చేసుకుని తాగడం వలన తలనొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు. ఈ జ్యూస్‌ను రోజుకు రెండు సార్లు తాగితే సరిపోతుంది.
- అల్లం రసాన్ని కాస్త నిమ్మ రసంలో కలిపి తాగడం వలన తలనొప్పి తగ్గుముఖం పడుతుంది.
- తలనొప్పి ఎక్కువైనప్పుడు మెడ, తల భాగాన్ని నొక్కుతూ మెల్లగా మసాజ్ చేసుకోవడం వలన రక్తప్రసరణ పెరిగి తలనొప్పి తగ్గుతుంది.

**చెట్టు నీడ**

## ఒక్క తల చాలు!

శూర్పణఖ తనకు లక్ష్మణుడు చేసిన పరాభవాన్ని అన్న అయిన రావణుడితో చెప్పుకుని, తన పగ తీరే మార్గాన్ని ఇలా చెప్పింది.

''ఆ అన్నదమ్ములు అమిత పరాక్రమవంతులు. వారు నశించాలంటే ఒక్కటే మార్గం వుంది. రాముని భార్య సీత అత్యంత మనోహరంగా వుంటుంది. అంతటి సౌందర్యవతి, రాముడి పత్నిగా అరణ్యంలో వుండకూడదు. నీ దగ్గర వుండాలి. నువ్వు ఆమెను అపహరించి, లంకలో నీ దగ్గర పెట్టుకో. సీతావియోగం భరించలేక రాముడు, అన్న ఆవేదన చూడలేక తమ్ముడూ తల్లడిల్లుతారు. నువ్వు అన్నగా నాకు చేసే ఉపకారం ఇదే. ప్రతీకారం తీర్చుకో' అంది.

రావణుడు సైన్యాన్ని పంపి, రామలక్ష్మణులను ఎదుర్కోమన్నాడు. వాళ్లందరూ ఆ సోదరుల చేతిలో నిహతులయారు. పరాక్రమవంతుల్ని బాణాలతో కాదు, మాయతో పడగొట్టాలి అనుకుని రావణుడు మారీచుడి ఆశ్రమానికి వెళ్లి తన మనోరథం వివరించాడు.

ఆ మాటలకు 'రావణా! నువ్వు ఎవరితో చెలగాటమాడుతున్నావో నీకు తెలియడం లేదు. రాముడు అమిత పరాక్రమవంతుడు. రాముడి బాణశక్తిని గురించి నువ్వు ఎరగవు. ఒక్క బాణంతో యావత్తు భూమండలాన్ని కుదిపివేయగల మహాశక్తిమంతుడు రాముడు. అస్త్రవిద్యలో అతనికి వేరెవరూ సాటి రారు. పైగా రాముడు ధర్మమూర్తి, మూర్తీభవించిన ధర్మస్వరూపం. అటువంటి ధర్మాత్ముడితో పెట్టుకోకు. సీత మహాపతివ్రత. నువ్వు తస్కరించినా నీకు ఆమె లొంగదు. నువ్వు ఈ ప్రయత్నం మానుకో. కోరి వినాశనం తెచ్చుకోకు. ఈ దుర్మార్గపు నాటకంలోకి నన్ను ఈడ్వకు. ఇందులో నేను పాలు పంచుకోలేను' అని చెప్పాడు మారీచుడు.

రావణుడు వినలేదు.

'నువ్వు నా బంటువు. చేయకుంటే చస్తావు. నేను చెప్పిన పని చేస్తే, నా రాజ్యంలో సగభాగం నీకు ఇస్తాను. ఏది కావాలో తేల్చుకో' అని రావణుడు హెచ్చరించాడు. 'నీ చేతిలో చచ్చేకంటె ఆ రాముడి చేతిలో చావడం మేలు! నీ కర్మ' అన్నాడు మారీచుడు. మూర్ఖత్వం, అహంభావం గల రావణుడికి మంచి మాట తలకి ఎక్కలేదు. చేస్తున్న పని గురించి ఆలోచించడానికి ఒక్క తల చాలు! రావణుడికి పది తలలున్నాయి – ఏం లాభం?

**– రావి కొండలరావు**



**బ్యూటిప్స్**

## గ్రీన్ టీతో మెరుగైన కాంతి

**సీజన్ మారే ఈ సమయంలో చర్మం పొడిబారడం, దుమ్ము ధూళి వల్ల చర్మసమస్యలు తలెత్తకుండా...**

- కప్పు తేనీరు (చల్లనిది), రెండు టీ స్పూన్ల బియ్యప్పిండి, అర టీ స్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి, 20 నిమిషాలు ఆరనివ్వాలి. శుభ్రపరుచుకోవడానికి ముందు కొన్ని నీళ్లు ముఖం మీద చల్లుకుంటూ వలయాకారంగా రుద్దుతూ శుభ్రపరుచుకోవాలి
- టబ్ బాత్ చేసేటప్పుడు కొన్ని తేయాకులు నీటిలో వేసి, అరగంట తర్వాత స్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల చర్మకాంతి మెరుగుపడుతుంది
- స్నానం చేసిన ప్రతీసారి చల్లని గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ ని ముఖానికి స్ప్రే చేసుకొని, పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి
- తేనీటి (బ్లాక్)లో ఐస్ క్యూబ్ వేసి, ఆ నీటిని ముఖానికి స్ప్రే చేసుకొని, కాసేపు సేదతీరాలి. ఎండ బారిన పడి ఇంటికి వచ్చినప్పుడు ఇలా చేయడం వల్ల కమిలిన చర్మం తిరిగి పూర్వపు స్థితికి చేరుకుంటుంది. అలసట నుంచి విశ్రాంతి లభిస్తుంది
- జుట్టు నిర్జీవంగా మారితే తలస్నానం చేసిన తర్వాత తేనీటితో కడగండి. కండిషనర్‌లా ఉపయోగపడుతుంది. ఇలా చేస్తూంటే జుట్టుకు జీవకళ లభిస్తుంది.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
మంగళవారం ॥ 10-3-2020


● ప్రభాస్


● విష్ణు మంచు


● రామ్‌చరణ్, ఎన్టీఆర్


● మంచు మనోజ్

# ప్యాన్ ఇండియా

**ఇంతకుముందు ప్రాంతీయ భాషల సినిమాలకు పరిమితులుండేవి. కేవలం రీజినల్ మార్కెట్టే ఆ సినిమాల మెయిన్ టార్గెట్. సినిమా కథలు కూడా కేవలం వాళ్లకే అన్నట్టుగా తయారయ్యేవి. కానీ గడిచిన నాలుగైదేళ్ల నుంచి ప్రాంతీయ భాషల సినిమాలకు పరిమితులు తొలగిపోయాయి. హద్దులు చెరిగిపోయాయి. ఈ మార్పులో 'బాహుబలి' కీలక పాత్ర పోషించిందని సందేహం లేకుండా చెప్పొచ్చు. ఆ సినిమా తర్వాత దేశవ్యాప్తంగా తెలుగు సినిమాకి అభిమానులు ఎక్కువయ్యారు. మన సినిమాకి ఎక్కువమంది ఫ్యాన్స్ ఉన్నారు కాబట్టే మనవాళ్లు ప్యాన్ ఇండియా (దేశంలో ఎక్కువ భాషల్లో సినిమాని విడుదల చేయడం) సినిమాగా తీయడానికి సంకోచించడం లేదు. ఐదారు భాషల్లో ఏకకాలంలో సినిమాని విడుదల చేసి మార్కెట్‌ను విస్తృతం చేసుకుంటున్నారు. ప్రస్తుతం తెలుగులో సుమారు పది సినిమాలు 'ప్యాన్ ఇండియా' మార్కెట్‌ను టార్గెట్ చేస్తూ రెడీ అవుతున్నాయి. వాటి వివరాలు.**

**ట్రిబుల్ ఆర్.. టార్గెట్ 10**

'బాహుబలి'తో మార్కెట్ లెక్కలకి కొత్త రెక్కలిచ్చారు దర్శకుడు రాజమౌళి. కథ బావుంటే సినిమా ఏ ప్రాంతంలో తయారైనా ఆదరణ అంతటా లభిస్తుందని నిరూపించారు. 'బహుబలి' ఇచ్చిన నమ్మకంతోనే ప్రస్తుతం మరో ప్యాన్ ఇండియా సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఎన్టీఆర్ – రామ్‌చరణ్‌లు హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో 'ఆర్ఆర్ఆర్' అనే సినిమా తెరకెక్కుతోంది. సుమారు 400 కోట్ల వ్యయంతో ఈ సినిమా తెరకెక్కుతోంది. 1920ల బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా ఉంటుంది. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది. దాదాపు పది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.

**డార్లింగ్.. టార్గెటింగ్ వరల్డ్**

'బాహుబలి'తో నార్త్ ఆడియన్స్‌కి కూడా ప్రభాస్ డార్లింగ్ అయిపోయారు. 'సాహో' సౌత్‌లో అంచనాలను అందుకోలేకపోయినా నార్త్‌లో బాక్సాఫీస్‌ని షేక్ చేసింది. ప్రస్తుతం రాధాకృష్ణతో ప్రభాస్ చేస్తున్న 'ఓ డియర్' ప్యాన్ ఇండియా మూవీ అయితే ఆ తర్వాత నాగ్ అశ్విన్‌తో దర్శకత్వంలో చేయనున్న సినిమా ప్యాన్ వరల్డ్. 'ఓ డియర్' సినిమా పీరియాడిక్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. పూజా హెగ్డే కథానాయిక. ఈ చిత్రం ఐదు భాషల్లో విడుదల కానుంది. ఇక నాగ్ అశ్విన్‌తో చేయబోయేది సైన్స్ ఫిక్షన్ జానర్ సినిమా. "ఇది ప్యాన్ వరల్డ్ మూవీ" అంటున్నారు నాగ్ అశ్విన్.

**నిశ్శబ్దంగా...**

'బాహుబలి' తర్వాత అనుష్క తాజా చిత్రం 'నిశ్శబ్దం' కూడా పలు భాషల్లో రిలీజ్ కానుంది. పూర్తి స్థాయిలో అమెరికా బ్యాక్‌డ్రాప్‌లో జరిగే థ్రిల్లర్ చిత్రమిది. ఏప్రిల్ 2న విడుదల కానుంది. ఇందులో అనుష్క మూగ, చెవిటి అమ్మాయిగా నటించారు. సినిమాలో ఆమె చిత్రకారిణి. ఇది 'క్రాస్ ఓవర్' మూవీ. అంటే.. పలు భాషలకు చెందిన వాళ్లు కలిసి ఒకే సినిమాలో నటించడం. ఈ సినిమాలో ఎక్కువమంది హాలీవుడ్ తారలు ఉండటం విశేషం. ఐదు భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

**ఇస్మార్ట్ మూవ్**

'ఇస్మార్ట్ శంకర్' ఘనవిజయంతో దర్శకుడు పూరి జగన్నాథ్ డబుల్ ఎనర్జీతో ఉన్నారు. ఇస్మార్ట్ ప్లాన్ చేశారు. ఇప్పుడు యూత్ సెన్సేషన్ విజయ్ దేవరకొండతో కలసి బాక్సింగ్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ చేస్తున్నారు. దీని కోసం బాలీవుడ్ ప్రొడ్యూసర్ కరణ్ జోహార్ కూడా వీళ్లకు తోడయ్యారు. అనన్యా పాండే కథానాయిక. హిందీ– తెలుగు భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను ఐదు భాషల్లో విడుదల చేయాలనుకుంటున్నారు.

**గ్రాండ్ కమ్‌బ్యాక్**

మూడేళ్ల నుంచి మంచు మనోజ్ ఎనర్జీ స్క్రీన్ మీద కనిపించడం లేదు. అయితే కమ్‌బ్యాక్‌ను చాలా గ్రాండ్‌గా ప్లాన్ చేశారు మనోజ్. 'అహం బ్రహ్మాస్మి' అనే టైటిల్‌తో ఓ ప్యాన్ ఇండియా సినిమా చేస్తున్నారు. ఈ చిత్రం ద్వారా శ్రీకాంత్ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇటీవలే ముహూర్తం జరుపుకుంది ఈ సినిమా. ఐదు భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

**ప్యాన్ కన్నప్ప**

'భక్త కన్నప్ప' పై సినిమా చేయాలని కొంతకాలంగా వర్క్ చేస్తున్నారు మంచు విష్ణు. కన్నప్ప పాత్రలో నటించి ఈ సినిమాను నిర్మించనున్నారు. సుమారు 95 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్ట్ తీయనున్నారు. భారీ స్థాయిలో ఉండేలా ప్రీ– ప్రొడక్షన్ పనులు చేస్తున్నారు. హాలీవుడ్ దర్శకుడు ఈ సినిమాను డైరెక్ట్ చేయనున్నారు.

**డబుల్ ప్యాన్**

హిందీ–తెలుగు–తమిళం ఇలా ఏ భాషలో అయినా కనిపిస్తూనే ఉంటారు రానా. కథ నచ్చితే పాత్ర ఏదైనా డబుల్ ఓకే అంటారాయన. ప్రస్తుతం రానా 'అరణ్య' అనే భారీ ప్రాజెక్ట్‌ను సిద్ధం చేశారు. అడవులను రక్షించాలనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలోని పాత్ర కోసం 30 కిలోలు తగ్గారు రానా. హిందీ, తెలుగు, తమిళంలో ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. అలాగే 'హిరణ్య కశ్యప' అనే పౌరాణిక చిత్రంలో కనిపించనున్నారు. గుణశేఖర్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమా 180 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కనుందట. ఇది కూడా ప్యాన్ ఇండియా సినిమానే.

**మేజర్ ప్లాన్**

పరిమిత బడ్జెట్, పరిమిత వనరులతో సినిమాలు చేసి ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంటారు 'అడవి' శేష్. 'క్షణం, గూఢచారి, ఎవరు' సినిమాలు ఈ విషయాన్ని నిరూపించాయి. ఈసారి కేవలం తెలుగు ప్రేక్షకులనే కాదు, దేశవ్యాప్తంగా ఇండియన్ ఆడియన్స్‌ను తన మ్యాజిక్‌లో పడేయడానికి సిద్ధమయ్యారు శేష్. ముంబై తాజ్ హోటల్‌లో జరిగిన టెర్రరిస్ట్ అటాక్‌లో ప్రాణాలు కోల్పోయిన మేజర్ ఉన్ని కృష్ణన్ జీవితం ఆధారంగా శేష్ టైటిల్ రోల్‌లో 'మేజర్' చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి శశికిరణ్ తిక్క దర్శకుడు.

**కరణం.. ఆదర్శం**

ఒలింపిక్స్‌లో మన దేశానికి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకాన్ని తీసుకొచ్చారు కరణం మల్లీశ్వరి. ఎందరో క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారామె. ఆమె జీవితాన్ని స్క్రీన్ మీద చూపించాలనుకుంటున్నారు దర్శకురాలు సంజనా రెడ్డి. సుమారు 50 కోట్ల వ్యయంతో ప్యాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపొందనుంది. నటీనటుల వివరాలు ఇంకా ప్రకటించలేదు.

ఇవి కాకుండా మరికొన్ని ప్యాన్ ఇండియా స్థాయిలో చెప్పాల్సిన కథలు రచయితల డ్రాయింగ్ రూమ్‌లో రెడీ అవుతూనే ఉండొచ్చు. ఇవన్నీ బాగా ఆడాలని, మన కథలు ప్రపంచస్థాయికి వెళ్లాలని, తెలుగు సినిమా పరిధి, స్థాయి, మార్కెట్, గౌరవం మరింత పెరగాలని ఆశిద్దాం. తెలుగు సినిమా జయహో!

– గౌతమ్ మల్లాది


● విజయ్ దేవరకొండ, అనన్యా పాండే


● రానా


● అడవి శేష్


● అనుష్క


● కియారా అద్వానీ

## నన్ను నవ్వించాలి

'షేర్‌షా, లక్ష్మీబాంబ్, ఇందూ కీ జవానీ, భూల్ భులయ్యా 2' సినిమాల విడుదల కోసం వెయిట్ చేస్తున్నారు హీరోయిన్ కియారా అద్వానీ. ప్రస్తుతానికి తెలుగులో సినిమాలు చేయడం లేదు కానీ హిందీలో బిజీగా ఉన్నారు కియారా. మరి.. పర్సనల్ లైఫ్ పట్టించుకునే తీరిక దొరుకుతోందా? అని కియారాని అడిగితే.. 'హా...భేషుగ్గా.. నా పర్సనల్ లైఫ్‌కి ఏ ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నాను. ప్రొఫెషనల్, పర్సనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేసుకుంటున్నాను'' అన్నారు. మరి.. కాబోయే భర్తకు ఎలాంటి లక్షణాలు ఉండాలి? అనేవి కూడా అనుకున్నారా? అంటే ''కాబోయే భర్త గురించి కొన్ని అభిప్రాయాలున్నాయి. అతను ఎంతో నమ్మకంగా ఉండాలి. నన్ను నవ్విస్తుండాలి. నా జోక్స్‌కు తను నవ్వాలి. స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగల తెగువ ఉండాలి. ఏ విషయాన్నైనా ముక్కుసూటిగా చెప్పగలిగే ధైర్యవంతుడై ఉండాలి. ఇతరులతో చాలా మర్యాదగా మసులుకోవాలి. ముఖ్యంగా నేను పురుషుడిని అనే అహంభావం ఉండకూడదు. అది ఉన్నవారిని నేను అస్సలు ఇష్టపడను'' అని మనసులోని మాటను బయట పెట్టారు కియారా.

## నేను స్లోగా వెళుతున్నానా అనిపించింది

- రామ్‌గోపాల్ వర్మ



● బెనర్జీ, జేడి చక్రవర్తి, రామ్‌గోపాల్ వర్మ, యన్.యస్.సి.

''ఎంఎంఓఎఫ్' ట్రైలర్ చూశాక నేను నిదానంగా వెళుతున్నానా? సినిమా తీసినవారు ఫాస్ట్‌గా ఉన్నారా? అనే అనుమానం కలిగింది. ఈ సినిమా ట్రైలర్ చాలా కొత్తగా ఉంది. జేడీ చక్రవర్తి ఇలాంటి కొత్త కథలతో మరెన్నో సినిమాలు చేయాలి'' అన్నారు డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ. జేడీ చక్రవర్తి, బెనర్జీ, అక్షత, మనోజ్ నందన్ ప్రధాన పాత్రల్లో యన్.యస్.సి. దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'ఎంఎంఓఎఫ్'. అనుశ్రీ సమర్పణలో ఆర్ఆర్ఆర్ ప్రొడక్షన్స్ జేకే క్రియేషన్స్ బ్యానర్స్‌పై ఆర్ఆర్ఆర్ రాజశేఖర్, జేడీ కాశీం నిర్మిస్తున్న ఈ చిత్రం ట్రైలర్‌ని హైదరాబాద్‌లో రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. డైరెక్టర్ శివ నాగేశ్వర రావు మాట్లాడుతూ– ''వర్మలా సినిమాలు చేయాలని, అతన్ని అనుకరించాలని చాలామంది అనుకుంటారు. కానీ అది అసాధ్యం. జేడీ చక్రవర్తి మంచి నటుడు. ఈ ట్రైలర్ చూస్తుంటే త్వరగా సినిమా చూడాలనిపిస్తోంది'' అన్నారు. ''జేడీ చక్రవర్తితో చాలా కాలం తర్వాత నటించాను. ఆర్జీవీగారి దాదాపు అన్ని సినిమాల్లో నేను నటించాను. తెలుగు సినిమాకు డిఫరెంట్ మేకింగ్‌ను పరిచయం చేసిన వ్యక్తి ఆయన. 'ఎంఎంఓఎఫ్' సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది'' అన్నారు నటుడు బెనర్జీ. జేడీ చక్రవర్తి, నటులు ఉత్తేజ్, మనోజ్ నందం, నిర్మాత రామసత్యనారాయణ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాయి కార్తీక్, కెమెరా: 'గరుడవేగ' అంజి.

## డైరెక్షన్ మారింది


● కల్యాణి

''ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు, వసంతం, కబడ్డీ కబడ్డీ, పెదబాబు' వంటి పలు విజయవంతమైన సినిమాల్లో కథానాయికగా నటించి, తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న కల్యాణి డైరెక్షన్ మార్చారు. దర్శక–నిర్మాతగా మారారు. ఇటీవల అతిథి పాత్రల్లో కనిపిస్తూ వస్తున్న ఆమె కే2కే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై స్వీయ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని రూపొందించనున్నారు. చేతన్ శీను, సిద్ధి, సుహాసినీ మణిరత్నం, రోహిత్ మురళి, శ్వేత ప్రధాన పాత్రల్లో నటించనున్నారు. హోలి పర్వదినం సందర్భంగా ఈ సినిమా ప్రీ లుక్, టీజర్ గ్లింప్స్‌ను దర్శకుడు పూరి జగన్నాథ్ విడుదల చేశారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందనున్న చిత్రమిది. విలక్షణ ప్రేమకథతో సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఉంటుంది. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం రూపొందనుంది. త్వరలోనే చిత్రీకరణ మొదలవుతుంది'' అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి.

## నచ్చినవి రాలేదు.. వచ్చినవి నచ్చలేదు


● బాలాదిత్య

''టీవీ కెమెరా, సినిమా కెమెరా, వెబ్‌సిరీస్ కెమెరా... నటించేవారికి ఏదైనా ఒకటే. యాక్టింగ్ యాక్టింగే'' అన్నారు బాలాదిత్య. అన్నపూర్ణ, మాస్టర్ రవితేజ ప్రధాన పాత్రధారులుగా నర్రా శివనాగేశ్వరరావు (శివనాగు) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అన్నపూర్ణమ్మగారి మనవడు'. బాలాదిత్య, అర్చన కీలక పాత్రధారులు. ఎంఎన్ ఆర్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. బాలాదిత్య మాట్లాడుతూ – ''పదిహేడేళ్ల వయసులో హీరోగా 'చంటిగాడు' సినిమాలో నటించాను. కానీ సరైన విద్యార్హత ఉండాలనే మా అమ్మ మాట కోసం నా యాక్టింగ్ కెరీర్‌కు దాదాపు ఐదేళ్లు బ్రేక్ ఇచ్చాను. కంపెనీ సెక్రటరీ కోర్సులో అర్హత సాధించి, ముంబైలో ట్రైనింగ్ తీసుకున్నాను. 2013–2014 సమయంలో సినిమా చాన్సుల కోసం ట్రై చేశాను. నా దగ్గరకు వచ్చిన కొన్ని కథలు నాకు నచ్చలేదు. ఓ ప్రముఖ టీవీ చానెల్‌కి చెందిన ఓ ప్రోగ్రామ్ ద్వారా మళ్లీ కెమెరా ముందుకు వచ్చాను. ఇటీవల 'ఎంత మంచివాడవురా!' సినిమాలో ఓ రోల్ చేశాను. ఇప్పుడు 'అన్నపూర్ణమ్మగారి మనవడు'లో మంచి పాత్ర చేశాను. అన్నపూర్ణమ్మగారి మనవడు అనే పాత్రను తీసుకుని ఆ కథలో, ప్రణయ్–అమృతల కథను సినిమాటిక్‌గా కలిపారు. నేను ప్రణయ్ పాత్ర చేశాను. సినిమా, టీవీ అనే తేడా ఇప్పుడు లేదు. చిరంజీవి, నాగార్జున, సాయికుమార్‌గార్లు వంటివారు టీవీ ప్రోగ్రామ్స్ చేస్తున్నారు. 'రాసాత్తి' అనే ఓ తమిళ సీరియల్‌లో నటిస్తున్నా. 'గాడ్స్ ఆఫ్ ధర్మపురి' అనే ఓ వెబ్‌సిరీస్ చేశా'' అన్నారు.

## గొడవ ఏంటి?


● దిలీప్, పూనమ్

దిలీప్ రాథోడ్, డా. పూనమ్ శర్మ జంటగా నటిస్తోన్న చిత్రం 'ఘాఠి'. తెలుగు, బంజార భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో వాల్మీకి తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. వాల్మీకి మాట్లాడుతూ– ''రాజస్థాన్‌లో 'ఘాఠి' అనే ప్రాంతంలో బంజార వారికి, మార్వాడీలకు మధ్య జరిగిన వాస్తవ గొడవను దృష్టిలో పెట్టుకొని చేస్తున్న చిత్రమిది. ఆ గొడవలో బంజారా వారు ఘాఠి ప్రాంతాన్ని వదిలి వెళ్లాల్సి వస్తుంది. వాళ్ల మధ్య గొడవ ఏంటి? వాళ్లు మళ్లీ 'ఘాఠి'కి చేరుకున్నారా? అనే అంశానికి లవ్, యాక్షన్, ఎమోషన్‌ని మేళవించి ఈ చిత్రాన్ని తీస్తున్నాం'' అన్నారు. ''మంచి సినిమాలో నటిస్తున్నందుకు హ్యాపీ. షూటింగ్ సగానికి పైగా పూర్తయింది'' అన్నారు దిలీప్. ప్రతాని రామకృష్ణ గౌడ్, ఎ.గురురాజ్, అద్దంకి దయాకర్, బంజార జాతీయ అధ్యక్షుడు బెల్లం నాయక్ పాల్గొన్నారు.

## ప్యాషన్ మాత్రమే సరిపోదు


● రామకృష్ణ

''ఏ సినిమాకైనా ప్రేక్షకులు రావాలంటే కథ, వినోదం, పాటలు బాగుండాలి. మా 'ప్రేమపిపాసి'లో ఇవి చక్కగా కుదిరాయి. వాటితో పాటు యువతకి కావాల్సిన బోల్డ్ కంటెంట్ కూడా ఉంది'' అన్నారు రామకృష్ణ (ఆర్.కె). జీపీఎస్, కపిలాక్షి మల్హోత్రా, సోనాక్షివర్మ హీరో హీరోయిన్లుగా మురళీ రామస్వామి (ఎమ్.ఆర్) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రేమపిపాసి'. ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. రామకృష్ణ (ఆర్.కె) మాట్లాడుతూ– ''2000లో హైదరాబాద్ వచ్చాను. 2010 నుంచి కన్‌స్ట్రక్షన్ బిజినెస్ చేస్తున్నాను. గతంలో ఒక షార్ట్ ఫిలింలో నటించి, నిర్మించాను. మా హీరో, డైరెక్టర్ చెప్పిన కథ నచ్చడంతో 'ప్రేమపిపాసి'తో సినిమా రంగంలో అడుగుపెట్టాను. హిందీలో ఇమ్రాన్ హష్మీ తరహాలో జీపీఎస్‌కి ఈ సినిమాతో లిప్ లాక్ హీరోగా పేరు వస్తుంది. ఈ రంగంలో రాణించాలంటే ప్యాషన్ ఉంటేనే సరిపోదు.. పక్కా ప్రణాళిక కూడా ఉండాలి. సినిమా చేయడం ఒక ఎత్తు అయితే విడుదల చేయడం మరో ఎత్తు అని ఈ చిత్రంతో తెలిసింది. మా బ్యానర్‌లో ఏడాదికి ఓ మంచి సినిమా చేయాలనుకుంటాను. ప్రస్తుతం ముగ్గురు దర్శకులతో చర్చలు జరుపుతున్నాం'' అన్నారు.



సాక్షి
సాగుబడి
నల్లగొండ
మంగళవారం 10-3-2020

దేశంలో మూడున్నర కోట్ల మంది మహిళా రైతులున్నారు. తెలంగాణలో 11,50,039 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 9,84,179 మంది మహిళా సాగుదారులున్నారు. దేశంలో గ్రామీణ మహిళా శ్రామికుల్లో 74% మంది వ్యవసాయ పనుల్లో ఉన్నారు. పురుషుల కన్నా ఎక్కువ చాకిరీ చేస్తున్నా వీరికి 20-25% తక్కువ వేతనమే అందుతోంది. (2011 జనాభా లెక్కల ప్రకారం)



పూర్వాభాద్ర కార్తె : మార్చి 17 వరకు

# రైతు రాణులకు జేజేలు!



మిరప తోటలో అంతర పంటలుగా పండించిన ముల్లంగి, ఉల్లిపాయలతో పరమాత్ముల కోటేశ్వరమ్మ

**మన దేశంలోని రైతు కుటుంబాల్లో 80-85% వరకు ఎకరం, రెండెకరాల భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతు కుటుంబాలే. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని జీవనం సాగించే ఈ వ్యవసాయ కుటుంబాల్లో పురుషుల కన్నా మహిళా రైతుల శ్రమే అధికం. దీక్షగా, క్రమశిక్షణగా వ్యవసాయం చేస్తూ అరకొర వనరులతోనే చక్కని ఫలితాలు సాధిస్తూ కుటుంబాల అభ్యున్నతికి అహరహం కృషి చేస్తున్న మహిళా రైతులెందరో ఉన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా మనోబలంతో నిలబడి వ్యవసాయాన్నే నమ్ముకొని కుటుంబాలకు బాసటగా నిలుస్తున్న ఈ ధీర వనితలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేళ 'సాక్షి సాగుబడి' జేజేలు పలుకుతోంది.**



కల్లెం ఈశ్వరమ్మ



తనుగుల ఆగమ్మ

## 'మీ మిరప పంటలో తాలు కూడా లేదమ్మా..'

- ఎకరం పొలంలో 25 క్వింటాళ్ల పండు మిర్చి దిగుబడి
- ఎకరానికి కషాయాలు, జీవామృతం ఖర్చు రూ. 4,800 మాత్రమే
- అంతర పంటలూ కలిసొచ్చాయి.. అటు ఆదాయం.. ఇటు ఆరోగ్యం
- మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయంలో చక్కని దిగుబడులు
- కోటేశ్వరమ్మను ఎగతాళి చేసిన వారే భళా అంటున్నారు

మిర్చి పంటకు తెగుళ్లు, చీడపీడలు ఆశించటం సహజం. నారు వేసిన దగ్గర్నుంచి మిర్చి కోతలు కోస్తున్నంత వరకు దాడి చేస్తుంటాయి. ఒక పురుగు మందు పనిచేయకపోతే మరొకటి వాడుతూ రసాయన మందులతో రైతులు ఒక రకంగా యుద్ధమే చేస్తారు. అటువంటిది ఎలాంటి పురుగుమందులూ వాడకుండా కేవలం కషాయాలతోనే మిర్చిని పండించాలని చూసిన మహిళా రైతును, తోటి రైతులు ఎగతాళి చేశారు. మందులు కొట్టకుండా పంట ఎట్లా తీస్తావు? అంటూ ప్రశ్నించారు. ప్రకృతి వ్యవసాయాన్ని నమ్ముకొని ఆచరించిన ఆ రైతు చేలో మిరప విరగపండింది. అంతర పంటలతోనూ ఆదాయాన్ని తీశారు. నాడు నవ్విన రైతులే ఇప్పుడు 'తాలు కూడా లేదమ్మా మీ పంటలో...' అంటూ ప్రశంసిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యవసాయ అధికారుల నుంచి ప్రపంచ బ్యాంకు బృందం సహా ఆ మిరప చేనును సందర్శించారు. శభాష్... అంటూ అభినందించారు.

మిర్చి పంట సాగులో అద్భుత విజయం సాధించిన ఆ మహిళా రైతే పరమాత్ముల కోటేశ్వరమ్మ. గుంటూరు జిల్లా పెదనందిపాడు దగ్గర్లోని కొప్పర్రు. జిల్లాకు తలమానికమైన మిర్చిని కోటేశ్వరమ్మ, భర్త వెంకటేశ్వరరావుతో కలిసి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. ఒక అమ్మాయి, అబ్బాయి. ఇద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. ఈ నేపథ్యంలో రైతు దంపతులు పట్టుదలతో నూటికి నూరు శాతం రసాయనాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.



భర్త వేంకటేశ్వరరావుతో కలిసి కల్లంలో మిరప పండ్లను ఎండబోస్తున్న కోటేశ్వరమ్మ

### ఎకరంలో తొలి కోతకే 12 క్వింటాళ్లు

దుక్కిన దున్ని ఘన జీవామృతం వేయడంతో ఆరంభించి, బీజామృతంతో శుద్ధిచేసిన నారును నాటిన దగ్గర్నుంచి ప్రతి దశలోనూ మిరప మొక్కలకు ద్రవ జీవామృతంతో సహా రోగ నిరోధక శక్తికి, దృఢంగా ఉండేందుకు సప్త ధాన్యాంకుర కషాయాన్ని వాడుతూ, వివిధ రకాల కషాయాలతో తెగుళ్లను నిరోధిస్తూ మిర్చిని పండించుకున్నారు.

ఎకరం పొలంలో తొలి కోతకే 12 క్వింటాళ్ల మిరప పండ్ల దిగుబడిని తీశారు. చెట్టు నిండుగా కనిపిస్తున్న మిరపకాయ, మరో 13 క్వింటాళ్లు వస్తాయన్న ధీమానిస్తోంది. అందులో వేసిన రకరకాల అంతర పంటలతో మిర్చి చేతికొచ్చేలోగానే దఫాలుగా ఆదాయాన్నీ కళ్ల చూశారు.

మిర్చి పంట సాగుకు పెట్టుబడులు రైతులందరికీ సమానమే అయినా, ఎరువులు, పురుగుమందులకే రసాయనిక వ్యవసాయం చేసే ఇతర రైతులందరూ ఎకరాకు రూ.75 వేలకు పైగా వ్యయం చేస్తే, ప్రకృతి వ్యవసాయాన్ని నమ్ముకున్న కోటేశ్వరమ్మకు కషాయాలు, జీవామృతాల తయారీకి రూ.4,800 మాత్రమే ఖర్చయింది. అయితే, ఆమె మిర్చిని అందరికన్నా ఎక్కువ ధరకే అమ్మారు. రసాయన రహిత పంట తీశామన్న సంతృప్తినీ పొందానని కోటేశ్వరమ్మ అన్నారు.

### ప్రకృతి వైపు మళ్లించిన పుల్లమజ్జిగ

కొప్పర్రు గ్రామంలో మిరప, పత్తి పంటల సాగు అధికం. కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు దంపతులకున్న ఎకరం మెట్ట పొలానికి, మరో ఎకరం కౌలుకు తీసుకుని అవే పంటలు సాగు చేస్తుండేవారు. కొంత భూమిలో బెండకాయ, దోసకాయ వంటి కూరగాయలను పండించేవారు. కలుపు మందులు, పురుగు మందులు చల్లాల్సి వస్తుండేది. ఒక పంట తీసేసరికి రెండెకరాలకు కలిపి రూ.1.20 లక్షల వరకు వీటికే ఖర్చు చేసినట్టయ్యేది. పెట్టుబడికి, ఖర్చులకు పెద్దగా వ్యత్యాసం వుండేది కాదు. తాతలనాటి వ్యవసాయాన్ని వదులుకోలేక, అస్తుబిస్తు సంపాదనతో కొనసాగుతున్న కోటేశ్వరమ్మకు, ప్రభుత్వ ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తుండే చిరుద్యోగి ఒకరు చెప్పిన చిట్కాతో తరుణోపాయం కనిపించింది. ఆ ఉత్సాహం ఆమెను ప్రకృతి వ్యవసాయం దిశగా నడిపించింది.

నాలుగేళ్ల క్రితం చేలోని మిరపకు పండాకు తెగులు ఆశించింది. ఎప్పట్లాగే నివారణ రసాయనిక పురుగు మందుల కోసం చూస్తున్న కోటేశ్వరమ్మకు, 'పుల్ల మజ్జిగ కొట్టి చూడండి' అన్న సూచన ఆలోచింపజేసింది. పోయేదేముంది.. పాలు ఖర్చే కదా! అనుకున్నారు. 'నాలుగు లీటర్ల పాలు తీసుకొచ్చి, కాచి తోడువేశాం.. 5 రోజులు మురగనిచ్చి, నీటితో కలిపి 15 ట్యాంకులు పిచికారీ చేశాం.. కంట్రోలు అయింది... ప్రకృతి వ్యవసాయంపై అలా గురి కుదిరింది' అని చెప్పారు కోటేశ్వరమ్మ. అదే పురుగుమందులు చల్లితే రూ.1,200 వరకు ఖర్చు. పురుగుమందు చల్లటం వల్ల చేతులు, ఒళ్లు దురదలు, కళ్లు మంటలు ఉండేవన్నారు. ఆ అనుభవంతో ప్రకృతి వ్యవసాయం సత్తా ఏమిటో తెలిసింది. గత మూడేళ్లుగా రసాయన ఎరువులు/పురుగుమందుల జోలికే వెళ్లకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ వస్తున్నారు.

'మేం వేల రూపాయలు ఖర్చుపెట్టి మందులు వాడుతుంటేనే తెగుళ్లు పోవటం లేదు.. ఆకులు, ఎద్దుపేడ, ఆవు మూత్రంతోనే పోతాయా? అంటూ ఊళ్లోని రైతులు ఎకసెక్కంగా మాట్లాడారు.. ఎరువులు వేసిన చేలల్లోలా మొక్కలు గుబురుగా, కంటికి ఇంపుగా ఎదగలేదు. అది చూసి నవ్వారు. ఓపిగ్గా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ వచ్చాం. అధిక వర్షాలకు మొక్కలను కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమించాం. మా కష్టం ఫలించింది. చేను అందంగా కనిపించకున్నా, మొక్క మొక్కకు నాణ్యమైన కాయ విరగ కాసింది. మొదట్లో ఎగతాళి చేసిన వారే ఇప్పుడు ఆశ్చర్యపోతున్నారు. మీ చేలో తాలు కాయ ఒక్కటీ లేదంటూ మెచ్చుకోవటం సంతోషంగా ఉంది'' అన్నారు కోటేశ్వరమ్మ.

### మిర్చిలో బంతి, జొన్న, ఉల్లి, ముల్లంగి...

గత ఆగస్టు 28న ఎకరంలో మిర్చి నారుతో నాట్లు వేశారు. ఎకరాకు 12 వేల మొక్కలు. సరిహద్దు పంటగా మూడు వైపులా జొన్న, మరోవైపు కంది వేశారు. ఎర పంటగా 400 బంతి మొక్కలు పెంచారు. అంతర పంటలుగా ఒక్కోటి నాలుగు వేల మొక్కలు వచ్చేలా ముల్లంగి, ఉల్లి, కొత్తిమీర వేశారు. అనుసరించిన పద్ధతులను వివరిస్తూ, ముందుగా ఎనిమిది కిలోల బెల్లం, ఎనిమిది కిలోల శనగపిండి, నాలుగు గుప్పిళ్ల మట్టి, 40 లీటర్ల మూత్రం, 2500 కిలోల కంపోస్టు ఎరువుతో తయారుచేసిన 400 కిలోల ఘనజీవామృతాన్ని చల్లామని కోటేశ్వరమ్మ చెప్పారు. అయిదు కిలోల పేడ, అయిదు కిలోల ఆవు మూత్రం, 20 లీటర్ల నీరు, 15 గ్రాముల సున్నంతో చేసిన బీజామృతంతో నారు శుద్ధి చేసి నాటాం. అయిదు కిలోల వేపాకు, ఆవు పేడ, ఆవు మూత్రం కలిపి తయారు చేసిన 100 లీటర్ల నీమాస్త్రం పిచికారీ చేశాం.

### కిలో పండు మిర్చి రూ. వంద

పచ్చళ్లకు అడుగుతున్నారని పండుకాయ వచ్చాక కోత మొదలుపెట్టారు. మార్కెట్లో పండు కాయ కిలో రూ.60 వుంటే కోటేశ్వరమ్మ పొలంలో పండు మిర్చి రూ.100 చొప్పున 1.60 క్వింటాళ్లు అమ్మకం చేశారు. మిగిలిన పంట కోసింది కోసినట్టుగా ఎండబెడుతున్నారు. మొత్తం మీద మరో 13 క్వింటాళ్లు వస్తాయని అంచనాతో ఉన్నారు. అంతర పంటల్లో ముందే పీకిన రూ.1000, బంతి పూలతో రూ.4,000, కొంతభాగం విక్రయించిన ఉల్లితో రూ.2,000, ముల్లంగితో మరో రూ.2,000 ఆదాయం సమకూరింది. ప్రకృతి వ్యవసాయం, అంతర పంటలు ఆదాయాన్నిస్తూ ఉంటే.. భూమిని నమ్ముకున్నందుకు నిశ్చింతగా అనిపిస్తోంది.. సమాజానికి ఆరోగ్యకర పంటలు అందిస్తున్నామన్న భావన తమకెంతో సంతృప్తినిస్తున్నదని కోటేశ్వరమ్మ సంతోషంగా చెప్పారు. కాకపోతే ప్రకృతి వ్యవసాయంలో చాకిరీ మాత్రం చేసుకోవాల్సిందేనన్నారు. భర్తతో కలిసి ప్రతి రోజూ ఆరింటికల్లా పొలంలో దిగి, సాయంత్రం ఆరు గంటల వరకూ ఉంటున్నానన్నారు.

– బి.ఎల్.నారాయణ,
సాక్షి, తెనాలి, గుంటూరు జిల్లా

### వళ్లు మంటలు.. కళ్లు మంటలు లేవు..



మూడేళ్ల నుంచి (రసాయనిక) మందుల్లేకుండా పట్టుదలగా పంటలు పండిస్తున్నాం. ఈ విషయం ఇప్పుడిప్పుడే చాలా మందికి తెలిసి వచ్చి చూసెళ్తున్నారు. ఇన్నాళ్లూ ఆ ఏముందిలే అన్న ఊహలో ఉన్నారు. ఇప్పుడు పొలంలోకి వచ్చి ఏమి వేస్తున్నారు, ఎలా పండిస్తున్నారో చూస్తున్నారు. మందుల్లేని పండు మిరపకాయలకు ఈ ఏడు చాలా గిరాకీ వచ్చింది. ఎండు మిరపకాయలకు కూడా ముందే ఆర్డర్లు వస్తున్నాయి. ఎకరం కౌలు రూ. 30–40 వేలు కావటంతో ఇతర రైతులు ప్రకృతి వ్యవసాయం చేయటానికి వెనకాడుతున్నారు. సొంత చేనే కదా అని మేం పట్టుదలతో చేస్తున్నాం. ఎకరానికి ఎరువులు, పురుగుమందులకే రూ. 60–70 వేలు ఖర్చు చేస్తున్నారు. మాకు గత ఏడాది జీవామృతానికి, కషాయాలకు 4 వేలు ఖర్చయింది. మందులు కొట్టే వాళ్లకు, నీళ్లు పోసే వాళ్లకు వళ్లు మంటలు, కళ్లు మంటలు వస్తుంటాయి. ఇప్పుడు ఆ బాధ లేదు. అయితే, కషాయాల తయారీలో వాసనలు, చాకిరీ గురించి కొందరు ఇబ్బంది పడుతున్నారు. మిషన్లు వస్తే సులభంగా ఉంటుంది. భూమి బాగు కోసం, ఆరోగ్యం కోసం ఒకరు అడుగేస్తే కదా.. పది మందీ నడిచేది.. అని మేం డీపీఎం రాజకుమారి ప్రోత్సాహంతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. పంటను అమ్ముకోవటంలో అంత ఇబ్బందేమీ లేదు.

– పరమాత్ముల కోటేశ్వరమ్మ
(63013 51363), మహిళా రైతు,
కొప్పర్రు, గుంటూరు జిల్లా

## ..అంతటితో 'ఆగ'లేదు!

**'పత్తి పండే వరకు అదే పని. సంక్రాంతి వెళ్లిన తర్వాత కూరగాయలు, ఆకుకూరలు పండిస్తా. బండి (మోపెడ్) మీద ఇంటింటికీ తిరిగి అమ్ముకుంటా. ఇంకా ఖాళీ ఉంటే కూలి పనికి వెళ్తా. కాయకష్టంతో వ్యవసాయాన్నే నమ్ముకున్నా. ఏ పంట టైములో ఆ పని చేస్తా.. పిల్లలను పోషించుకోవాలి, పెళ్లిళ్లు చేయాలి కదా.. ఎవరికీ భయపడనవసరం లేదు. మనమేమీ తప్పు చేస్తలేం కదా అని మా ఆయన చెప్పిన మాటలను ప్రతి రోజూ గుర్తుచేసుకుంటున్నా..' ఇదీ ఒంటరి మహిళా రైతు తనుగుల ఆగమ్మ మనసులో మాట. జీవితంలో కష్టాలు కట్టగట్టుకొని ఎదురొచ్చినా చెక్కు చెదరని మనోధైర్యంతో నిలబడి, దృఢచిత్తంతో ముందడుగు వేస్తోంది.**

ఆగమ్మ ములుగు జిల్లా బండారుపల్లిలో పేద వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగింది. చదువుకోలేదు. వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరుకు చెందిన పేద రైతు తనుగుల కుమారస్వామితో 20 ఏళ్ల క్రితం పెళ్లయింది. వాళ్లకు ముగ్గురు ఆడ పిల్లలు.. ఆమని, కావ్య, శ్రావణి. వాళ్లకు చిన్న పెంకుటిల్లుతో పాటు ఎకరం 30 గుంటల (ఎకరం 75 సెంట్లు) భూమి ఉంది. వర్షాధార వ్యవసాయమే. భార్యాభర్తలిద్దరూ కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ సంతోషంగా ఉన్న సమయంలో పెను విషాదం చోటు చేసుకుంది. మోపెడ్‌పై వెళ్తున్న కుమారస్వామిని రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు మింగేసింది. భర్త హఠాన్మరణం ఆగమ్మ ఆశలు చెదిరిపోయాయి. అయినా, పిల్లలను గుండెలకు హత్తుకొని దుఃఖాన్ని దిగమింగుకుంది. తనకు తానే ధైర్యం చెప్పుకొని మొక్కవోని ధైర్యంతో నిలబడింది. వ్యవసాయం కొనసాగిస్తూ కాయకష్టంతో పిల్లలను అన్నీ తానే అయి పోషించుకుంటున్నది. అన్నదమ్ములు లేకపోవడంతో.. వృద్ధులైన తల్లిదండ్రులను అవివాహితగా ఉండిపోయిన సోదరి పోషిస్తున్నది. దీంతో ఆగమ్మ పిల్లలతోపాటు మెట్టినింటిలోనే ఉండిపోయింది.



ఆకుకూరలు అమ్మడానికి మోపెడ్‌పై వెళ్తున్న ఆగమ్మ

సొంత భూమితో పాటు రెండెకరాలను కౌలుకు తీసుకొని మరీ పత్తి, కూరగాయలు, మొక్కజొన్న తదితర పంటలు శ్రద్ధగా సాగు చేస్తూ ఆదర్శంగా నిలిచింది. ఒక్క రోజు కూడా ఖాళీగా ఉండదు. తన పొలంలో ఏ పనీ లేకపోతే కూలికి వెళ్తుంది. రూపాయికి రూపాయి కూడబెట్టి ఎవరిపైనా ఆధారపడకుండా గత ఏడాది పెద్ద కుమార్తె ఆమనికి మంచి సంబంధం చూసి పెళ్లి చేసింది. రెండో బిడ్డ కావ్య ముల్కనూరు మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతోంది. చిన్న కుమార్తె శ్రావణి ఆత్మకూరు జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. తండ్రి లేకపోయినా ఆగమ్మ శ్రద్ధగా వ్యవసాయం చేస్తూ పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటున్నది.



పంటకు పురుగుమందు చల్లుతూ..

### సొంత కష్టం.. సొంత మార్కెటింగ్..

కుటుంబ పెద్దగా, తల్లిగా, రైతుగా ఆగమ్మ విజయపథంలో పయనిస్తోంది అంటే అతిశయోక్తి కాదు. ఈ విజయం వెనుక మొక్కవోని దీక్ష, కఠోర శ్రమ, క్రమశిక్షణతోపాటు చక్కని వ్యవసాయ ప్రణాళిక కూడా ఉంది. తన వంటి చిన్న, సన్నకారు మెట్ట రైతులు చాలా మంది పత్తి, మొక్కజొన్న , పసుపు వంటి పంటలతో సరిపెట్టుకుంటూ ఉంటే.. ఆగమ్మ అంతటితో ఆగలేదు. ఆదాయం కోసం పత్తి, మొక్కజొన్నతో పాటు కుటుంబ పోషణ కోసం, అనుదిన ఆదాయం కోసం కూరగాయలు, ఆకుకూరలను సాగు చేస్తూ ఉన్నంతలో సంతోషంగా, ధీమాగా జీవిస్తోంది.

ఈ ఏడాది కౌలు భూమి రెండెకరాల్లో పత్తిని వర్షాధారంగా సాగు చేసింది. రూ. 70 వేలు ఖర్చు చేసి 12 క్వింటాళ్ల దిగుబడి తీసింది. పత్తిని రూ. లక్షకు అమ్మింది. ఎకరంలో మొక్కజొన్న, 30 గుంటల్లో పసుపు సాగు చేస్తోంది. పత్తి పంట అయిపోయిన తర్వాత 10 గుంటల (25 సెంట్ల) భూమిలో టమాటోలు, పాలకూర, కొత్తిమీర బావి కింద సాగు చేస్తోంది. ఎరువులు వేయటం, పురుగు మందు కొట్టడం, కలుపు తీయటం.. వంటి అన్ని పనులూ తానే చేసుకుంటుంది. టమాటోలు 15 రోజుల్లో కాపు మొదలవుతుంది. నెల రోజుల్లో చేతికొచ్చే పాలకూర, కొత్తిమీరతో నిరంతర ఆదాయం పొందుతోంది. ఆకుకూరలు, కూరగాయలను పండించడం తానే స్వయంగా ఊళ్లు, ఇళ్ల వెంట తిరిగి అమ్ముకుంటుంది. ద్విచక్రవాహనం(మోపెడ్)ను నడుపుకుంటూ వెళ్లి ఏ పూటకు ఆ పూట తాజా ఆకుకూరలు అమ్ముతుంది. కిలో కొత్తిమీర విత్తనాలు (ధనియాలు) రూ. వందకు కొనితెచ్చి విత్తుకొని రూ. రెండు నుంచి మూడు వేలు ఆదాయం పొందుతున్నానని, తాము ఇంట్లో వండుకోవడానికీ కూరగాయల కొరత లేదని సంతోషంగా చెప్పింది ఆగమ్మ.

దురదృష్టవశాత్తూ భర్తలను కోల్పోయిన మహిళా రైతులే ఇంటి పెద్దలై వ్యవసాయాన్ని, కుటుంబాన్నీ సమర్థవంతంగా నడుపుతున్న ఎందరో మహిళల గుండె ధైర్యానికి చక్కని ప్రతీకగా నిలిచిన ఆగమ్మ(90142 65379)కు మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి సాగుబడి' జేజేలు! ఇటువంటి క్రమశిక్షణ గల రైతులకు ప్రకృతి వ్యవసాయం నేర్పితే వారి జీవితాలు మరింత జీవవంతమవుతాయి!!

– పోలు రాజేష్‌కుమార్,
సాక్షి, ఆత్మకూరు, వరంగల్ రూరల్ జిల్లా

## ఎకరంలో 8 రకాల కూరగాయలు





పూలు, కూరగాయలు కోస్తున్న ఈశ్వరమ్మ

- బహుళ పంటల పద్ధతిలో సేంద్రియ కూరగాయల సాగు
- సొంత వాహనంతో పరిసర గ్రామాల్లో నేరుగా ప్రజలకు అమ్మకం
- ఎకరంలో ఏటా రూ. 2 లక్షల నికరాదాయం
- సేంద్రియ మహిళా రైతు ఈశ్వరమ్మ విజయగాథ

సేంద్రియ బహుళ పంటల పద్ధతిలో కూరగాయలను సాగు చేస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇస్కిళ్ల గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ. సేంద్రియ ఎరువులు, జీవామృతంను ఉపయోగిస్తూ ఎకరం విస్తీర్ణంలో ఏడాదికి 3 లక్షల రూపాయల దిగుబడిని సాధిస్తూ ఆదర్శంగా నిలిచింది ఈశ్వరమ్మ.

రామన్నపేట మండలం పల్లివాడ గ్రామానికి చెందిన కల్లెం భీమలింగం – ఈశ్వరమ్మ దంపతులు ఐదు సంవత్సరాల క్రితం అదే మండలంలోని ఇస్కిళ్ల గ్రామానికి వలస వెళ్లారు. డ్రిప్ డీలర్ అయిన భీమలింగం ఇస్కిళ్ల – ఉత్తటూరు గ్రామాల మధ్య 3.29 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమిని సాగు చేసే బాధ్యతను భార్య ఈశ్వరమ్మకు అప్పగించాడు. నిరక్షరాస్యురాలైన ఈశ్వరమ్మ భర్త ప్రోత్సాహంతో నాబార్డు వారు పంటల సాగుపై ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులకు హాజరై వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నది. పంటల సాగుపై అవగాహన తరగతులు బోధించే రమేష్ ప్రోత్సాహంతో బహుళ పంటల విధానంలో కూరగాయలను సాగు చేయడం ప్రారంభించింది.

తమ వ్యవసాయ భూమిలో ఎకరంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. ఐదు ట్రాక్టర్ల పశువుల ఎరువును పొలంలో చల్లి మెత్తగా దున్నించి ట్రాక్టర్‌తోనే 4 అడుగుల ఎడంలో బోదెలు(మట్టి కట్టలు) పోయించారు. ఐదు వరుసలకు ఒక పంట చొప్పున మిర్చి, వంకాయ, కాకర, టమాట, బీర, సొర, దోస, బంతి వంటి ఎనిమిది రకాల కూరగాయలను సాగు చేశారు. హైదరాబాద్‌లోని నర్సరీల నుంచి తెచ్చిన నారు, విత్తనాలు విత్తారు.

భూమిలో తేమ తొందరగా ఆవిరైపోకుండా, కూరగాయలు నేలను తాకి చెడిపోకుండా, మొక్కలకు వైరస్ సోకకుండా ఉండేందుకు బోదెలపై మల్చింగ్ షీట్‌ను పరిచారు. డ్రిప్‌ను అమర్చి మొక్కలకు నీరందించే ఏర్పాటు చేశారు. తీగ జాతి మొక్కలు ఏపుగా పెరగడంతోపాటు, కాయల బరువుకు మొక్కలు నేలను తాకకుండా ఉండేందుకు గాను వెదురు బొంగులను నాటి బైండింగ్ వైరుతో పాటు, సుతిలి తాడును అల్లారు.

ప్రతీ ఐదు బోదెలకు ఒక వరుసతో పాటు, పొలం చుట్టూ బంతి పూల మొక్కలు పెట్టారు. కూరగాయల మొక్కలకు వచ్చే చీడపీడలను ముందుగానే బంతి మొక్కల ద్వారా గుర్తించి కషాయాలను పిచికారీ చేస్తూ సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు.

కూరగాయల రకాన్ని బట్టి నాటిన నలభై ఐదు రోజుల నుంచి తొమ్మిది నెలల వరకు పంట దిగుబడి వస్తుంది. ఏదేని ఒక రకం పంట కాలం ముగియగానే.. చదును చేసి బోదెలు పోసి పంట మార్పిడి చేసి.. మరో రకం కూరగాయ మొక్కలు నాటుతున్నారు.

పండించిన కూరగాయలను తమ టాటాఏస్ వాహనంలో తీసుకువెళ్లి పరిసర గ్రామాల్లో దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు అమ్ముతుండటం విశేషం. ఈ విధంగా సంవత్సరానికి రూ. 3 లక్షల ఆదాయం పొందుతున్నారు. పెట్టుబడి పోను రూ. రెండు లక్షల వరకు నికరాదాయాన్ని ఆర్జిస్తున్నట్లు ఈశ్వరమ్మ తెలిపారు.

సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలను సాగు చేస్తూ నేరుగా ప్రజలకు విక్రయిస్తున్న ఈశ్వరమ్మ గత ఏడాది జిల్లా స్థాయిలో ఉత్తమ మహిళా రైతుగా ఎంపికై కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును పొందింది. గత అక్టోబర్‌లో నాబార్డు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో సేంద్రియ పంటల ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈశ్వరమ్మ ఒక్కరికే స్టాల్‌ను ఏర్పాటు చేసే అవకాశం వచ్చింది. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఈశ్వరమ్మ సేంద్రియ కూరగాయల స్టాల్‌ను సందర్శించి, ఆమె కృషిని అభినందించారు.

(ఈశ్వరమ్మ భర్త భీమలింగంను 96668 46907 నంబరులో సంప్రదించవచ్చు)

– కనుతాల శశిధర్‌రెడ్డి,
సాక్షి, రామన్నపేట, యాదాద్రి భువనగిరి జిల్లా

epaper.sakshi.com

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఇలా చేస్తే..

# 10/10 ఖాయం..!



పదో తరగతి పరీక్షల ప్రత్యేకం

**పరీక్షల నెల మార్చి వచ్చేసింది...! తెలంగాణలో మార్చి 19 నుంచి, ఏపీలో మార్చి 31 నుంచి పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. దీంతో ప్రస్తుతం విద్యార్థులంతా ప్రిపరేషన్‌ల్లో మునిగితేలుతున్నారు. 10/10 గ్రేడ్ లక్ష్యంగా ప్రిపరేషన్‌ను పరుగులెత్తిస్తున్నారు. పరీక్షల ముంగిట నిలిచిన విద్యార్థులు అందుబాటులో ఉన్న ఈ విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ఎలా.. ఆయా సబ్జెక్టుల్లో ఏయే అంశాలపై దృష్టిపెట్టాలి.. పరీక్షలో ప్రజంటేషన్ ఎలా ఉండాలి.. టాప్ గ్రేడ్ సాధించేందుకు ఏం చేయాలో తెలుసుకుందాం...**

## ఆంధ్రప్రదేశ్

ఏపీలో సంస్కరణలు చేపట్టిన తర్వాత తొలి సారిగా జరుగుతున్న పదోతరగతి పరీక్షలివి..! కొత్త విధానంలో... గతంలో ఉన్న అంతర్గత మార్కుల(20 మార్కులు) విధానం తొలగించి.. పూర్తిగా వందకు వంద మార్కులు సాధించే అవకాశం విద్యార్థి చేతికే ఇచ్చారు. గతంతో పోలిస్తే టాప్ గ్రేడ్ సాధించడం ఇప్పుడు పూర్తిగా విద్యార్థి హార్డ్‌వర్క్, ప్రిపరేషన్‌పై ఆధారపడి ఉంటుందని చెప్పొచ్చు. హిందీ మినహా ప్రతి పేపర్ 50 మార్కులకు ఉంటుంది. కాబట్టి విద్యార్థులు ముందు పరీక్ష స్వరూపంపై అవగాహనకు రావాలి. దీంతోపాటు చక్కటి ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే పదికి పది పాయింట్లు సాధించవచ్చు. ప్రతి పేపర్‌లోనూ గరిష్ట మార్కులు సాధించడం ద్వారా మంచి గ్రేడ్‌ను సొంతం చేసుకోవచ్చు. అర మార్కు, ఒక మార్కు ప్రశ్నల విషయంలో విద్యార్థులు ఎక్కువ శ్రద్ధ పెట్టాలి.

## తెలంగాణ

ప్రతి సబ్జెక్టులో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్ 1 నలభై మార్కులకు, పేపర్ 2 నలభై మార్కులకు ఉంటుంది. అంతర్గత మూల్యాంకనకు 20 మార్కులు ఉంటాయి. వీటిని నోట్ బుక్ రైటింగ్, ప్రాజెక్టు వర్క్, ల్యాబ్ రికార్డు మెయింటెనెన్స్ తదితరాల ఆధారంగా ప్రకటిస్తారు.

## గణితం

### పేపర్ 1

✦ మొదటి ఏడు చాప్టర్లు పేపర్ 1లో ఉంటాయి. వాస్తవ సంఖ్యలు పాఠ్యాంశంలో యూక్లిడ్ భాగహార న్యాయం, ప్రధాన కారణాంకాల లబ్ధం, కరణీయ సంఖ్యలు, సంవర్గమానాలు, ప్రధాన సంఖ్యలపై ప్రశ్నలు వస్తాయి. సమితులు పాఠ్యాంశంలో తక్కువ భావనలు ఉంటాయి. దీంతో ఈ చాప్టర్‌లో ఎక్కువ స్కోరు చేసేందుకు అవకాశం ఉందని చెప్పొచ్చు. సమితి రూపం, ఉపసమితి, శూన్యసమితి, సమితుల ఛేదనం, సమ్మేళనం, బేధం తదితరాలపై దృష్టిపెట్టాలి.

✦ బహుపదులు పాఠ్యాంశంలో బహుపదులు కనుగొనడం,బహుపది రేఖాచిత్రాలు, బహుపది శూన్యాలు, గుణకాల మధ్య సంబంధం, బహుపదుల భాగహారం తదితరాలపై దృష్టిపెట్టాలి. రెండు చలరాశులలో రేఖీయ సమీకరణాల జత పాఠ్యాంశంలో ఏదైనా సమస్యను ఇచ్చి రేఖీయ సమీకరణాల జతగా రాయమని అడుగుతారు. ఈ చాప్టర్‌లో మంచి మార్కులు సాధించాలంటే.. గుణకాలపై పట్టు సాధించడం తప్పనిసరి. వర్గసమీకరణాల పాఠ్యాంశంలో వర్గసమీకరణాల మూలాలు కనుగొనడంపై దృష్టిపెట్టాలి. శ్రేడులు చాప్టర్‌లో ఇచ్చిన శ్రేడిని గుర్తించడం.. అంక, గుణ శ్రేడులలో ఎన్వ పదం కనుగొనడంపై దృష్టిపెట్టాలి. నిరూపక జ్యామితి పాఠ్యాంశంలో ఎక్కువ సూత్రాలు ఉంటాయి. కాబట్టి సూత్రాలను కంఠస్థం చేయాలి. ఇందులో రెండు బిందువుల మధ్య దూరం కనుగొనడంపై తప్పనిసరిగా ప్రశ్న వస్తుంది.

### పేపర్ 2

✦ సరూప త్రిభుజాలు చాప్టర్‌లో నిర్వచనాలు, ఉదాహరణలు, సరూప త్రిభుజ ధర్మాలపై దృష్టిపెట్టాలి. స్పర్శరేఖలు-ఛేదన రేఖలు పాఠ్యాంశంలో వృత్తానికి బాహ్య బిందువు నుంచి గీసిన స్పర్శ రేఖ.. అల్ప, అధిక వృత్త ఖండముల వైశాల్యాలు, సిద్ధాంతాలు కీలకం. త్రికోణమితి చాప్టర్‌లో త్రికోణమితి నిష్పత్తులు, వాటి మధ్య సంబంధం, త్రికోణమితీయ సర్వసమీకరణ నిరూపణలు- అనువర్తనాలు, పూరక కోణాల త్రికోణమితీయ నిష్పత్తులు తదితరాలు కీలకంగా నిలుస్తాయి. త్రికోణమితీయ అనువర్తనాల పాఠ్యాంశం నుంచి ఊర్ధ్వ, నిమ్న కోణాలు, ఎత్తులు-దూరాలకు సంబంధించిన సమస్యలు తదితరాలపై ప్రశ్నలు వస్తాయి.

✦ సంభావ్యత పాఠ్యాంశంలో సంభావ్యత భావన, నిర్వచనం, సులభమైన సమస్యలు-నిత్యజీవిత సంఘటనలతో అన్వయం, పూరక ఘటనలు తదితరాలు కీలకంగా ఉంటాయి. పాచికలకు సంబంధించిన ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. క్షేత్రమితి పాఠ్యాంశంలో ఉపరితల వైశాల్యాలు, ఘనపరిమాణాలు, ఘనాకృతలకు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. సాంఖ్యాకశాస్త్రంలో మధ్యగతము, బాహుళకము, సగటు, ఓజివ్ వక్రాలను ఉపయోగించి విలువలు కనుగొనడంపై దృష్టిపెట్టాలి.

### కీలక సూచనలు

✦ అన్ని అధ్యాయాల్లోని సమస్యలు, ఉదాహరణలు, పటాలు, నిర్మాణాలను ప్రణాళికాబద్ధంగా అధ్యయనం చేయాలి. అధ్యాయంలో ఉండే 'ఇవి చేయండి', 'ప్రయత్నించండి' వంటి వాటిని సాధన చేస్తే.. నూతన సమస్యలను సైతం సులభంగా సాధించగలుగుతారు.

✦ ఏపీలో గతంలో ఉన్న బిట్ల స్థానంలో ఒక పదం/వాక్యరూపంలో రాయగలిగే 12 ప్రశ్నలు ఇస్తారు. ఈ ప్రశ్నలను పాఠ్యపుస్తకంలో ఉన్న భావనల ఆధారంగా రూపొందిస్తారు. అతి లఘు సమాధాన ప్రశ్నలు, లఘు సమాధాన ప్రశ్నలు, వ్యాసరూప సమాధాన ప్రశ్నలు గతంలో ఇచ్చిన విధంగానే విద్యాప్రమాణాల ఆధారంగా ఇస్తారు.

## జనరల్ సైన్స్

విషయావగాహన,ప్రశ్నించడం, పరికల్పనలు చేయడం,ప్రయోగ నైపుణ్యాలు-క్షేత్ర పరిశీలనలు, సమాచార నైపుణ్యాలు-ప్రాజెక్టు పనులు, బొమ్మల ద్వారా భావ ప్రసారం, నిజ జీవిత వినియోగం-అనువర్తనాలు... విద్యాప్రమాణాల ఆధారంగా ప్రిపరేషన్ సాగిస్తే.. జనరల్ సైన్స్‌లోని రెండు పేపర్లలో అత్యధిక మార్కులు పొందవచ్చు.

### ఫిజికల్ సైన్స్(పేపర్ 1)

వక్రతలాల వద్ద కాంతి వక్రీభవనం, ఆమ్లాలు, క్షారాలు, లవణాలు, పరమాణు నిర్మాణం, విద్యుత్ ప్రవాహం, కార్బన్ దాని సమ్మేళనాలు, ఉష్ణం, సమతల తలాల వద్ద కాంతి వక్రీభవనం, మానవుడి కన్ను-రంగుల ప్రపంచం, మూలకాల వర్గీకరణ-ఆవర్తన పట్టిక, రసాయన బంధం, విద్యుత్ అయస్కాంతత్వం, లోహసంగ్రహణ శాస్త్రం పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి.

### జీవశాస్త్రం(పేపర్ 2)

డార్విన్ సిద్ధాంతం, కిరణజన్య సంయోగక్రియ-కాంతి, నిష్కాంతి దశలు, మూత్రం ఏర్పడే విధానం, పిండిపై లాలాజలం చర్య(ప్రయోగం), రక్తస్కంధనం, ఆకు అంతర నిర్మాణాల పటం-భాగాలు తదితరాలపై ఎక్కువ దృష్టిపెట్టాలి.

✦ రెండు గ్రూపుల మధ్య తేడాను గుర్తించడం, వర్గీకరణ/ఫ్లోచార్టు/ గ్రాఫ్‌లు/ కాన్సెప్ట్ మ్యాపింగ్, ఉదాహరణలు ఇవ్వడం, వ్యాక్యాన్ని సరిచేసి తిరిగి రాయడం, సందర్భాన్ని గుర్తించడం, ఇచ్చిన పేరాలో ఖాళీని గుర్తించడం, చిత్రం గురించి ప్రశ్నించడం, విశదీకరించి రాయడం, శాస్త్రవేత్తలు -పరిశోధనలు, జతపరచడంపై ప్రశ్నలు వస్తాయి.

## ఇంగ్లిష్

రెండు పేపర్లలో రీడింగ్ కాంప్రహెన్షన్స్ ప్రశ్నలకు సమాధానాలు రాసేటప్పుడు విద్యార్థులు తొలుత సదరు ప్యాసేజ్‌లను జాగ్రత్తగా చదవాలి. ఒకటి, రెండు ప్రశ్నలకు సమాధానాలు ప్యాసేజ్‌లోనే ఉంటాయి. మిగిలిన ప్రశ్నలకు సొంతంగా సమాధానం (ఓపెన్ ఎండెడ్‌గా) రాయాల్సి ఉంటుంది.

✦ రెండు పేపర్లలో సెక్షన్ బి గ్రామర్‌పై ఉంటుంది. ఇందులో టెన్సెస్, రిపోర్టెడ్ స్పీచెస్, యాక్టివ్ వాయిస్, పాసివ్ వాయిస్, వెర్బ్ ఫామ్స్, వర్డ్ ఆర్డర్, కోఆర్డినేషన్ రూల్, కాంకర్డ్ రూల్, క్వశ్చన్ ట్యాగ్... ఇలా దేనిపైనైనా ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించగలిగినప్పుడే.. ఈ సెక్షన్‌లో మంచి మార్కులు సాధించగలరు.

✦ సెక్షన్ సిలో మేజర్ డిస్‌కోర్స్‌కు చాయిస్ ఉంటుంది. ప్రతి డిస్‌కోర్స్‌కు కనీసం ఒక మోడల్‌ను ప్రాక్టీస్ చేయాలి. ఇంటర్వ్యూ, స్పీచ్, బయోగ్రాఫికల్ స్కెచ్ తదితరాలకు ఒక్కో మోడల్ చొప్పున ప్రాక్టీస్ చేయాలి. పేపర్1లో మైనర్ డిస్‌కోర్స్‌కు సంబంధించి మెసేజ్, నోటీస్, డైరీలలో ఒకటి... పేపర్ 2లో పోస్టర్, ఇన్విటేషన్, ప్రొఫైల్స్ నుంచి ఒకటి వస్తుంది. మైనర్ డిస్‌కోర్స్‌ను సింగిల్ పేజీలో రాస్తే సరిపోతుంది. మేజర్ డిస్‌కోర్స్‌ను ఐదు పేజీల్లో రాయాలి. వీటిని రాసేటప్పుడు ఆయా డిస్‌కోర్స్ ఫీచర్స్‌ను ఫాలో అవ్వాలి.

### ఏపీ విద్యార్థులు ఇలా

✦ ఏపీలో ప్రశ్నపత్రంలో కొత్తగా చేర్చిన ప్రశ్నలకు గతంలో మాదిరి చాయిస్ లేదు. సమాధానాలను జవాబుపత్రంలో రాసేటప్పుడు, ప్రశ్నపత్రంలో ఇచ్చిన వరుస క్రమంలో.. ఒకే చోట రాయాలి. లేదంటే మార్కులు కోల్పోయే ఆస్కారం ఉంటుంది. అలాగే గతంలో కాంప్రహెన్షన్ విభాగంలో అన్ని ప్రశ్నలూ **'wh'** ప్రశ్నలు ఉండేవి. కానీ నూతన పద్ధతిలో 15 ప్రశ్నలకు 11 ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఇందులో కనీసం ఆరు ఉన్నత శ్రేణి ఆలోచనా విధానాన్ని ప్రోత్సహించేలా ఉంటాయి. మిగిలిన ప్రశ్నలు సమాచారాన్నీ, అవగాహననూ పరీక్షించేవిధంగా ఉంటాయి.

✦ఏపీలో గ్రామర్‌లో ఎక్కువ మార్పులు జరిగాయి. ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ సెంటెన్సెస్, డైరెక్ట్ స్పీచ్, ఇండైరెక్ట్ స్పీచ్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. టెన్సెస్‌కు వెయిటేజీ పెరిగి..ఎడిటింగ్‌కు వెయిటేజీ తగ్గింది. క్లోజ్ టెస్టును తొలగించి..ఆర్టికల్స్‌పై ప్రశ్నలు చేర్చారు. టెన్సెస్‌లో కంటిన్యూయస్, పర్‌ఫెక్ట్ టెన్సెస్‌పై దృష్టిపెట్టాలి. ఇండైరెక్ట్ స్పీచ్‌లో సంభాషణలపై దృష్టిపెట్టాలి. గ్రామర్‌కి సంబంధించి పాఠ్యపుస్తకంలోని ఉదాహరణలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

## సాంఘిక శాస్త్రం

ఏపీలో బిట్ పేపర్ లేదు. కాబట్టి సబ్జెక్టులోని ప్రతి అంశాన్ని కచ్చితత్వంతో గుర్తుపెట్టుకున్నప్పుడే మంచి మార్కులు సొంతమవుతాయి. తెలంగాణ విద్యార్థులకు బిట్ పేపర్ ఉంటుంది. కాబట్టి పాఠ్యాంశాల చివర ఇచ్చిన, గత ప్రశ్నపత్రాల్లో అడిగిన బిట్‌లను ప్రిపేరవడం లాభిస్తుంది.

పేపర్-1లో సుస్థిరాభివృద్ధి, అవ్యవస్థీకృత రంగం-స్థితిగతులు, భూతాపం, భూగర్భజలాలు, లింగవివక్ష, ప్రపంచీకరణ ఫలితాలు, భారతదేశ పటం.. పేపర్-2లో యుద్ధాలు-పరిణామాలు, వియత్నాం యుద్ధం, దేశ విభజన నాటి పరిస్థితులు, అత్యవసర పరిస్థితి, సంకీర్ణ ప్రభుత్వాలు, భోపాల్ విషాదం, సమాచారహక్కు, ప్రపంచపటంపై ప్రశ్నలు అడుగుతారు. వీటితోపాటు వివిధ సాంఘిక, పర్యావరణ సమస్యల పరిష్కారానికి సూచనలు రాయమని అడగవచ్చు. అదేవిధంగా వివిధ సంస్థలు, వ్యక్తుల కృషిని తెలపమని అడిగే అవకాశం ఉంది. వీటితోపాటు లింగ వివక్ష, హిమాచల్ ప్రదేశ్‌లో పాఠశాల విద్యా విప్లవం, వలసదారుల ఇబ్బందులు, ఆహార భద్రతలో పీడీఎస్ పాత్ర, ప్రపంచశాంతి, వియత్నాం విజయం, గాంధీజీ తదితరాలపై దృష్టిపెట్టాలి.

## ఇవెంతో కీలకం

ప్రస్తుతం విద్యార్థులు అత్యంత కీలక దశకు చేరుకున్నారు. ఈ సమయంలో సబ్జెక్టు అంశాలతో పాటు మరికొన్నింటిపైనా శ్రద్ధపెట్టాలి.



### కూల్‌గా

పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులు ఒత్తిడికి లోనవుతుంటారు. కొంత మంది పరీక్ష హాల్లో ప్రశ్నపత్రం ఇవ్వగానే హడావిడిగా సమాధానాలు రాయడం మొదలుపెడతారు. ఇది సరికాదు. బాగా ప్రిపేర్ అవడం ఎంత ముఖ్యమో.. పరీక్ష రోజు సమాధానాలు రాయడం అంతే ప్రధానం. కాబట్టి పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు వస్తాయి..రాయగలనా.. లేదా..? అనే సందేహాలను పక్కన పెట్టేయండి. అలాగే ప్రశ్నపత్రాన్ని పూర్తిగా చదివిన తర్వాత ప్రశాంత చిత్తంతో సమాధానాలు రాసేందుకు ఉపక్రమించాలి. చాయిస్‌లను ఎంచుకొనే క్రమంలో ఆచితూచి వ్యవహరించాలి.

### వేగం.. కచ్చితత్వం

కొంతమంది విద్యార్థులు సమాధానాలను నెమ్మదిగా రాస్తుంటారు. తీరా సమయం దగ్గరపడుతుందనగా కంగారు పడుతూ...వేగంగా రాస్తూ వెళ్తారు. ఇలా చేయడం వల్ల చేతిరాత దెబ్బతిని మార్కులు కోల్పోయే ఆస్కారం ఉంది. కాబట్టి వేగం-చేతి రాతలను సమన్వయం చేసుకుంటూ పరీక్ష రాయాలి. పరీక్షకు ముందే దీనిపై దృష్టిపెట్టాలి. అలాగే ఒక ప్రశ్నకు సమాధానం రాయడం పూర్తయిన తర్వాత రెండు లైన్‌లు గ్యాప్ ఇచ్చి.. మరో ప్రశ్నకు సమాధానం రాయాలి. ప్రయోజనాలు, అనువర్తనాలను రాసేటప్పుడు పాయింట్ల విధానంలో రాయాలి.

### సమయ 'విభజన'

సమయాన్ని ఎంత తెలివిగా వినియోగించుకున్నామనే దానిపై విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి. కాబట్టి అందుబాటులో ఉన్న సమయాన్ని సబ్జెక్టులు, టాపిక్‌ల ప్రాధాన్యతల ఆధారంగా విభజించుకోవాలి. పరీక్షలు దగ్గరపడే కొద్దీ చాలామంది గంటల తరబడి పుస్తకాల ముందు కూర్చుంటారు. అలాకాకుండా ప్రతిరెండు గంటలకు 10-15 నిమిషాలు చొప్పున విరామం ఇవ్వడం వల్ల మెదడుపై ఒత్తిడి తగ్గుతుంది.

### రివిజన్

విద్యార్థులు పరీక్షల సమయంలో తమకు రాని అంశాలపై ఎక్కువగా దృష్టిపెట్టి వచ్చిన వాటిని పట్టించుకోరు. ఎంత బాగా వచ్చిన అంశాలైనా కొన్నిరోజులకు మర్చిపోయే ప్రమాదం ఉంది. పూర్తిగా కాకపోయినా కొంతమేరయినా మర్చిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి విద్యార్థులు వచ్చిన అంశాలను కూడా తరచూ రివిజన్ చేయాలి.

### ఆరోగ్యంపై శ్రద్ధ

ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయగలరు. ఆత్మవిశ్వాసంతోనే పరీక్షలో విజయం సిద్ధిస్తుంది. కాబట్టి విద్యార్థులు ప్రిపరేషన్‌లో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదు. జంక్‌ఫుడ్‌కి దూరంగా ఉండాలి. ప్రొటీన్లతో కూడిన ఆహారం తీసుకోవాలి. అలాగే తగిన నిద్రతోపాటు రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ముఖ్యంగా ప్రశాంతంగా ఉండటం అలవాటు చేసుకోవాలి.

---

## కెరీర్ కౌన్సెలింగ్

» దేశంలో ఎంబీఏకు బెస్ట్ ఇన్‌స్టిట్యూట్‌లు ఏవో తెలపండి? – రామారావు

✦ నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్-2019 ప్రకారం మేనేజ్‌మెంట్ విద్యలో ఐఐఎం బెంగళూరు తొలి స్థానంలో నిలిచింది. టీచింగ్, లెర్నింగ్ అండ్ రిసోర్సెస్(టీఎల్ఆర్)లో 92.85(100), రీసెర్చ్, ప్రొఫెషనల్ ప్రాక్టీస్ అండ్ కొలాబరేటివ్ పెర్ఫార్మెన్స్(ఆర్‌పీసీ)లో 55.03(100), గ్రాడ్యుయేషన్ ఔట్‌కమ్(ఓసీ)లో 98.35(100), ఔట్‌రీచ్ అండ్ ఇంక్లూజివిటీ(ఓఐ)లో 73.09(100), పెర్‌సెప్షన్‌లో100(100) స్కోరుతో ఐఐఎం-బి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. తర్వాతి స్థానాల్లో ఐఐఎం అహ్మదాబాద్, ఐఐఎం కలకత్తా, ఐఐఎం లక్నో, ఐఐఎం ఇండోర్‌లు నిలిచాయి. ఐఐఎంలో ఎంబీఏ, పీజీడీఎం, పీజీపీఎం కోర్సులను అభ్యసించాలంటే.. జాతీయ స్థాయిలో నిర్వహించే క్యాట్‌లో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. ఐఐఎం, ఐఐటీలను పక్కనెబెట్టి చూస్తే జంషెడ్‌పూర్‌లోని గ్జేవియర్ లేబర్ రిలేషన్స్ ఇన్‌స్టిట్యూట్, గుర్‌గావ్‌లోని మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎండీఐ), ముంబైలోని ఎస్‌పీ జైన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్, చెన్నైలోని గ్రేట్ లేక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, పుణెలోని సింబయాసిస్, ముంబైలోని నర్సిమోంజీ తదితర ఇన్‌స్టిట్యూట్‌లు టాప్‌లో నిలిచాయి.







# వ్యవసాయ కోర్సులకు కేరాఫ్.. ఐకార్

**వ్యవసాయ విద్యలో ఉన్నతస్థాయి ప్రమాణాలను పాటించే సంస్థగా గుర్తింపు పొందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) పరిధిలోని అగ్రికల్చర్ యూనివర్సిటీలు అందించే కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మక ఎంట్రెన్స్ టెస్టులు నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను చూస్తోంది. ఇందులో భాగంగానే ఐసీఏఆర్‌లో యూజీ (15 శాతం సీట్లు), పీజీ (25 శాతం సీట్లు), పీహెచ్‌డీ (25 శాతం సీట్లు) ల్లో ప్రవేశాలకు ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఏఐఈఈఏ)-2020 నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. ఐకార్ అందించే కోర్సుల వివరాలు, ప్రత్యేకత, అర్హతలు, పరీక్ష విధానం, కెరీర్ అవకాశాలపై సమగ్ర సమాచారం...**




» యూజీ, పీజీ, పీహెచ్‌డీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్
» దేశవ్యాప్తంగా ఉన్న అగ్రికల్చర్ యూనివర్సిటీల్లో అడ్మిషన్స్
» దరఖాస్తులకు చివరి తేదీ: 31.03.2020

## ఐకార్

**వ్య**వసాయ విద్య, పరిశోధన రంగాన్ని సమన్వయం చేసే ఉద్దేశంతో న్యూఢిల్లీ కేంద్రంగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రీసెర్చ్ (ఐసీఏఆర్-ఐకార్) స్థాపించారు. ఇది కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ పరిధిలో పనిచేసే స్వతంత్ర సంస్థ. దేశంలోని వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే దీని పరిధిలో దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ యూనివర్సిటీల్లో ఏటా వేల సంఖ్యలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తూ.. వ్యవసాయ రంగానికి అవసరమైన నిపుణులను తయారు చేస్తోంది. ఐకార్ పరిధిలో 74 అగ్రికల్చర్ యూనివర్సిటీలు, 63 స్టేట్ అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్, ఫిషరీస్ యూనివర్సిటీలు, 3 సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీలు తదితర ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి.

### ఆన్‌లైన్ పరీక్ష

ఐకార్-ఏఐఈఈఏ పరీక్ష నిర్వహణ బాధ్యతలను గత ఏడాది(2019)నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) చూస్తోంది. ప్రస్తుతం 2020 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల ప్రవేశాల కోసం పరీక్ష ప్రకటనను ఎన్‌టీఏ విడుదల చేసింది. ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో నిర్వహించే ఐసీఏఆర్-ఏఐఈఈఏ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో జరుగుతుంది. ఆబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్షల్లో ప్రతీ సరైన సమాధానికి నాలుగు మార్కుల చొప్పున కేటాయిస్తారు. అలాగే ప్రతీ తప్పు సమాధానానికి ఒక మార్కు చొప్పున కోత విధిస్తారు.

## యూజీ కోర్సులు

అండర్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో బీఎస్సీ(హానర్స్) అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, కమ్యూనిటీ సైన్స్, సెరికల్చర్ కోర్సులను అందిస్తోంది. అలాగే బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ డెయిరీ టెక్నాలజీ, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీటెక్ బయోటెక్నాలజీ, బీఎఫ్ఎస్‌సీ కోర్సుల్లోనూ ప్రవేశాలు కల్పిస్తోంది. **సీట్ల సంఖ్య:** 2,784.

### అర్హతలు

ఇంటర్‌లో ఎంపీసీ/బైపీసీ/ఎంబైపీసీ లేదా ఇంటర్ అగ్రికల్చర్ కోర్సుల్లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 40శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది. **వయసు:** ఆగస్టు 30, 2020 నాటికి 16 ఏళ్ల వయసు నిండిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

### పరీక్ష విధానం

యూజీ పరీక్ష 150 ప్రశ్నలకు-600 మార్కులకు ఎంట్రెన్స్ ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు లభిస్తే.. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు కోత పడుతుంది. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీలో ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది.

### ఎంపిక ప్రక్రియ

పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులను తుది ఎంపిక చేసి ఐసీఏఆర్‌లో ప్రవేశాలకు అవకాశం కలిస్తారు.

✦ **పరీక్ష ఫీజు:** జనరల్ కేటగిరి అభ్యర్థులకు రూ.750, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.375 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి.

## పీజీ కోర్సులు

పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాంకు సంబంధించి ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్ సైన్స్, ఫిజికల్ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్, స్టాటిస్టికల్ సైన్స్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ/ఆగ్రోఫారెస్ట్రీ అండ్ సివి కల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, వాటర్ సైన్స్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, ఆగ్రోనమీ, ఫిషరీస్ సైన్స్, డెయిరీ సైన్స్, డెయిరీ టెక్నాలజీ, హోంసైన్స్, సోషల్ సైన్స్ తదితర విభాగాల్లో కోర్సులున్నాయి. **సీట్ల సంఖ్య:** 3,075.

### అర్హతలు

ఐకార్ పీజీ కోర్సు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు 10+2+5 (బీవీఎస్సీ, అండ్ ఏహెచ్) లేదా 10+2+4 లేదా 10+6 సంవత్సరాల(బీఎస్సీ ఆగ్రికల్చరల్)డిగ్రీ ప్రోగ్రాం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 50 శాతం మార్కులు సాధించి ఉంటే సరిపోతుంది. **వయసు:** అభ్యర్థులు ఆగస్టు 31,2020 నాటికి 19 ఏళ్లు నిండిన వారై ఉండాలి.

### పరీక్ష విధానం

ఐసీఏఆర్ పీజీ పరీక్ష మొత్తం 120 ప్రశ్నలకుగాను 480 మార్కులకు ఉంటుంది. మొత్తం 120 నిమిషాల పరీక్ష సమయాన్ని కేటాయిస్తారు.

### ఎంపిక ప్రక్రియ

✦ ఐసీఏఆర్ పీజీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులను కటాఫ్, రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకొని తుది ఎంపిక చేసి, కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

✦ **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. ✦ **పరీక్ష ఫీజు:** జనరల్ కేటగిరి అభ్యర్థులకు రూ.1100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.550 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి.

## పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్

డాక్టోరల్ కోర్సులకు సంబంధించి క్రాప్‌సైన్స్, హార్టికల్చర్, వెటర్నరీ అండ్ యానిమల్ సైన్స్-1, డెయిరీసైన్స్, డెయిరీ టెక్నాలజీ అండ్ ఫుడ్ టెక్నాలజీ, హోంసైన్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రికల్చరల్ ఎకానమి అండ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫిషరీ సైన్స్ విభాగాల్లో ప్రవేశాలు కల్పిస్తారు. **సీట్ల సంఖ్య:** 905.

### అర్హతలు

ఈ కోర్సులకు సంబంధించిన ప్రవేశ పరీక్షను రాయాలనుకునే అభ్యర్థులు సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** అభ్యర్థులు జూలై 01, 2020 నాటికి 20 ఏళ్లు పూర్తయి ఉండాలి.

### పరీక్ష విధానం

ఐసీఏఆర్-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ) పరీక్ష మొత్తం 120 ప్రశ్నలకుగాను 480 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 120 నిమిషాలు.

### ఎంపిక ప్రక్రియ

పరీక్షల్లో చూపిన ప్రతిభ.. కటాఫ్‌ను పరిగణనలోకి తీసుకొని తుది ఎంపిక చేసి ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

✦ **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. ✦ **పరీక్ష ఫీజు:** జనరల్ కేటగిరి అభ్యర్థులకు రూ. 1800, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.900 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి.

### కెరీర్ అవకాశాలు

వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో నైపుణ్యం ఉన్న మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోంది. వ్యవసాయ విద్యను అభ్యసించిన వారికి కెరీర్ పరంగా కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో వ్యవసాయ పంటల అమ్మకాలు, మార్కెటింగ్, రవాణా, సేవలు, నిల్వ, గిడ్డంగులు మొదలైన వాటిల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. ప్రభుత్వ,ప్రయివేట్ రంగాల్లో విస్తృత అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్లాంటేషన్స్, ఫర్టిలైజర్ కంపెనీలు, అగ్రికల్చరల్ మెషినరీలు, అగ్రికల్చరల్ ప్రొడక్ట్, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి. వీటితోపాటు ఎఫ్‌సీఐ, నాబార్డ్, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్లుగా కొలువులు దక్కించుకోవచ్చు. దేశ వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లో రీసెర్చ్ సైంటిస్టులుగా కూడా పనిచేసే వీలుంది.

### ముఖ్యమైన సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 31 మార్చి 2020
» **అడ్మిట్ కార్డ్:** 25 ఏప్రిల్ 2020
» **పరీక్ష తేదీ:** 01 జూన్ 2020
» **ఫలితాలు:** 15 జూన్ 2020
» **వెబ్‌సైట్:** https://icar.nta.nic.in

సాక్షి
# స్పోర్ట్స్
మంగళవారం
10-3-2020



> “వచ్చే ఏడాది నుంచైనా పూర్తి స్థాయిలో మహిళల ఐపీఎల్‌ను మొదలు పెడితే బాగుంటుందని బీసీసీఐకి నా సూచన. అలా చేస్తే కొత్త ప్రతిభ బయటపడుతుంది. మన జట్టులో ప్రతిభావంతులకు లోటు లేదని ఈ ప్రపంచ కప్ చూపించింది. ఎనిమిది జట్లు లేక పోయినా సరే ఐపీఎల్ నిర్వహించడం ఎంతో అవసరం. దీని వల్ల మహిళా క్రికెటర్లకు ఎక్కువగా ఆడే అవకాశం దక్కుతుంది. కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తే రాబోయే రోజుల్లో మన జట్టు మరిన్ని టోర్నీలు గెలవడం ఖాయం. ఇప్పటి వరకు కూడా బోర్డు వారికి ఎంతో మేలు చేస్తూనే ఉంది. ప్రపంచకప్‌కు చాలా రోజులు ముందుగానే మన అమ్మాయిలను ఆస్ట్రేలియా పంపడం కూడా మంచి ఫలితాలు రావడానికి ఒక కారణం.
>
> –సునీల్ గావస్కర్, భారత మాజీ కెప్టెన్

## షఫాలీ చేజారిన టాప్ ర్యాంక్

### మూడో స్థానంలో భారత ఓపెనర్

**దుబాయ్:** టి20 వరల్డ్ కప్ ఫైనల్లో వైఫల్యం భారత మహిళల క్రికెట్ జట్టు ఓపెనర్ షఫాలీ వర్మ ర్యాంకింగ్‌పై ప్రభావం చూపింది. సోమవారం విడుదలైన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాజా ర్యాంకింగ్స్‌లో 16 ఏళ్ల షఫాలీ వర్మ టాప్ ర్యాంక్ నుంచి పడిపోయి 744 రేటింగ్ పాయింట్లతో మూడో ర్యాంక్‌కు చేరుకుంది. టి20 ప్రపంచ కప్‌లో లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక షఫాలీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. అయితే ఫైనల్లో షఫాలీ కేవలం రెండు పరుగులు చేసి అవుటవ్వడంతో ఆమె ర్యాంక్ పడిపోయింది. ఫైనల్లో అజేయంగా 78 పరుగులు చేసిన ఆస్ట్రేలియా క్రికెటర్ బెథ్ మూనీ రెండు స్థానాలు పురోగతి సాధించి 762 ర్యాంకింగ్ పాయింట్లతో కొత్త ప్రపంచ నంబర్‌వన్‌గా అవతరించింది. న్యూజిలాండ్ ప్లేయర్ సుజీ బేట్స్ 750 రేటింగ్ పాయింట్లతో రెండో ర్యాంక్‌లో కొనసాగుతోంది. భారత్‌కే చెందిన స్మృతి మంధాన ఏడో ర్యాంక్‌లో, జెమీమా రోడ్రిగ్స్ తొమ్మిదో ర్యాంక్‌లో ఉన్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్లు దీప్తి శర్మ, రాధా యాదవ్, పూనమ్ యాదవ్ వరుసగా ఆరు, ఏడు, ఎనిమిది ర్యాంక్‌ల్లో కొనసాగుతున్నారు.





ఐదోసారి టి20 ప్రపంచకప్ చాంపియన్‌గా నిలిచిన తర్వాత మెల్‌బోర్న్‌లోని ఫెడరేషన్ స్క్వేర్‌లో సోమవారం అభిమానులతో కలిసి సంబరాల్లో పాల్గొన్న ఆస్ట్రేలియా మహిళల జట్టు

# మరింత బలంగా...
# మరింత పైపైకి...

సాక్షి క్రీడా విభాగం

దాదాపు పదకొండేళ్ల క్రితం 2009లో ఆస్ట్రేలియా మహిళల వన్డే వరల్డ్ కప్‌కు ఆతిథ్యమిచ్చింది. సిడ్నీలో జరిగిన ఈ టోర్నీ ఫైనల్‌కు హాజరైన ప్రేక్షకుల సంఖ్య 12,717 మాత్రమే! ఇప్పుడు ఆస్ట్రేలియా వేదికగా టి20 ప్రపంచ కప్ జరిగింది. ఆదివారం జరిగిన ఫైనల్‌కు ఏకంగా 86,174 మంది హాజరయ్యారు. స్టేడియంలో కూర్చున్న వారి సంఖ్యనే ఇంత ఉంటే టీవీల్లో, ఇంటర్నెట్‌లో చూసిన వారి గణాంకాలు అయితే ఎన్నో రికార్డులు బద్దలు కొట్టాయి. ప్రపంచకప్‌కు వచ్చిన ఈ భారీ స్పందన చూసి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఉబ్బితబ్బిబ్బవుతోంది. ఈ విజయంలో ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు (సీఏ) నిర్వహణ కూడా కీలక పాత్ర పోషించగా... మహిళల క్రికెట్‌కు మరింత జోష్ తెచ్చేందుకు ఇదే సరైన సమయంగా ఐసీసీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో భారత్‌తో పాటు అన్ని దేశాల్లో మహిళా క్రికెట్ మరింతగా దూసుకుపోవడం ఖాయం.

**మహిళల టి20 ప్రపంచ కప్ విజయ గాథ**
**టోర్నీ సూపర్ సక్సెస్**
**ముున్ముందు మరింత జోరు**

మహిళల క్రికెట్‌లో గతంలో ఎన్నడూ లేని కొత్త ఉత్సాహభరిత వాతావరణం ఇప్పుడు వచ్చేసిందంటే ఆశ్చర్యం కాదు. మెల్‌బోర్న్‌లో ఫైనల్ ముగిసిన తర్వాత తాము కూడా రాబోయే టోర్నీని ఇదే స్థాయిలో నిర్వహిస్తామని దక్షిణాఫ్రికా కెప్టెన్ నికెర్క్ ప్రకటించింది. టి20లే కాదు మహిళల వన్డేలకు కూడా ఆదరణ పెరుగుతోందని 2017 వరల్డ్ కప్ చూపించింది. ఈ టోర్నీ తర్వాత వాయు వేగంతో మహిళల క్రికెట్ అందరినీ ఆకర్షించింది. దానికి కొనసాగింపుగానే మెల్‌బోర్న్‌లో ఈ భారీ జనసందోహం! సరిగ్గా ఏడాది తర్వాత జరగనున్న వన్డే వరల్డ్ కప్ కోసం ఆతిథ్య జట్టు న్యూజిలాండ్ ఇప్పటికే చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. అయితే వరల్డ్ కప్‌లకే కాకుండా రెండు మెగా టోర్నీల మధ్యలో కూడా అమ్మాయిల ఆటపై ఆసక్తి సన్నగిల్లకుండా ఐసీసీ ప్రణాళికలు రూపొందిస్తుండటం విశేషం. గతంలో ఎన్నడూ లేని కార్యక్రమాలతో మహిళల క్రికెట్‌కు ఊపు తెచ్చే మార్పులు ఇకపై కూడా కొనసాగడం ఖాయం. వచ్చే ఏడాదిలోగా ప్రపంచవ్యాప్తంగా కనీసం 10 లక్షల మంది అమ్మాయిలు క్రికెట్‌లోకి వచ్చేలా చేయాలనేదే తమ లక్ష్యమని ఐసీసీ ప్రకటించింది.

**సుదీర్ఘ ప్రణాళికతో...**

ఏడేళ్ల క్రితం మెల్‌బోర్న్ మైదానంలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య ‘మహిళల యాషెస్’ వన్డే సిరీస్ జరిగితే ఆటగాళ్లు, బంధుమిత్రులు తప్ప ఎవరూ లేరు. కానీ వరల్డ్ కప్ ఆతిథ్య జట్టుగా భారం భుజాన వేసుకున్న తర్వాత ఆసీస్ బోర్డు (సీఏ) చురుగ్గా పని చేసింది. ‘ఫిల్ ద ఎంసీజీ’ ట్యాగ్‌లైన్‌తో ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం మొదలు పెట్టి అందరి దృష్టి టోర్నీపై పడేలా చేసింది. ఆతిథ్య జట్టు ప్రదర్శనే ఎప్పుడైనా ఒక టోర్నీ సక్సెస్‌కు కొలబద్దలా పని చేస్తుందనేది వాస్తవం. అది 2011 (భారత్), 2015 (ఆస్ట్రేలియా), 2019 (ఇంగ్లండ్) పురుషుల వన్డే వరల్డ్ కప్‌లు దీనిని చూపించాయి. సొంత జట్టు సాధారణంగా ఉంటే అభిమానుల్లో ఆసక్తిని తీసుకురావడం కష్టం. అందుకే నిర్వాహక దేశంగానే కాకుండా సొంత మహిళల టీమ్‌పై కూడా సీఏ భారీగా ఖర్చు చేసింది. క్రికెట్‌ను కెరీర్‌గా తీసుకునే మహిళలకు ధైర్యం ఇచ్చేందుకు 2016లో ప్రత్యేకంగా 42 లక్షల 30 వేల డాలర్లు (రూ. 31 కోట్ల 40 లక్షలు) కేటాయించిన క్రికెట్ ఆస్ట్రేలియా తర్వాతి నాలుగేళ్లు సమర్థంగా తమ ప్రణాళికను అమలు చేసింది.

**అన్ని రకాల ప్రోత్సాహం...**

మహిళా క్రికెటర్లు ఏ రకమైన అభద్రతాభావానికి గురి కాకూడదని, అప్పుడే కెరీర్‌ను ఎంచుకుంటారనేది అన్ని క్రికెట్ బోర్డులు, ఐసీసీ గుర్తించాయి. ఒక్కసారిగా అమ్మాయిల ఆటకు పెరిగిన క్రేజ్‌కు అది కూడా ఒక కారణం. ఈ వరల్డ్ కప్ టోర్నీ విజేతకు ఐసీసీ 10 లక్షల డాలర్లు (రూ. 7 కోట్ల 41 లక్షలు) ప్రైజ్ మనీ గా ప్రకటించింది. 2018 వన్డే వరల్డ్‌కప్‌తో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. ఆస్ట్రేలియా బోర్డు మరో అడుగు ముందుకేసి తమ జట్టు విజేతగా నిలిస్తే 8,85,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 4 కోట్ల 36 లక్షలు) బహుమతిగా ఇస్తామని చెప్పింది. ఇది దాదాపు పురుషుల జట్టుతో సమానం. న్యూజిలాండ్ అందరికంటే ముందుగా తమ ప్లేయర్లకు ‘ప్రసూతి సెలవులు’ మంజూరు చేయగా, ఆసీస్ కూడా దానిని అనుసరిస్తోంది. ఇప్పుడు ఇంగ్లండ్ బోర్డు కూడా 20 మిలియన్ పౌండ్లు (రూ. 194 కోట్లు) భవిష్యత్తు కోసం పెట్టేందుకు సిద్ధమైంది. అన్నింటికి మించి పురుషుల టోర్నీ జరిగే సమయంలో కాకుండా మహిళలకు విడిగా ప్రపంచకప్ జరగడం పెద్ద మేలు చేసింది. 2018లోనూ ఇలాగే జరిగినా... వెస్టిండీస్ బోర్డు గొప్పగా పని చేయలేదు. కానీ ఈ సారి భారీ చెల్లింపులు, భారీ కవరేజ్, మైదానంలో అత్యుత్తమ సౌకర్యాలు మాత్రమే కాదు... వసతి, ప్రయాణం, అలవెన్స్‌ల విషయంలో వివక్ష లేకుండా సమానత్వాన్ని పాటించింది.

**భారత్ కూడా...**

మన మహిళల క్రికెట్‌కు సంబంధించి 2017 వన్డే వరల్డ్‌కప్‌లో ఫైనల్ చేరడం మేలిమలుపు. ఆ మెగా టోర్నీ తర్వాతే అందరిలోనూ ఆసక్తి పెరిగింది. జట్టులోని దాదాపు ప్రతీ అమ్మాయి పేరు మారుమోగిపోగా, సగటు అభిమానులు వాళ్లందరినీ గుర్తు పట్టేందుకు కారణమైంది. కాంట్రాక్ట్‌లతో ప్లేయర్లలో బోర్డు ధైర్యం నింపగా... అగ్రశ్రేణి క్రీడాకారిణులు మైదానం బయట కూడా బ్రాండింగ్‌లతో సొమ్ము చేసుకుంటున్నారు. బయట బిగ్‌బాష్ లీగ్, కియా సూపర్ లీగ్ అవకాశాలు కూడా వచ్చాయి. ఆ వెంటనే 2018లో రెండు జట్లతో ఐపీఎల్ సమయంలో ఎగ్జిబిషన్ మ్యాచ్ జరగ్గా, గత ఏడాది అది మూడు జట్లకు పెరిగింది. ఇప్పుడు మరో జట్టును అదనంగా చేర్చి నాలుగు టీమ్‌లతో ఐపీఎల్ తరహా టోర్నీ నిర్వహించబోతున్నారు. తాజా టోర్నీలోనూ ఫైనల్లోనే ఓడినా... మన మహిళలు తమ ప్రదర్శనతో ఇప్పటికే అందరి మనసులు చూరగొన్నారు. ఇకపై షఫాలీ కావచ్చు లేదా పూనమ్ కావచ్చు... వీరంతా ఎక్కడ ఆడినా ఆయా మ్యాచ్‌లపై ఆసక్తి కచ్చితంగా పెరుగుతుంది. బీసీసీఐ కూడా దీనికి అనుగుణంగా దేశవాళీ టోర్నీ ల్లో ప్రణాళికలు రూపొందించవచ్చు. ఆస్ట్రేలియా అద్భుత నిర్వహణ తమ జట్టుతో టైటిల్ అందించడంతో పాటు ప్రపంచ మహిళా క్రికెట్‌కు కూడా ఎంతో మేలు చేసిందనేది వాస్తవం. ఇదే పునాదిపై రాబోయే రోజుల్లో మహిళా క్రికెట్ మరింతగా ఎదగడం ఖాయం.

## ఐసీసీ వరల్డ్‌కప్ జట్టులో పూనమ్

**దుబాయ్:** టి20 ప్రపంచకప్ ప్రదర్శన ఆధారంగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించిన జట్టులో భారత లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్‌కు చోటు దక్కింది. టీమ్ ఫైనల్‌కు చేరినా... పూనమ్ మినహా మరెవరికీ ఈ టీమ్‌లో చోటు లేదు. టీనేజ్ సంచలనం షఫాలీ వర్మ 12వ ప్లేయర్‌గా ఎంపికైంది. మాజీ క్రికెటర్లు ఇయాన్ బిషప్, లిసా స్థాలేకర్, అంజుమ్ చోప్రా తదితరులతో కూడిన ప్యానెల్ ఈ టీమ్‌ను ఎంపిక చేసింది.



చాంపియన్‌గా నిలిచిన ఆస్ట్రేలియా నుంచి ఐదుగురు, ఇంగ్లండ్ నుంచి నలుగురు ఐసీసీ జట్టులో ఉన్నారు.

**ఐసీసీ ఉమెన్స్ వరల్డ్ కప్ టి20 ప్లేయింగ్ ఎలెవన్:** మెగ్ లానింగ్ (కెప్టెన్), అలీసా హీలీ, బెత్ మూనీ, జెస్ జొనాసెన్, మెగాన్ షూట్ (ఆస్ట్రేలియా), నాట్ సివెర్, హెథర్ నైట్, సోఫీ ఎకెల్‌స్టోన్, అన్యా ష్రబ్‌సోల్ (ఇంగ్లండ్), లారా వోల్‌వార్ట్ (దక్షిణాఫ్రికా), పూనమ్ యాదవ్ (భారత్); 12వ ప్లేయర్ షఫాలీ వర్మ (భారత్).

## హారిక ఏడో గేమ్ ‘డ్రా’

**లుసానే (స్విట్జర్లాండ్):** ‘ఫిడే’ మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక నాలుగో ‘డ్రా’ నమోదు చేసింది. జన్‌సాయా అబ్దుమాలిక్ (కజకిస్తాన్)తో సోమవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను హారిక 30 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకుంది. ఏడో రౌండ్ తర్వాత హారిక నాలుగు పాయింట్లతో జన్‌సాయాతో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉంది.

## ఇండియన్ వెల్స్ టెన్నిస్ టోర్నీ రద్దు

**కాలిఫోర్నియా:** టెన్నిస్‌లో నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌ల తర్వాత ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌గా భావించే ఇండియన్ వెల్స్ ఓపెన్ ఏటీపీ మాస్టర్స్ సిరీస్, డబ్ల్యూటీఏ ప్రీమియర్ టోర్నమెంట్‌ను నిర్వాహకులు రద్దు చేశారు. ప్రాణాంతక వైరస్ కోవిడ్–19 విజృంభిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. టోర్నమెంట్ వేదిక కాలిఫోర్నియాలో తాజాగా కోవిడ్–19 కేసు బయట పడటంతో ఈనెల 12 నుంచి 22 వరకు జరగాల్సిన ఈ టోర్నీని రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ‘టోర్నీని నిర్వహించలేకపోతున్నందుకు తీవ్ర నిరాశతో ఉన్నాం. అయితే ఈ టోర్నీతో ముడిపడి ఉన్న అందరి ఆరోగ్యం కూడా ముఖ్యం. అందుకే టోర్నీని రద్దు చేయక తప్పడంలేదు’ అని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాదీ ఈ టోర్నీని వీక్షించేందుకు దాదాపు నాలుగు లక్షల మంది అభిమానులు వస్తారు. ఎవరైనా ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకొని ఉంటే వారికి టికెట్ల డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని నిర్వాహకులు తెలిపారు.



## డాక్టర్ సమేతంగా...

### భారత్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు

**న్యూఢిల్లీ:** భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌లో తలపడేందుకు దక్షిణాఫ్రికా జట్టు సోమవారం నగరానికి చేరుకుంది. ఇక్కడి నుంచి సఫారీ ఆటగాళ్లు నేరుగా తొలి మ్యాచ్ వేదిక అయిన ధర్మశాలకు వెళ్లిపోయారు. సఫారీ జట్టు వెంట క్రికెట్ సౌతాఫ్రికా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షుయబ్ మన్‌జ్రా కూడా ఉన్నారు. కోవిడ్–19 వైరస్ సమస్యల నేపథ్యంలో టీమ్ తమ వెంట వైద్యుడిని తెచ్చుకుంది. ముందు జాగ్రత్తగా ఈ సిరీస్ సమయంలో తమ ఆటగాళ్లెవరూ కరచాలనాలు కూడా చేయరని కోచ్ మార్క్ బౌచర్ వెల్లడించాడు. భారత క్రికెటర్లు మాత్రం మంగళవారం ధర్మశాల వెళతారు. అంతకుముందు బోర్డు కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లందరూ బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో ఫిట్‌నెస్, వైద్య పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. ఈ సిరీస్‌లో భాగంగా ఈ నెల 12న (ధర్మశాల), 15న (లక్నో), 18న (కోల్‌కతా) మూడు వన్డేలు జరుగుతాయి.

## భారత బాక్సర్ల ‘తీన్‌మార్’

### టోక్యో ఒలింపిక్స్‌కు అమిత్, మేరీకోమ్, సిమ్రన్‌జిత్ అర్హత

**అమ్మాన్ (జోర్డాన్):** అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ... భారత అగ్రశ్రేణి బాక్సర్లు అమిత్ పంఘాల్ (52 కేజీలు), మేరీకోమ్ (51 కేజీలు), సిమ్రన్‌జిత్ కౌర్ (60 కేజీలు) టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. ఆసియా క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో ఈ ముగ్గురూ సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. సోమవారం జరిగిన పురుషుల విభాగం క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ అమిత్ పంఘాల్ 4–1తో కార్లో పాలమ్ (ఫిలిప్పీన్స్)ను ఓడించగా... మహిళల విభాగం క్వార్టర్ ఫైనల్స్‌లో ఆరుసార్లు ప్రపంచ చాంపియన్, 37 ఏళ్ల మణిపూర్ మెరిక మేరీకోమ్ 5–0తో ఇరిష్ మాగ్నో (ఫిలిప్పీన్స్)పై... పంజాబ్‌కు చెందిన 24 ఏళ్ల సిమ్రన్‌జిత్ 5–0తో రెండో సీడ్ నమున్ మోన్‌ఖోర్ (మంగోలియా)పై ఘనవిజయం సాధించారు. సిమ్రన్‌జిత్ తొలిసారి ఒలింపిక్ బెర్త్ దక్కించుకోగా... మేరీకోమ్ రెండోసారి ఒలింపిక్స్ బరిలో నిలువనుంది. 51 కేజీల విభాగంలో మేరీకోమ్ బెర్త్ దక్కించుకోవడంతో ఇదే వెయిట్ కేటగిరీలో ఉన్న తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ ఒలింపిక్ ఆశలు ఆవిరయ్యాయి. ఒకవేళ మేరీకోమ్ ఓడిపోయుంటే మే నెలలో పారిస్‌లో జరిగే వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ రూపంలో నిఖత్‌కు అవకాశం మిగిలి ఉండేది. సోమవారమే జరిగిన మరో రెండు క్వార్టర్ ఫైనల్ బౌట్స్‌లో భారత బాక్సర్లకు నిరాశ ఎదురైంది. పురుషుల విభాగం 63 కేజీల కేటగిరీలో మనీశ్ కౌశిక్ 2–3తో చిన్‌జోరింగ్ బాటర్‌సుక్ (మంగోలియా) చేతిలో... మహిళల విభాగం 57 కేజీల కేటగిరీలో సాక్షి 0–5తో ఇమ్ ఏజి (కొరియా) చేతిలో ఓడిపోయారు. ఓవరాల్‌గా ఈ టోర్నీ ద్వారా భారత్ నుంచి ఏకంగా ఎనిమిది మంది బాక్సర్లు టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు.



మేరీకోమ్



అమిత్



సిమ్రన్‌జిత్

## సౌరాష్ట్ర 206/5

- రాణించిన అవీ బారోట్, విశ్వరాజ్
- ఆకాశ్‌దీప్‌కు మూడు వికెట్లు
- బెంగాల్‌తో రంజీ ట్రోఫీ ఫైనల్



ఆకాశ్‌దీప్

**రాజ్‌కోట్:** తొలిసారి రంజీ ట్రోఫీ చాంపియన్‌గా అవతరించాలని ఆశిస్తున్న సౌరాష్ట్ర జట్టు శుభారంభాన్ని అనుకూలంగా మల్చుకోలేకపోయింది. మాజీ చాంపియన్ బెంగాల్‌తో సోమవారం మొదలైన రంజీ ట్రోఫీ ఫైనల్లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 80.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 206 పరుగులు సాధించింది. భారత స్టార్ క్రికెటర్, సౌరాష్ట్ర బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారా జ్వరంతో బాధపడుతుండటంతో... ఆరో నంబర్ స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. 24 బంతులు ఆడి ఐదు పరుగులు చేశాక అస్వస్థతతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. రెండో రోజు పుజారా బ్యాటింగ్‌కు వస్తాడని సౌరాష్ట్ర కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ తెలిపాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సౌరాష్ట్రకు ఓపెనర్లు హార్విక్ దేశాయ్ (111 బంతుల్లో 38; 5 ఫోర్లు), అవీ బారోట్ (142 బంతుల్లో 54; 6 ఫోర్లు) శుభారంభం ఇచ్చారు. బెంగాల్ బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ క్రీజులో నిలదొక్కుకున్న ఈ జంట తొలి వికెట్‌కు 82 పరుగులు జోడించింది. హార్విక్‌ను అవుట్ చేసి స్పిన్నర్ షాబాజ్ అహ్మద్ ఈ భాగస్వామ్యాన్ని విడగొట్టాడు. అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న అవీ బారోట్‌ను ఆకాశ్‌దీప్ పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత విశ్వరాజ్‌సింగ్ జడేజా (92 బంతుల్లో 54; 7 ఫోర్లు), అర్పిత్ (94 బంతుల్లో 29 బ్యాటింగ్; 3 ఫోర్లు) మూడో వికెట్‌కు 50 పరుగులు జత చేయడంతో సౌరాష్ట్ర స్కోరు 150 దాటింది. చివరి సెషన్‌లో బెంగాల్ పేస్ బౌలర్ ఆకాశ్‌దీప్ విజృంభించడంతో సౌరాష్ట్ర మూడు వికెట్లను కోల్పోయింది.

**సంక్షిప్త స్కోర్లు**

**సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్:** 206/5 (80.5 ఓవర్లలో) (హార్విక్ దేశాయ్ 38, అవీ బారోట్ 54, విశ్వరాజ్ సింగ్ జడేజా 54, అర్పిత్ 29 బ్యాటింగ్, షెల్డన్ జాక్సన్ 14, చేతన్ సకారియా 4, ఆకాశ్‌దీప్ 3/41); బెంగాల్‌తో మ్యాచ్.

సాక్షి **బిజినెస్**
మంగళవారం
10-3-2020
WWW.SAKSHIBUSINESS.COM

**స్టాక్ మార్కెట్లు**

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 1942 ▼ | 538 ▼ |
| 35,635 | 10,451 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం...
www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30కి)

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,075 | ▼ 500 |
| డోజోన్స్ | 24,071 | ▼ 1794 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 5,966 | ▼ 497 |
| డాక్స్ | 10,625 | ▼ 917 |
| షాంఘై | 2,943 | ▼ 91 |
| నికాయ్ | 19,699 | ▼ 1,050 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 73.22 | 74.87 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 95.15 | 98.45 |
| € | యూరో | ఎస్‌బీఐ | 82.89 | 85.88 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 70.87 | 73.55 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.26 | 49.41 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 52.73 | 54.53 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.77 | 20.58 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 19.11 | 21.11 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.53 | 11.30 |

# కోవిడ్, క్రూడ్ కల్లోలం

**మాంద్యం భయాలతో ప్రపంచ మార్కెట్లు అతలాకుతలం**

- 2,000 పాయింట్ల పైగా సెన్సెక్స్ పతనం
- 28 ఏళ్ల కనిష్టస్థాయికి క్రూడ్ ఆయిల్
- పెరుగుతున్న కోవిడ్–19 వైరస్ విలయం
- ముడి చమురు ధరల పోరు షురూ
- యస్ బ్యాంక్ సంక్షోభంతో దెబ్బతిన్న సెంటిమెంట్
- ముగింపులో, ఇంట్రాడేలో అత్యధికంగా నష్టపోయిన సూచీలు
- 36,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్
- 1,942 పాయింట్ల నష్టంతో 35,635 వద్ద క్లోజింగ్
- ఇంట్రాడేలో 2,467 పాయింట్లు పతనం
- 10,500 పాయింట్ల కిందకు నిఫ్టీ
- 538 పాయింట్ల నష్టంతో 10,451 వద్ద ముగింపు

*ఆయిల్ వార్, కరోనా ఫియర్ స్టాక్ మార్కెట్లను కుదిపేయడంతో ఆసియా నుంచి అమెరికా దాకా సోమవారం బెంచ్ మార్క్ ఇండెక్స్‌లు భారీ నష్టాలతో ముగిశాయి. అదుపులోకి రాని కరోనా వైరస్ పెట్టుబడిదారులను బెంబేలెత్తించడంతో అమ్మకాలు వెల్లువెత్తాయి. మరోవైపు ముడి చమురు ధర అంతర్జాతీయ మార్కెట్లో 30 శాతం కుప్పకూలింది. మరో ఆర్థిక మాంద్యంలో చిక్కుకుంటామేమోననే భయం ప్రపంచ దేశాలను వణికిస్తోంది. దశాబ్దకాలంలో అతిపెద్ద సింగిల్–డే పతనంతో మార్చి 9వతేదీ ,2020 భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో మరో బ్లాక్ మండేగా నిలిచిపోయింది.7లక్షల కోట్ల రూపాయల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది.*



క్రూడ్(ముడి చమురు) ధరల పతనానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ సోమవారం 1,942 పాయింట్లు కుప్పకూలింది. చరిత్రలో ఇదే అత్యంత భారీ పతనం. కోవిడ్–19 (కరోనా) వైరస్ కల్లోలానికి ముడి చమురు ధరల పోరు జత కావడంతో స్టాక్ మార్కెట్ కనీవినీ ఎరుగని రీతిలో క్షీణించింది. సెన్సెక్స్ 36,000 పాయింట్లు, నిఫ్టీ 10,500 పాయింట్ల దిగువకు పతనమయ్యాయి. ప్రస్తుతం మందగమనంలో ఉన్న అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ... కోవిడ్–19 వైరస్, ముడి చమురు ధరల పోరు కారణంగా మాంద్యంలోకి జారిపోతుందనే భయాలతో ప్రపంచ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. ఇక దేశీయంగా యస్‌బ్యాంక్ సంక్షోభం, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతుండటం, డాలర్‌తో రూపాయి మారకం విలువ 30 పైసలు తగ్గడం వంటి అంశాలు కూడా ప్రతికూల ప్రభావం చూపాయి. ఇంట్రాడేలో 2,467 పాయింట్ల మేర పతనమైన సెన్సెక్స్ చివరకు 1942 పాయింట్లు క్షీణించి 35,635 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 695 పాయింట్లు పతనమైన నిఫ్టీ చివరకు 538 పాయింట్ల నష్టంతో 10,451 పాయింట్ల వద్దకు చేరింది. శాతాలపరంగా చూస్తే, సెన్సెక్స్ 5.1 శాతం, నిఫ్టీ 4.9 శాతం చొప్పున నష్టపోయాయి. శాతం పరంగా చూస్తే, ఈ రెండు సూచీలు గత ఐదేళ్లలో ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే తొలిసారి. సెన్సెక్స్, నిఫ్టీ, బ్యాంక్ నిఫ్టీలు ఒక్క రోజులోనే ఇన్నేసి పాయింట్లు నష్టపోవడం (ఇంట్రాడే, ముగింపులో కూడా)ఇదే మొదటిసారి.

**ఆరంభంలోనే భారీ నష్టాలు....**

ఆసియా మార్కెట్ల బలహీనతతో మన మార్కెట్ భారీ నష్టాలతోనే ఆరంభమైంది. సెన్సెక్స్ 627 పాయింట్లు, నిఫ్టీ 247 పాయింట్ల నష్టాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. సమయం గడిచే కొద్దీ నష్టాలు పెరిగాయే కానీ తరగలేదు. అన్ని రంగాల షేర్లు పతనమయ్యాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుంచి స్టాక్ మార్కెట్ నష్టాలు కొనసాగుతున్నాయి. అప్పటి నుంచి చూస్తే, సెన్సెక్స్ 5,088 పాయింట్లు (12.4 శాతం), నిఫ్టీ 1,511 పాయింట్లు(12.6 శాతం) చొప్పున క్షీణించాయి. ప్రపంచవ్యాప్తంగా మాంద్యం భయాలు ముప్పిరిగొన్నందున సెంటిమెంట్ బలహీనంగా ఉందని, మన మార్కెట్‌పై ఒత్తిడి కొనసాగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిఫ్టీ మద్దతు స్థాయిలు 10,295–10,138 పాయింట్లని, ఒక వేళ పుల్ బ్యాక్ ర్యాలీ చోటు చేసుకుంటే నిరోధ స్థాయిలు 10,637–10,744 పాయింట్లని విశ్లేషకులు పేర్కొన్నారు.

**పతనానికి పంచ కారణాలు...**

**• చమురు ధరల పతనం...**

చమురు ఉత్పత్తి చేసే దేశాల్లో ఉత్పత్తి కోతకు సంబంధించి చర్చలు విఫలమయ్యాయి. ఒపెక్ దేశాలు ప్రతిపాదించిన ఉత్పత్తి కోతను రష్యా వ్యతిరేకించడం.. నచ్చని సౌదీ అరేబియా ప్రతి చర్యలు ప్రకటించింది. తాము ఉత్పత్తి చేసే క్రూడ్ ధరలను తగ్గించడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పతనమయ్యాయి. ఇది అంతర్జాతీయంగా వృద్ధి మరింతగా దెబ్బతీస్తుందన్న భయాలు మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయని నిపుణులంటున్నారు.

**• కోవిడ్–19 విలయం**

భారత్‌లో కోవిడ్–19 (వైరస్) బాధితుల సంఖ్య 43కు పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఈ వైరస్ బాధితుల సంఖ్య లక్షకు, మరణాల సంఖ్య 3,600కు పెరిగాయి. ఇటలీలో ఒక్క రోజులోనే 130కు పైగా మరణాలు చోటు చేసుకున్నాయి. కోటిన్నరకు పైగా ప్రజలను ఈ దేశం క్వారంటైన్‌లో ఉంచింది. మరిన్ని దేశాలకు ఈ వైరస్ విస్తరిస్తుండటంతో మరిన్ని కష్టాలు ముందు ముందు ఉంటాయనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ వైరస్ మరింత విస్తరిస్తే, అమెరికా, జపాన్, ఫ్రాన్స్, ఇటలీ, దక్షిణ కొరియా తదితర అభివృద్ధి చెందిన దేశాలు మాంద్యంలోకి జారిపోతాయని మూడీస్ సంస్థ హెచ్చరించడం ఆందోళన రేకెత్తించింది.

**• ప్రపంచ మార్కెట్ల పతనం**

కోవిడ్–19 వైరస్ విస్తరిస్తుండటం, ముడి చమురు ధరల హఠాత్ పతనం కారణంగా ఆర్థిక మాంద్యం భయాలతో ప్రపంచ మార్కెట్లు భారీగా క్షీణించాయి. ఈక్విటీ మార్కెట్ల నుంచి సురక్షిత సాధనాలైన పుత్తడి, అమెరికా డాలర్, బాండ్లలోకి పెట్టుబడులు తరలిపోతున్నాయి. ఫలితంగా సోమవారం ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. షాంఘై, హాంగ్‌కాంగ్, దక్షిణ కొరియా, జపాన్ సూచీలు 5 శాతం మేర క్షీణించాయి. ఆరంభంలోనే 6% మేర నష్టపోయిన యూరప్ మార్కెట్లు అదే స్థాయిలో ముగిశాయి.

**• విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు...**

కరోనా కల్లోలానికి సెంటిమెంట్ దెబ్బతినడంతో విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలు కొనసాగిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ నికర కొనుగోలుదారులుగా ఉన్న విదేశీ ఇన్వెస్టర్లు విక్రయాలు కొనసాగుతున్నాయి. సోమవారాన్ని కూడా కలుపుకుంటే వరుసగా 11వ రోజూ విదేశీ ఇన్వెస్టర్లు నికర అమ్మకందారులుగానే నిలిచారు. ఈ 11 ట్రేడింగ్ సెషన్లలో రూ.25,000 కోట్ల మేర అమ్మకాలు జరిపారు.

**• యస్ బ్యాంక్ సంక్షోభం....** యస్ బ్యాంక్ సంక్షోభం .. భారత బ్యాంకింగ్ రంగం స్థిరత్వంపై ఆందోళనను, సంశయాలను పెంచింది. పలు ఆర్థిక సంస్థలు యస్ బ్యాంక్ బాండ్లలో ఇన్వెస్ట్ చేశాయి. ఈ బాండ్ల రేటింగ్‌ను పలు రేటింగ్ సంస్థలు డౌన్‌గ్రేడ్ చేశాయి. మరోవైపు బాసెల్ టూ, టైర్–1 బాండ్ల వడ్డీ చెల్లింపుల్లో యస్ బ్యాంక్ విఫలమైంది. మొత్తం మీద యస్ బ్యాంక్ ప్రభావం తీవ్రంగానే ఉండగలదన్న భయాలు నెలకొన్నాయి.

**నేడు మార్కెట్లకు సెలవు**

నేడు హోలీ పండుగ సందర్భంగా సెలవు. సోమవారం అమెరికా స్టాక్ మార్కెట్ భారీ నష్టాల్లో ట్రేడయ్యింది. ఆరంభంలోనే ఏడు శాతం మేర పతనమై లోయర్ సర్క్యూట్‌ను తాకింది. దీంతో ట్రేడింగ్‌ను నిలిపేశారు. 15 నిమిషాల అనంతరం ఆరంభమైనప్పటికీ నష్టాలు తగ్గలేదు. కరోనా ప్రభావం పెరుగుతుండటం, ముడి చమురు ధరలు తగ్గడం ప్రభావం చూపాయి. రాత్రి గం.11.30 ని. లకు డోజోన్స్ 1,794 పాయింట్లు, నాస్‌డాక్ 500 పాయింట్ల నష్టాల్లో ట్రేడయ్యాయి. మంగళవారం సెలవు కావడంతో మేలైందని, లేకుంటే అమెరికా, యూరప్ మార్కెట్ల నష్టాల ప్రభావంతో మన మార్కెట్‌కు భారీ నష్టాలు ఉండేవని విశ్లేషకులంటున్నారు.

**రూ.7 లక్షల కోట్ల సంపద ఆవిరి**

స్టాక్ మార్కెట్ మహా పతనం కారణంగా రూ. 7 లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.6, 84, 278 కోట్లు హరించుకుపోయి రూ.1,37,46,947 కోట్లకు పడిపోయింది.

## షేర్లు కకావికలం...

**• ఓఎన్‌జీసీ.. 15 ఏళ్ల కనిష్టానికి**

ముడి చమురు ధరలు 30 శాతం మేర పతనం కావడంతో చమురు అన్వేషణ, తయారీ ప్రభుత్వ రంగ కంపెనీ ఓఎన్‌జీసీ భారీగా నష్టపోయింది. 16 శాతం నష్టంతో రూ.74.65 వద్ద ముగిసింది. ఇది దాదాపు 15 ఏళ్ల కనిష్ట స్థాయి. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.

**• రెండో స్థానానికి రిలయన్స్**

చమురు ఉత్పత్తి రంగంలో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ కూడా బాగా పతనమైంది. 12 శాతం నష్టంతో రూ.1,113 వద్దకు చేరింది. ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ. లక్ష కోట్లు ఆవిరైంది. ఈ నష్టం కారణంగా అత్యధిక మార్కెట్ క్యాప్ గల భారత కంపెనీ అనే ఘనతను కోల్పోయి రెండో స్థానానికి పడిపోయింది. మొదటి స్థానం టీసీఎస్ షేర్‌కు దక్కింది.

**• యస్ బ్యాంక్ జోరు... ఎస్‌బీఐ బేజారు....**

సంక్షోభంలో చిక్కుకున్న యస్‌బ్యాంక్‌లో 49 శాతం వాటాను కొనుగోలు చేయనున్న ఎస్‌బీఐ షేర్ 6 శాతం పతనమై రూ.254కు చేరింది. మరోవైపు యస్ బ్యాంక్ షేర్ 31 శాతం లాభపడి రూ.21 వద్ద ముగిసింది.

**• చమురు షేర్లు రయ్...**

ముడి చమురు ధరలు 30 శాతం మేర తగ్గడంతో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు–హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌పీసీఎల్ షేర్ 6 శాతం లాభంతో రూ.213కు, బీపీసీఎల్ షేర్ 5.2 శాతం పెరిగి రూ.424కు పెరిగాయి.

**• ఏడాది కనిష్టానికి 800 షేర్లు...**

దాదాపు 800కు పైగా షేర్లు ఏడాది కనిష్టానికి పడిపోయాయి. బీఎస్‌ఈ 500 సూచీలో ప్రతి నాలుగు షేర్లలో ఒక షేర్ ఏడాది కనిష్టానికి పడిపోయింది.

**సెన్సెక్స్ మహా పతనాలు**




# చమురు ‘బేజార్’

- ఉత్పత్తి కోతపై దేశాల మధ్య కుదరని సయోధ్య
- ధరల పోరుకు తెరతీసిన సౌదీ
- 30 శాతం పైగా డౌన్
- 1991 గల్ఫ్ యుద్ధం తర్వాత ఇంత భారీ పతనం ఇదే తొలిసారి



**సింగపూర్:** ముడి చమురు ఉత్పత్తి తగ్గించుకునే విషయంలో ఒపెక్ కూటమి, రష్యా మధ్య డీల్ కుదరకపోవడంతో సౌదీ అరేబియా ధరల పోరుకు తెర తీసింది. భారీగా రేట్లు తగ్గించేసింది. 20 ఏళ్ల కనిష్ట స్థాయికి కోత పెట్టింది. దీంతో సోమవారం చమురు ధరలు ఏకంగా 30 శాతం దాకా పతనమయ్యాయి. ఒక దశలో ప్రామాణిక బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 31 డాలర్ల స్థాయికి పడిపోయి, తర్వాత కాస్త కోలుకుంది. 1991 గల్ఫ్ యుద్ధ సమయం తర్వాత చమురు రేట్లు ఇంత భారీగా పతనం కావడం ఇదే తొలిసారి. అటు సహజ వాయువు రేట్లు కూడా క్షీణించాయి.

**ఎందుకిలా..**

కరోనా వైరస్ కారణంగా ముడిచమురుకు డిమాండ్ తగ్గి.. మార్కెట్లో క్రూడ్ నిల్వలు పెరిగిపోయాయి. ఫలితంగా రేట్లు పడిపోవచ్చన్న భయాలతో సౌదీ అరేబియా సారథ్యంలో పెట్రోలియం ఎగుమతి దేశాల కూటమి (ఒపెక్).. చమురు ఉత్పత్తిని మరింతగా తగ్గించాలని గత వారం జరిగిన సమావేశాల్లో ప్రతిపాదించింది. అయితే, తాము ఉత్పత్తి తగ్గించిన పక్షంలో అమెరికా చమురు ఉత్పత్తి సంస్థలు మార్కెట్లో దూసుకుపోయే రిస్కులు ఉన్నాయనే ఉద్దేశంతో.. ఈ ప్రతిపాదనను రష్యా విభేదించింది. చమురు ఉత్పత్తిలో సౌదీ, రష్యా.. ఒకటి, రెండో స్థానాల్లో ఉన్నాయి. తాజా పరిణామంతో తన మార్కెట్ వాటాను కాపాడుకునే దిశగా.. అదే సమయంలో రష్యాపై ఒత్తిడిని పెంచే దిశగా సౌదీ అరేబియా పావులు కదిపింది. చమురు ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న సౌదీ అరేబియా .. క్రూడాయిల్ రేట్లను తగ్గించడంతో పాటు ఉత్పత్తినీ పెంచనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్‌లో కాంట్రాక్టుకు సంబంధించిన రేట్లను బ్యారెల్‌కు 6 నుంచి 8 డాలర్ల దాకా తగ్గించేసింది. ఇది మార్కెట్లో కలకలం రేపడంతో క్రూడాయిల్ రేట్లు భారీగా పతనమయ్యాయి. చమురు ధరలు దాదాపు దశాబ్దపు కనిష్ట స్థాయి 26 డాలర్లకు దగ్గర్లో ఉండటం మార్కెట్ వర్గాలను కలవరపెడుతోంది. త్వరలోనే ఈ స్థాయిని కూడా తాకవచ్చని అంచనాలు ఉన్నాయి.

**20 డాలర్లకూ పతనావకాశం..**

ఒకవేళ ఇరు పక్షాలు ఒక అంగీకారానికి రాకపోతే చమురు రేట్లు బ్యారెల్‌కు ఏకంగా 20 డాలర్ల స్థాయికి కూడా పతనమయ్యే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు. రష్యాను చర్చలకు రప్పించే ప్రయత్నాల్లో భాగంగానే సౌదీ అరేబియా ఈ వ్యూహాలు అమలు చేస్తుండవచ్చని వారు పేర్కొన్నారు. ఒకవేళ రేట్లు గానీ భారీగా పతనమైతే .. చమురు ఆదాయాలపై ఆధారపడిన దేశాలు దెబ్బతినడంతో పాటు క్రూడాయిల్ అన్వేషణ ప్రాజెక్టులపైనా ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు.

# యస్ బ్యాంక్ స్కామ్‌పై సీబీ‘ఐ’

- ఏడు ప్రాంతాల్లో సోదాలు
- 5 సంస్థలు, ఏడుగురు వ్యక్తులపై ఎఫ్ఐఆర్
- జాబితాలో రాణాకపూర్ భార్య, కుమార్తెలు కూడా
- నిందితులపై లుక్ అవుట్ నోటీసులు
- సీఈవో గిల్‌ను ప్రశ్నించిన ఈడీ




**న్యూఢిల్లీ:** సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ కుంభకోణం కేసు విచారణను సీబీఐ వేగవంతం చేసింది. డీహెచ్‌ఎఫ్‌ఎల్ సంస్థ నుంచి యస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు రాణా కపూర్ కుటుంబానికి రూ. 600 కోట్లు ముడుపులు ముట్టాయన్న ఆరోపణలకు సంబంధించి సోమవారం 7 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ వ్యవహారంలో అయిదు కంపెనీలు, రాణా కపూర్‌తో పాటు ఆయన భార్య, ముగ్గురు కుమార్తెలు (రోష్నీ, రాఖీ, రాధ) సహా ఏడుగురు వ్యక్తులపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (డీహెచ్‌ఎఫ్‌ఎల్) ప్రమోటరు కపిల్ వాధ్వాన్, ఆర్‌కేడబ్ల్యూ డెవలపర్స్ డైరెక్టర్ ధీరజ్ రాజేష్ కుమార్ వాధ్వాన్‌లు వీరిలో ఉన్నారు. ఇక, కంపెనీల విషయానికొస్తే.. డీహెచ్‌ఎఫ్‌ఎల్, ఆర్‌కేడబ్ల్యూ డెవలపర్స్, కపూర్ కుటుంబ సారథ్యంలోని డూఇట్ అర్బన్ వెంచర్స్, బిందు కపూర్ డైరెక్టరుగా ఉన్న ఆర్‌ఏబీ ఎంటర్‌ప్రైజెస్, రాణా కపూర్ కుమార్తెలు డైరెక్టర్లుగా ఉన్న మోర్గాన్ క్రెడిట్స్ సంస్థలు ఉన్నాయి. ముంబైలోని నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో సీబీఐ బృందాలు సోదాలు నిర్వహించాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. దేశం విడిచి వెళ్లిపోకుండా.. వారిపై లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ అయినట్లు పేర్కొన్నాయి.

అటు యస్ బ్యాంక్ జారీ చేసిన భారీ రుణాలు మొండిబాకీలుగా మారడంపైనా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టి పెట్టింది. డీహెచ్‌ఎఫ్‌ఎల్‌కి మాత్రమే పరిమితం కాకుండా రుణాలు తీసుకున్న ఇతర కంపెనీల నుంచి కూడా కపూర్ కుటుంబానికి ముడుపులేమైనా వచ్చాయేమోనన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తోంది. అటు యస్ బ్యాంక్ సీఈవో రవ్‌నీత్ గిల్‌ను కూడా ఈడీ ప్రశ్నించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

**నిధులు మళ్లించారిలా ..**

డీహెచ్‌ఎఫ్‌ఎల్‌కు యస్ బ్యాంక్ ఇచ్చిన రుణాల్లో కొంత భాగాన్ని కపిల్ వాధ్వాన్‌తో కలిసి రాణా కపూర్ దారి మళ్లించారని ఆరోపణలు ఉన్నాయి. 2018 ఏప్రిల్ – జూన్ మధ్యకాలంలో డీహెచ్‌ఎఫ్‌ఎల్‌కు చెందిన షార్ట్ టర్మ్ డిబెంచర్లలో యస్ బ్యాంక్ రూ. 3,700 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. దీంతో పాటు డీహెచ్‌ఎఫ్‌ఎల్ గ్రూప్ సంస్థ అయిన ఆర్‌కేడబ్ల్యూ డెవలపర్స్‌కు రూ. 750 కోట్లు రుణం ఇచ్చింది. అయితే, నిర్దేశిత ప్రాజెక్టులో పైసా కూడా పెట్టకుండా ఆర్‌కేడబ్ల్యూ డెవలపర్స్ మొత్తం రుణం నిధులను డీహెచ్‌ఎఫ్‌ఎల్‌కు బదలాయించింది. యస్ బ్యాంక్ నుంచి రుణం లభించినందుకు ప్రతిగా కపూర్ కుమార్తెలకు చెందిన డూఇట్ అర్బన్ వెంచర్స్‌లో వాధ్వాన్ దాదాపు రూ. 600 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. ఇది ఓ రకంగా కపూర్‌కు ముడుపు లివ్వడమేనన్నది సీబీఐ ఆరోపణ. సుమారు రూ. 97,000 కోట్లు బ్యాంకు రుణాలు తీసుకున్న డీహెచ్‌ఎఫ్‌ఎల్ సుమారు రూ.31,000 కోట్ల నిధులు దారి మళ్లించిందని ఆరోపణలు ఉన్నాయి.

**బ్యాంకుల బాండ్లలో రూ. 93,000 కోట్ల పెట్టుబడులు..**

దేశీ బ్యాంకులు జారీ చేసిన అదనపు టియర్ 1 బాండ్లలో ఇన్వెస్టర్లు దాదాపు రూ. 93,669 కోట్లు ఇన్వెస్ట్ చేశారని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. యస్ బ్యాంక్ గానీ దాదాపు రూ. 8,000 కోట్ల పైచిలుకు బాండ్లను పూర్తిగా రైటాఫ్ చేసిన పక్షంలో ఇన్వెస్టర్లు ఇకపై రిస్కులు తీసుకోవడానికి ముందుకు రాకపోవచ్చని పేర్కొంది. మరోవైపు, యస్ బ్యాంక్ సమస్యకు సత్వర పరిష్కారం అమలు చేయడంతో.. సంక్షోభం బ్యాంకింగ్ రంగం అంతటా విస్తరించకుండా ఉంటుందని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ పేర్కొంది.

**ముందే పసిగట్టారా!!**

యస్ బ్యాంక్ పరిస్థితి నానాటికీ దిగజారుతుండటాన్ని ముందుగానే పసిగట్టినట్లుగా పలువురు ఖాతాదారులు గతేడాది మార్చి–సెప్టెంబర్ మధ్య కాలంలో భారీగా విత్‌డ్రా చేసుకున్నారు. ఈ వ్యవధిలో ఏకంగా రూ. 18,100 కోట్ల మేర విత్‌డ్రాయల్ లావాదేవీలు నమోదయ్యాయి. మరోవైపు, డిపాజిట్లపై బీమా పరిమాణాన్ని పెంచిన నేపథ్యంలో తమ సొమ్ముకేమీ కాదని భావిస్తున్నట్లు కొందరు డిపాజిటర్లు తెలిపారు. అటు, మరో రెండు మ్యూచువల్ ఫండ్ సంస్థలు.. తమ స్కీమ్‌ల నుంచి యస్ బ్యాంక్ పెట్టుబడులను పక్కకు పెట్టాయి. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఎంఎఫ్, బరోడా ఎంఎఫ్ వీటిలో ఉన్నాయి. యస్ బ్యాంక్ డెట్ సాధనాలను రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ‘డి’ స్థాయికి కుదించడం ఇందుకు కారణం.

**ఈ వారంలోనే మారటోరియం ఎత్తేయొచ్చు: అడ్మినిస్ట్రేటర్ కుమార్**

పరిస్థితులు చక్కబడితే ఈ వారంలోనే మారటోరియం ఎత్తివేసే అవకాశాలు ఉన్నాయని ఆర్‌బీఐ నియమించిన యస్ బ్యాంక్ అడ్మినిస్ట్రేటర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఎస్‌బీఐ పెట్టుబడుల ప్రణాళికకు రిజర్వ్ బ్యాంక్ ఆమోదముద్ర వేస్తే.. యస్ బ్యాంక్ మారటోరియంపరమైన ఆంక్షల నుంచి బైటికి రాగలదన్నారు. డిపాజిటర్ల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతో పాటు నిధుల సమీకరణ కూడా తమ ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయని కుమార్ చెప్పారు. బ్యాంకింగ్ సేవలన్నీ సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. తమ ఏటీఎంలతో పాటు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో కూడా విత్‌డ్రాయల్ సదుపాయం అందుబాటులోకి తేగలిగినట్లు చెప్పారు. డిసెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను మార్చి 14న ప్రకటిస్తామని కుమార్ తెలిపారు.

epaper.sakshi.com

## ఎస్‌బీఐ సీఎఫ్‌ఓగా వెంకట నాగేశ్వర్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌ఓ)గా చలసాని వెంకట నాగేశ్వర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన ఎస్‌బీఐ ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ గ్రూప్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఇక నుంచి చలసాని ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీ, సీఎఫ్‌ఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారని బాంబే స్టాక్స్ ఎక్స్ఛేంజ్‌కు అందించిన సమాచారంలో బ్యాంక్ పేర్కొంది.

### బులియన్ రూ.లలో

| | |
|---|---|
| **ముంబై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 44,940 |
| బంగారం (22 క్యారెట్లు) | 42,800 |
| వెండి (కిలో) | 49,500 |
| **హైదరాబాద్/చెన్నై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,900 |
| బంగారం (22 క్యారెట్లు) | 41,810 |
| వెండి (కిలో) | 49,500 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,350 |
| బంగారం (22 క్యారెట్లు) | 40,200 |
| వెండి (కిలో) | 46,500 |
| **విశాఖపట్నం** | |
| బంగారం (24 క్యారెట్లు) | 45,130 |
| బంగారం (22 క్యారెట్లు) | 41,980 |
| వెండి (కిలో) | 48,000 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 45,250 |
| బంగారం (22 క్యారెట్లు) | 41,810 |
| వెండి (కిలో) | 46,900 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### ముడిచమురు... (బ్యారల్)

| | రాత్రి 11.30కు | | శుక్రవారం ముగింపు |
|---|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 32.98 | $ | 41.28 |
| బ్రెంట్ | 36.17 | $ | 45.27 |

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 10-3-2020

| | |
|---|---|
| విశాఖ | 323–00 |
| చిత్తూరు | 323–00 |
| వరంగల్ | 293–00 |
| విజయవాడ | 324–00 |
| గోదావరి | 324–00 |
| **9–3–2020 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 290–00 |

# మరోసారి భారత వృద్ధి రేటుకు మూడీస్ కోత

**న్యూఢిల్లీ:** భారత జీడీపీ వృద్ధి అంచనాలను 2020 సంవత్సరానికి గతంలో వేసిన 5.4 శాతం నుంచి 5.3 శాతానికి మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ సవరించింది. కరోనా వైరస్ కారణంగా భారత్‌లో వినియోగ డిమాండ్ క్షీణిస్తుందన్న అంచనాలతో ఈ నిర్ణయానికి వచ్చింది. మార్చి నెలకు సంబంధించి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై తన అంచనాలను మూడీస్ తాజాగా విడుదల చేసింది. చైనా వెలుపల కరోనా వైరస్ వేగంగా మరిన్ని ప్రధాన దేశాలకు విస్తరించిందని పేర్కొంది. వైరస్‌ను స్థిరంగా నియంత్రణలోకి తీసుకొచ్చినా కానీ, 2020లో రెండో త్రైమాసికంలో అంతర్జాతీయంగా ఆర్థిక కార్యకలాపాలు బలహీనంగానే ఉండొచ్చన్న అంచనాను వెలువరించింది. అంతర్జాతీయంగా కరోనా వైరస్ కేసులు పెరుగుతున్నాయని, ఈ క్రమంలో పర్యాటక ఆంక్షలు ఏప్రిల్–జూన్ వరకు కొనసాగొచ్చని పేర్కొంది. సరఫరాలకు విఘాతంతోపాటు, వినియోగం, పెట్టుబడులు కూడా క్షీణిస్తాయని, చమురు ధరలు, ఇతర కమోడిటీల ధరలు జూన్ వరకు ప్రస్తుత స్థాయిల్లోనే ఉండొచ్చని అంచనా వేసింది.

**2020లో 5.3 శాతంగా ఉంటుందని అంచనా**




**సవరించిన అంచనాలు**

- జీ20 ఆర్థిక వ్యవస్థలు 2.1 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చు. గత అంచనాల కంటే 0.3 శాతం తక్కువ.
- 2020 సంవత్సరానికి చైనా వృద్ధి అంచనాలు 5.2 శాతం నుంచి 4.8 శాతానికి తగ్గింపు.
- అమెరికా వృద్ధి రేటు 1.7% నుంచి 1.5 శాతానికి పరిమితం
- కరోనా వైరస్ ఎక్కువ కాలం పాటు కొనసాగితే, చమురు ధరలు బ్యారెల్ 40–50 డాలర్లకే పరిమితం అయితే, అటువంటి పరిస్థితుల్లో భారత వృద్ధి రేటు 2020లో 5 శాతానికి పరిమితం కావచ్చు. చైనా వృద్ధి రేటు 3.7 శాతానికి తగ్గొచ్చు.

## బంగారం నిర్వహణకు నాన్ బ్యాంకు కస్టోడియన్లకు అనుమతి



**న్యూఢిల్లీ:** బంగారం, బంగారంతో కూడిన సాధనాల నిర్వహణకు రిజిస్టర్డ్ నాన్ బ్యాంకు కస్టోడియన్లకు సెబీ అనుమతి మంజూరు చేసింది. ఇందు కోసం 'సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (మ్యూచువల్ ఫండ్స్) రెగ్యులేషన్స్, 1996'లో సెబీ సవరణలు చేసింది. ప్రస్తుతానికి సెబీ వద్ద కస్టోడియన్లుగా నమోదైన బ్యాంకులకే గోల్డ్ ఈటీఎఫ్, ఇతర బంగారం సాధనాల నిర్వహణకు అవకాశం ఉంది. అదనంగా స్పాన్సర్లు లేదా అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) క్లోజ్ ఎండెడ్ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసేందుకు కూడా సెబీ అనుమతించింది.

## కాల్స్, డేటాకు కనీస ధరను నిర్ణయించాల్సిందే

**టెలికం రంగానికి మరో ఆప్షన్ లేదు • నీతి ఆయోగ్ సీఈవో కాంత్**



**న్యూఢిల్లీ:** మొబైల్ కాల్స్, డేటాకు కనీస ధరను (ఫ్లోర్ ప్రైస్) నిర్ణయించాలన్న టెలికం కంపెనీల వాదనకు నీతిఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ మద్దతు పలికారు. తీవ్ర రుణ భారంతో ఉన్న టెలికం రంగానికి, భరించలేని స్థాయికి ధరలు పడిపోయిన పరిస్థితుల్లో మొబైల్ కాల్స్, డేటాకు కనీస ధరను నిర్ణయించడం మినహా మరో అవకాశం లేదంటూ ట్రాయ్‌కి రాసిన లేఖలో అమితాబ్ కాంత్ పేర్కొన్నారు. ధరల పరంగా కంపెనీలకు స్వేచ్ఛ ఉన్నప్పటికీ, పోటీ కారణంగా అవి ఒక స్థాయికి మించి ధరలను పెంచలేక, కనీస ధరను నిర్ణయించాలంటూ టెలికం నియంత్రణ సంస్థ (ట్రాయ్) జోక్యాన్ని కోరుతున్నాయి. దీంతో టెలికం కంపెనీల డిమాండ్‌పై ట్రాయ్ భాగస్వాముల నుంచి అభిప్రాయాలను ఆహ్వానించింది. ప్రస్తుతానికి ప్రతీ జీబీ 4జీ డేటా కోసం రూ.3.5 చెల్లిస్తుండగా, కంపెనీల డిమాండ్ ఆచరణ రూపం దాలిస్తే, వినియోగదారులు దీనికి 5–10 రెట్లు అధికంగా చెల్లించే పరిస్థితి ఏర్పడుతుంది. ఒక జీబీ డేటాకు రూ.35 ఉండాలని వొడాఫోన్ ఐడియా ప్రతిపాదించగా, రూ.30 ఉండాలని ఎయిర్‌టెల్, రూ.20 చేయాలని రియలన్స్ జియో కోరాయి. ''టెలికం రంగంలో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలంటే ఒకటికి మించిన సంస్థలు కొనసాగాల్సిన అవసరం ఉంది. ఇందు కోసం కనీస ధరలను నిర్ణయించడాన్ని మేము బలంగా మద్దతిస్తున్నాం''అంటూ లేఖలో అమితాబ్ కాంత్ తన అభిప్రాయాలను తెలియజేశారు.

## కార్వీ జీఎస్‌టీ వ్యాపారం క్లియర్ ట్యాక్స్ సొంతం




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** హైదరాబాద్‌కు చెందిన ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ కార్వీ కార్పొరేట్‌కు చెందిన కార్వీ వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వ్యాపార, సాంకేతికత విభాగాన్ని బెంగళూరుకు చెందిన ఆన్‌లైన్ ఫైనాన్షియల్ టెక్నాలజీ కంపెనీ క్లియర్ ట్యాక్స్ కొనుగోలు చేసింది. డీల్ విలువ ఎంతనేది కంపెనీ వెల్లడించలేదు. దీంతో కార్వీకి చెందిన 200లకు పైగా ఎంటర్‌ప్రైజెస్ కస్టమర్లు, 25 మంది ఉద్యోగులు, టెక్నాలజీ క్లియర్ ట్యాక్స్‌కు బదిలీ అవుతాయని క్లియర్‌ట్యాక్స్ ఫౌండర్ అండ్ సీఈఓ అర్చిత్ గుప్తా తెలిపారు. ఈ కొనుగోలుతో మా జీఎస్‌టీ ఎంటర్‌ప్రైజెస్ విభాగం మరింత బలోపేతం అయిందనీ, ఈ విభాగంలో లీడర్‌షిప్‌గా ఎదిగామన్నారు. ప్రస్తుతం క్లియర్ ట్యాక్స్‌కు ఎస్‌ఏపీలో 400లకు పైగా కస్టమర్లున్నారు. ఇప్పటివరకు క్లియర్ ట్యాక్స్ 65 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించింది. పేపాల్ కో–ఫౌండర్స్ పీటర్ థిల్ మ్యాక్స్ లెవ్‌చిన్, పేటీఎం ఫౌండర్ విజయ్ శేఖర్‌శర్మ, వాట్సాప్ మాజీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నీరజ్ అరోరాలతో పాటూ కంపోసైట్, సికోయా క్యాపిటల్స్, సైఫ్ పార్టనర్స్ వంటి కంపెనీలు పెట్టుబడులు పెట్టాయి. కార్వీ స్టాక్ బ్రోకింగ్ తన ఆస్తుల అమ్మకం ద్వారా నిధులను సమీకరించి బ్యాంక్‌లు, ఇన్వెస్టర్ల బకాయిలను చెల్లించే తరుణంలో క్లియర్ ట్యాక్స్‌తో డీల్ కుదరడం గమనార్హం.

## 17 నెలల కనిష్టానికి రూపాయి

- 30 పైసలు క్షీణత
- 74.17 వద్ద క్లోజింగ్
- కరోనాతో భయాలు కారణం



**ముంబై:** కరోనావైరస్ ప్రభావంతో ఆర్థిక మందగమన పరిస్థితులు తలెత్తవచ్చన్న ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో దేశీ కరెన్సీ సోమవారం ఏకంగా 17 నెలల కనిష్టానికి క్షీణించింది. డాలర్‌తో పోలిస్తే 30 పైసలు తగ్గి 74.17 వద్ద క్లోజయ్యింది. చమురు ధరలు భారీగా పతనం కావడం కూడా ఇందుకు దారి తీసినట్లు ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. సోమవారం ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ట్రేడింగ్ క్రితం ముగింపు 73.87తో పోలిస్తే కొంత బలహీనంగా .. 73.99 వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత గరిష్టంగా 73.85, కనిష్టంగా 74.17 శ్రేణిలో తిరుగాడింది. చివరికి 30 పైసల నష్టంతో 74.17 వద్ద క్లోజయ్యింది. 'ఎకానమీపై కరోనా వైరస్ ప్రతికూల ప్రభావాల నుంచి హెడ్జింగ్ కోసం ఇన్వెస్టర్లు బాండ్లవైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో రూపాయి క్షీణించింది 'అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనలిస్టు (ఫారెక్స్, బులియన్ విభాగం) గౌరంగ్ సోమయ్య పేర్కొన్నారు. ప్రస్తుతం 73.80–74.20 శ్రేణిలో ప్రతికూల ధోరణిలోనే రూపాయి ట్రేడింగ్ జరగవచ్చని ఆయన చెప్పారు.

## దివీస్ వైజాగ్ యూనిట్లో ఉత్పత్తి ప్రారంభం



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఔషధ తయారీ కంపెనీ దివీస్ ల్యాబొరేటరీస్.. విశాఖపట్నంలోని డీసీవీ–సెజ్ యూనిట్లో వాణిజ్య కార్యకలాపాలు సోమవారం ప్రారంభమయ్యాయని తెలిపింది. భీమునిపట్నం మండలం చిప్పాడ గ్రామం వద్ద ఈ యూనిట్ నెలకొంది. కాగా, సోమవారం బీఎస్‌ఈలో కంపెనీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే 2.60 శాతం తగ్గి రూ.2,182 వద్ద స్థిరపడింది.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి అవార్డులు



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి 2019 సంవత్సరానికి ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సర్వీస్ క్వాలిటీ డిపార్చర్స్ అవార్డులు వరించాయి. ఆసియా పసిఫిక్ ప్రాంతం, 1.5–2.5 కోట్ల మంది ప్రయాణికుల విభాగంలో బెస్ట్ ఎయిర్‌పోర్ట్, బెస్ట్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఆంబియెన్స్ అవార్డులు దక్కాయి. ఈ ఏడాది సెప్టెంబరులో పోలండ్‌లో అవార్డుల కార్యక్రమం జరుగనుంది.

## పెన్నార్‌కు రూ.550 కోట్ల ఆర్డర్లు




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఇంజనీరింగ్ ప్రొడక్ట్స్, సొల్యూషన్స్ కంపెనీ పెన్నార్ ఇండస్ట్రీస్‌తోపాటు తన అనుబంధ విభాగాలు రూ.550 కోట్ల విలువైన ఆర్డర్లను ఫిబ్రవరిలో దక్కించుకున్నాయి. ఎంఆర్‌ఎఫ్, సెయిల్ రైట్స్, అదానీ, ఎల్‌అండ్‌టీ, యమహా, అశోక్ లేలాండ్ తదితర కంపెనీల నుంచి వీటిని పొందింది. ప్రస్తుతం ఆర్డర్ బుక్ ప్రీ–ఇంజనీర్డ్ బిల్డింగ్స్ డివిజన్ రూ.455 కోట్లు, రైల్వేస్ విభాగం రూ.290 కోట్లు, వాటర్ ట్రీట్‌మెంట్ సొల్యూషన్స్ రూ.78 కోట్లుగా ఉంది.

## ఎంసీఎల్‌ఆర్ రేటును తగ్గించిన యూనియన్ బ్యాంకు




**ముంబై:** ప్రభుత్వరంగంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అన్ని రకాల కాల వ్యవధులు కలిగిన ఎంసీఎల్ఆర్ రుణాలపై రేట్లను 10 బేసిస్ పాయింట్ల వరకు (0.10 శాతం) తగ్గిస్తున్నట్టు సోమవారం ప్రకటించింది. మార్చి 11 నుంచి అమల్లోకి వస్తున్నట్టు తెలిపింది. యూనియన్ బ్యాంకు 2019 జూలై నుంచి రుణ రేట్లను తగ్గించడం ఇది తొమ్మిదోసారి. ఏడాది కాల ఎంసీఎల్‌ఆర్ రేటు తాజాగా 8.10 శాతం నుంచి 8 శాతానికి తగ్గింది.

## కాస్ట్ అకౌంటింగ్‌ను తప్పనిసరి చేయాలి: ఐసీఎంఏఐ



**ముంబై:** ఫైనాన్షియల్ ఆడిట్లు తరచుగా విఫలమవుతున్న నేపథ్యంలో బ్యాంకుల ఎన్‌పీఏలను గుర్తించేందుకు వీలుగా కాస్ట్ అకౌంటింగ్‌ను తప్పనిసరి ఏయాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఏసీఎంఏఐ) సూచించింది. అన్ని నూతన భారీ రుణ ప్రతిపాదనలను విశ్లేషించడంతోపాటు, వాటిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎన్‌పీఏలు పెరుగుతున్నాయా, లేదా? అన్నది చూసేందుకు కాస్ట్ ఆడిటింగ్‌ను తప్పనిసరి చేయాలని ఐసీఎంఏఐ ప్రెసిడెంట్ బల్వీందర్‌సింగ్ కోరారు. సంప్రదాయ ఫైనాన్షియల్ ఆడిట్ విఫలమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఈ దిశగా చర్యలు చేపట్టాలని అభిప్రాయపడ్డారు.

**రాష్ట్రీయం**

# 'మల్టీపర్పస్' పంచాయితీ!

**రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బంది విషయంలో గందరగోళం**

- జనాభా దామాషా ప్రకారం నియమించుకుని కొత్త వేతనమివ్వాలని ఉత్తర్వులు
- జీవో వచ్చి 4 నెలలు దాటినా జీపీల్లోని సిబ్బందికి ఇంకా పాత వేతనాలే..
- కొత్త వారిని నియమించుకున్నట్టు రికార్డుల్లో రాసుకుని స్వాహా చేస్తున్న వైనం
- విషయం తెలియడంతో సమగ్ర విచారణకు ఆదేశించిన పీఆర్ కమిషనర్



**సాక్షి, హైదరాబాద్:** గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలకు పాలక వర్గాలు ఎసరు పెడుతున్నాయి. అరకొర జీతాలిస్తూ.. పెరిగిన వేతనాలను నొక్కేస్తున్నాయి. బహుళ ప్రయోజన సిబ్బంది (మల్టీపర్పస్‌వర్కర్) నియామకాల్లో స్పష్టత కొరవడటంతోనే ఈ అక్రమాలకు తెరలేచినట్టు తెలుస్తోంది. నిర్దేశిత జనాభా కంటే అధికంగా ఉన్న సిబ్బందిని ఇతర గ్రామాల్లో సర్దుబాటు చేయకపోవడం.. జనాభా కంటే తక్కువ ఉన్న చోట్ల కొత్తగా నియమించుకోకుండా ప్రభుత్వ ఖజానాకు జెల్లకొడుతున్నట్లు తెలుస్తోంది. అంతేగాకుండా.. ఇప్పటి వరకు అనేక జిల్లాల్లో పెంచిన వేతనాలు ఇవ్వకుండా స్వాహా చేస్తున్నట్లు తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది.

**కోత పెట్టాలన్నా..**

**కొత్తగా పెట్టుకోవాలనుకున్నా..**

రాష్ట్రవ్యాప్తంగా 12,751 గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం 2.04 కోట్ల జనాభా ఉంది. ఈ జనాభాకు అనుగుణంగా మల్టీపర్పస్ వర్కర్‌ను నియమించుకోవాలి. ఇందులో 4,380 గ్రామ పంచాయతీల్లో 500 జనాభానే ఉంది. వీటిలో మాత్రం కనిష్టంగా ఇద్దరిని నియమించుకునే వెసులుబాటుంది. కాగా, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల్లో 36 వేల మంది పనిచేస్తుండగా.. మరో 17 వేల మందిని అదనంగా నియమించుకోవాల్సి ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే, కొత్తగా సిబ్బందిని నియమించుకోవాలనుకున్నా.. అదనంగా ఉన్నవారికి కోతపెట్టాలన్నా.. పక్క పంచాయతీల్లో సర్దుబాటు చేయాలనుకున్నా స్థానిక రాజకీయాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీనికి తోడు ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అధికంగా ఉన్నవారు పక్క గ్రామాలకు వెళ్లేందుకు ససేమిరా అనడమేగాక.. ప్రభుత్వం పెంచిన వేతనాన్ని సమానంగా పంచుకుంటామని, అందరం ఇక్కడే పనిచేస్తామని మొండికేస్తున్నారు. దీంతో అంతర్గత సర్దుబాటు చేసుకుని వారి చేత అక్కడే పనిచేయించుకుంటున్నారు. ఇక, గోల్‌మాల్ కూడా ఈ అంశం ఆధారంగానే జరుగుతోంది. కొన్ని జీపీల్లో జనాభా దామాషా ప్రకారం ఉండాల్సిన సిబ్బంది కన్నా తక్కువ మంది పనిచేస్తున్నారు. జనాభా దామాషాకు అనుగుణంగా ఆయా జీపీల్లో తగినంత మంది సిబ్బందిని నియమించుకుని వారందరికీ కొత్త వేతనాలు చెల్లించాలి. కానీ, అలా చేయకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై తక్కువ మందితోనే నెట్టుకొస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సిబ్బంది వేతనాలను డ్రా చేసుకుంటున్నారని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. మరికొన్ని చోట్ల పాత వేతనాలిస్తూ కొత్తజీతాలిస్తున్నామని రికార్డుల్లో రాసుకుంటూ మిగిలింది నొక్కేస్తున్నారనే సమాచారం కూడా పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో గ్రామపంచాయతీల వారీగా పనిచేస్తున్న సిబ్బందికి గతేడాది అక్టోబర్‌లో ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం నెలకు రూ.8,500 అందుతున్నాయో లేదో నివేదిక తెప్పించుకుని తమకు పంపాలని అన్ని జిల్లాల అదనపు కలెక్టర్ల (స్థానిక సంస్థలు)కు ఇటీవల లేఖ రాసింది. కచ్చితంగా విచారణ జరిపి తగిన సమాచారం ఇవ్వాలని ఈ నెల 6న పంచాయతీరాజ్ కమిషనర్ మెమో నం: 4978 జారీ చేశారు.

### 500 జనాభాకు ఒకరు..

ప్రతి 500 జనాభాకు ఒక బహుళ ప్రయోజన సిబ్బంది (మల్టీపర్పస్ వర్కర్)ని నియమించుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. గ్రామంలో 500 జనాభా మాత్రమే ఉంటే కనిష్టంగా ఇద్దరిని నియమించుకునే వెసులుబాటు కల్పించింది. పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కల సంరక్షణ, పంచాయతీకి సంబంధించిన ఇతర పనులకు వినియోగించుకోవాలని నిర్దేశించింది. ప్రతి జీపీకి ఒక ట్రాక్టర్‌ను పంపిణీ చేస్తున్నందున.. దీన్ని నడిపేలా ఒకరికి కచ్చితంగా డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేసింది. అలాగే, వీధి దీపాల నిర్వహణ, విద్యుత్ సరఫరా పనులు చేయడంలోనూ నైపుణ్యం ఉండేలా చూడాలని, లేనిపక్షంలో జాబ్ వర్క్ కింద ప్రైవేటు సేవలు పొందాలని పేర్కొంది. ఈ మేరకు గతేడాది అక్టోబర్‌లో పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నెలకు రూ.8,500 చొప్పున వేతనం ఇవ్వనున్నట్లు ప్రకటించిన సర్కార్.. ఇప్పటికే గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందిని కొనసాగించాలని, ఒకవేళ నిర్దేశిత జనాభా కంటే ఎక్కువ మంది కార్మికులుంటే 5 కి.మీ.ల పరిధిలో ఉండే గ్రామాల్లో వీరి సేవలను వాడుకోవాలని స్పష్టం చేసింది. కాగా, విధిగా అదే గ్రామానికి చెందినవారినే వర్కర్లుగా పెట్టుకోవాలని కూడా సూచించింది. ఈ నిబంధన పంచాయతీల్లో గందరగోళానికి తెరలేపింది.

# కీచక జాబితా @ ఐటీఎస్ఎస్ఓ

**'ఇన్వెస్టిగేటింగ్ ట్రాకింగ్ సిస్టం ఫర్ సెక్సువల్ అఫెన్సెస్' డేటాబేస్‌కు శ్రీకారం**

**అన్ని రాష్ట్రాల రేపిస్టుల వివరాలతో ప్రత్యేక సమగ్ర జాబితా**

**'దిశ' కేసు నేపథ్యంలో కేంద్రం సరికొత్త నిర్ణయం**

**మార్చిలోగా కీచకుల జాబితాలను పంపాలని రాష్ట్రాలకు ఆదేశాలు**

**త్వరలోనే డేటా పంపనున్న తెలంగాణ పోలీసులు**



**సాక్షి, హైదరాబాద్:** దేశంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు నిరోధించే చర్యల్లో భాగంగా కేంద్రం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. అలాంటి దారుణాలకు పాల్పడే కీచక జాబితా సిద్ధం చేసి ప్రత్యేక డేటాబేస్ ద్వారా అన్ని రాష్ట్రాలు, ఏజెన్సీలకు అందుబాటులోకి తీసుకొచ్చే పనిలోపడింది. దీనికోసం క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం (సీసీటీఎన్ఎస్)కి భిన్నంగా 'ఇన్వెస్టిగేటింగ్ ట్రాకింగ్ సిస్టం ఫర్ సెక్సువల్ అఫెన్సెస్'(ఐటీఎస్ఎస్ఓ)కు రూపమిస్తోంది. ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా ఆ జాబితాలను అప్‌డేట్ చేసి అందజేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశించింది. ఇప్పటికే కేంద్ర హోంశాఖ పరిధిలో నడిచే సీసీటీఎన్ఎస్ ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పాత నేరగాళ్ల గత చరిత్రను పోలీసులు తెలుసుకుంటున్నారు. కీచక నేరస్థులు మళ్లీ నేరం చేసి దొరికినపుడు వారి గత చరిత్రను ఎఫ్ఐఆర్, చార్జిషీట్లలో పేర్కొనాలని యోచిస్తోంది. దీనికోసమే ఐటీఎస్ఎస్ఓ అందుబాటులోకి తీసుకొస్తోంది.

**'దిశ' ఘటన నేపథ్యంలో..**

'దిశ'ఘటన నేపథ్యంలో కేంద్రం మహిళలపై అకృత్యాలకు పాల్పడే నిందితులందరికీ ప్రత్యేక డేటాబేస్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఐటీఎస్ఎస్ఓ పేరుతో దేశంలో అన్ని రాష్ట్రాల్లో మహిళలపై అఘాయిత్యాలు చేసిన వారి వివరాలను ఇందులో పొందుపరుస్తారు. హైదరాబాద్ శివారులో నవంబర్ 27న వెటర్నరీ డాక్టర్ దిశపై లైంగిక దాడికి పాల్పడి పాశవికంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్రంగా ఆగ్రహావేశాలు చెలరేగాయి. తరువాత డిసెంబర్ 6న జరిగిన పోలీస్ ఎన్‌కౌంటర్లలో దిశ కేసులో నిందితులు నలుగురు చనిపోయారు. నిందితులు నలుగురు వృత్తిరీత్యా లారీ డ్రైవర్లు, క్లీనర్లు కావడంతో ఇతర రాష్ట్రాల్లోనూ ఎవరైనా మహిళలపై అలాంటి ఘటనలకు పాల్పడ్డారా? అన్న అనుమానాలను సీపీ సజ్జనార్ సైతం వ్యక్తం చేశారు. గతంలో ఆడవాళ్లపై ఇలాంటి ఘటనలు జరగడం కూడా ఈ అనుమానాలకు బలం చేకూరేలా చేసింది. వారి డీఎన్ఏ శాంపిళ్లను కర్ణాటకతోపాటు, ఏపీ తదితర రాష్ట్రాలకు పంపుతామని సైబరాబాద్ పోలీసులు తెలిపిన విషయం తెలిసిందే.

### భవిష్యత్తులో ఐటీఎస్ఎస్ఓనే ఆధారం..

ఈ డేటాబేస్‌లో ఆడవారిపై అనుచితంగా ప్రవర్తించేవారు, అఘాయిత్యాలకు పాల్పడేవారు, ట్రాఫికింగ్, వ్యభిచారం, కిడ్నాపులు, ఆన్‌లైన్ వేధింపులకు పాల్పడేవారి జాబితాను పొందుపరుస్తారు. ఇందులో నేరగాళ్ల వేలిముద్రలు, బ్లడ్‌గ్రూప్, డీఎన్ఏ, పాత నేరాలు, నేర స్వభావం, నేరం చేసే విధానం తదితర విషయాలు రికార్డు చేస్తారు. దేశంలో ఎక్కడ మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలు జరిగినా ఘటనా స్థలంలో దొరికిన శాంపిల్స్‌ను ఇకపై ఐటీఎస్ఎస్ఓకు పంపుతారు. ఒకవేళ నేరస్తుడిని ముందే గుర్తించినా అతని వేలిముద్రలను ఐటీఎస్ఎస్ఓతో పోల్చి చూస్తారు. ఒకవేళ గతంలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడి ఉంటే.. అవి కూడా దర్యాప్తు అధికారికి తెలుస్తాయి. ఫలితంగా దర్యాప్తు వేగంగా పూర్తవుతుంది. పాత నేరస్తుడి గత చరిత్రను చార్జిషీటుతో పాటు కలిపి న్యాయస్థానానికి సమర్పించడంతో నిందితుడికి తక్కువ సమయంలో కఠిన శిక్షలు పడేలా చూడాలన్నది కేంద్రం యోచన. ప్రస్తుతం తెలంగాణ పోలీసుల వద్ద దాదాపుగా 5 లక్షల మందికిపైగా నేరస్తుల వేలిముద్రలు, నేర చరిత్ర వివరాలున్నాయి. వీటిలో రేపిస్టులు, మహిళలను వేధించేవారి వివరాలను వేరు చేసి త్వరలోనే కేంద్రానికి పంపనున్నారు.

# పాత ప్రాజెక్టులకు.. అరకొర నిధులు

- ఎస్ఎల్‌బీసీ, ప్రాణహిత, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమాలకు నిధుల కొరత
- టన్నెల్ ప్రాజెక్టుకు రూ 3.16 కోట్లు, కల్వకుర్తికి కేవలం రూ .2.29 కోట్లు
- కనీసంగా రూ.1,200 కోట్లు కేటాయింపులు కోరినా దక్కింది అంతంతే

**సాక్షి, హైదరాబాద్ :** రాష్ట్ర బడ్జెట్‌లో సాగునీటిశాఖకు చేసిన నిధుల కేటాయింపుల్లో నిర్మాణంలోని పలు ప్రధాన ప్రాజెక్టులకు మొండిచేయి ఎదురైంది. ప్రాజెక్టుల పూర్తికి రూ. వందల కోట్లలో కేటాయింపులు కోరితే కేవలం రూ.పదుల కోట్లలో మాత్రమే నిధులు దక్కాయి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు, ప్రాణహిత, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకూ అరకొర నిధులే ఇచ్చింది. ముఖ్యంగా పాలమూరు జిల్లాలోని ప్రా జెక్టులన్నీ చివరి దశలో ఉన్నాయి. వీటికింద ఉన్న కొద్దిపాటి భూసేకరణ, సహాయ పునరావాసానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయిస్తే గణనీయంగా ఆయకట్టు సాగులోకి వచ్చే అవకాశం ఉంటుంది.ఇలా కల్వకుర్తి పరిధిలో భూసేకరణకోసం రూ. 24.18 కోట్లు, పనులకు సంబంధించి రూ.79.32 కోట్ల పెండింగ్ బిల్లులు ఉండగా, నెట్టెంపాడు పరిధిలో పనులకు చెందినవి రూ.11.47 కోట్లు, భూసేకరణవి రూ.8.98 కోట్లు, పునరావాసానివి రూ.1.83 కోట్లు బకాయిలు ఉండగా, భీమా పరిధిలోనూ రూ.36 కోట్ల బకాయిలున్నాయి. వీటిని తీర్చడంతో పాటు చివరి దశ పనుల పూర్తికి కనీసం రూ.1,200 కోట్లు కేటాయించాలని నీటి పారుదల శాఖ ప్రతిపాదించింది.అయినప్పటికీ బడ్జెట్‌లో మొత్తంగా రూ.50 కోట్ల నిధులే దక్కాయి. అధిక నిధుల అవసరాలున్న క ల్వకుర్తి ప్రాజెక్టుకు కేవలం రూ.2.29 కోట్లతో సరిపెట్టారు.గతేడాది సైతం ఈ ప్రాజెక్టుకు రూ.3 కో ట్లు నిధుల కేటాయింపు జరగడం విశేషం.ఇక బీమాకు రూ.3.69 కోట్లు,నెట్టెంపాడుకు రూ.16.70 కోట్లు, కోయిల్‌సాగర్‌కు రూ.17.40 కోట్లతో నామమాత్రపు కేటాయింపులు చేశారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల పూర్తి ఎలా సాధ్యమన్నది భవిష్యత్తే చెప్పాల్సి ఉంది.

**టన్నెల్ అక్కడే..ప్రాణహిత పడకే..**

ఇక ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనుల పూర్తికి నిధులను పూర్తిగా విస్మరించారు. ఈ ప్రాజెక్టు పరిధిలో పనులకు గాను రూ.126 కోట్ల మేర నిధులు పెండింగ్‌లో ఉండగా కేటాయించింది మాత్రం రూ.3.16 కోట్లు మాత్రమే. ఈ నిధులతో 43.89 కి.మీటర్ల టన్నెల్ పనుల్లో మిగిలిన మరో 10 కి.మీ.లకు టన్నెల్‌ను ఎప్పటిలోగా పూర్తి చేస్తారన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాణహిత ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఉన్న తమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ ప్రాంతంపై ఇప్పటికీ స్పష్టత లేదు.బ్యారేజీ దిగువన పనులు జరుగుతున్న ప్యాకేజీల్లో ఇంకా భూసేకరణ అవసరాలకు రూ.269 కోట్ల నిధులు అవసరమున్నా ఇంతవరకు వాటికి అతీగతీ లేదు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఉంటుందని భావించినా కేవలం రూ.12 కోట్లు కేటాయించి ప్రభుత్వం పూర్తిగా నిరుత్సాహపరిచింది.



# నో కోవిడ్.. హైదరాబాద్ సేఫ్!

- వైరస్ నుంచి కోలుకుంటున్న 'దుబాయ్'యువకుడు
- తాజా పరీక్షల్లో నెగెటివ్ రిపోర్ట్.. త్వరలో డిశ్చార్జ్
- అనుమానాలతో చేసిన 17 కేసులు కూడా నెగెటివ్

**సాక్షి, హైదరాబాద్/గాంధీ ఆస్పత్రి:** ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న కోవిడ్–19 ఆనవాళ్లు గ్రేటర్‌లో తగ్గుముఖం పట్టాయి. ఇటీవల దుబాయ్ నుంచి వచ్చిన మహేంద్రహిల్స్ యువకునికి తాజా వైద్య పరీక్షల్లో కరోనా నెగెటివ్ వచ్చినట్లు తెలిసింది. జ్వరం తగ్గడంతో పాటు బీపీ కూడా అదుపులోకి వచ్చినట్లు సమాచారం. 48 గంటల్లో మరోసారి నమూనాలు సేకరించి, పుణే వైరాలజీ ల్యాబ్‌కు పంపి మళ్లీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. గాంధీ మెడికల్ రిపోర్ట్‌లతో పోల్చి చూసి, వైరస్ భారీ నుంచి పూర్తిగా బయటపడినట్లు నిర్ధారించుకున్న తర్వాతే బాధితున్ని ఆస్పత్రి నుంచి హోం ఐసోలేషన్‌కు తరలించనున్నారు. ఇప్పటికే బాధితునికి క్లోజ్ కాంటాక్ట్‌లో ఉన్న సిబ్బంది సహా బాధితుని తల్లిదండ్రులకు వైద్య పరీక్షల్లో నెగటివ్‌గా నిర్ధారణ అయింది. ఇటలీ నుంచి వచ్చిన యువతికి కూడా నెగెటివ్ అని తేలింది. దీంతో వారిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసిన విషయం తెలిసిందే.

## ప్రస్తుతం 32 మంది అనుమానితులు...

ఇటీవల విదేశాల నుంచి వచ్చి దగ్గు, జ్వరం, జలుబు లక్షణాలతో బాధపడుతూ శనివారం ఆస్పత్రికి చేరుకున్న 17 మంది అనుమానితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించగా, వారికి నెగెటివ్ వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వీరిలో మహేంద్ర హిల్స్‌కు చెందిన యువకునికి మినహా మిగిలిన వారందరికీ కరోనా వైరస్ సోకలేదని నిర్ధారణ కావడంతో వైద్య, ఆరోగ్యశాఖ ఊపిరిపీల్చుకుంది. ఇక సోమవారం 8 మంది కరోనా అనుమానితులు అడ్మిట్ కాగా వారి నుంచి నమూనాలు సేకరించి గాంధీ వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. ప్రస్తుతం గాంధీ ఐసోలేషన్ వార్డులో 32 మంది అనుమానితులు చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఉదయం వీరిని కూడా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసే అవకాశం ఉంది.

## రెండు మెడికల్ షాపులపై కేసులు..

ఒకవైపు కరోనా... మరోవైపు స్వైన్‌ఫ్లూ విస్తరిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో గ్రేటర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. వైరస్‌ల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా మాస్క్‌లను వాడుతున్నారు. సిటిజన్లలో ఉన్న భయాన్ని కొందరు మెడికల్‌షాపుల నిర్వాహకులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు మాస్క్‌లను విక్రయిస్తున్నారు. సాధారణ మాస్క్ ధర రూ.2 నుంచి రూ.3 ఉండగా, రూ.20 వరకు విక్రయిస్తున్నారు. అధిక ధరలకు మాస్క్‌లు విక్రయిస్తున్న మెడికల్ షాపులపై ఫోరం ఫర్ అగెనెస్ట్ కరప్షన్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కాట్రగడ్డ సాయి తేజ కూకట్‌పల్లి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో బాలాజీనగర్‌లోని మారుతి మెడికల్ షాపు, శ్రీసాయి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌పై కేసులు నమోదు చేశారు.



# రైల్వే ఆసుపత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు

- కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతుండటంతో రైల్వే శాఖ అప్రమత్తం
- ఆన్‌బోర్డు పారిశుధ్య సిబ్బంది ద్వారా రసాయన జలాల పిచికారీ

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ వ్యాప్తిపై రైల్వే శాఖ అప్రమత్తమైంది. రైల్వే ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డులు ప్రారంభించటంతో పాటు రైళ్లలో రసాయన జలాలతో ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ నుంచి ఆదేశాలు రావటంతో దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా చర్యలు చేపట్టారు. సికింద్రాబాద్ లాలాగూడలోని రైల్వే ఆస్పత్రిలో ప్రత్యేకంగా 10 పడకలతో ఐసోలేషన్ వార్డు ప్రారంభించారు. అలాగే జోన్ పరిధిలోని అన్ని డివిజన్ కేంద్రాల్లో ఉన్న రైల్వే ఆస్పత్రుల్లో కూడా ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయబోతున్నారు.

## రైలు ప్రయాణాలతో జాగ్రత్త..

దేశవ్యాప్తంగా పది రోజుల కిందటి వరకు ఐదు పాజిటివ్ కేసులు మాత్రమే ఉండగా, సోమవారానికి ఆ సంఖ్య 43కు చేరుకుంది. కోవిడ్ ప్రభావం ఎక్కువగా ఉన్న దేశాల నుంచి వచ్చే వారే ఈ వైరస్‌కు గురవుతున్నారు. వారు మన దేశానికి వచ్చేనాటికే వారి శరీరంలో ఆ వైరస్ చేరి ఉంటోంది. ఇక్కడికి వచ్చాక జ్వరం, జలుబు వచ్చి అప్పుడు ఆస్పత్రులకు వెళ్తే కోవిడ్ పాజిటివ్‌గా తేలుతోంది. ఆ లక్షణాలు పూర్తిగా బయటపడే లోపు వారు చాలాచోట్ల ప్రయాణిస్తున్నారు. ఈ సమయంలో ఇతరులకు సోకే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా రైలు ప్రయాణాల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు పేర్కొంటున్నారు. కోవిడ్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు చెందిన వారు రైళ్లలో ఉండే అవకాశం ఉంది. అందుకే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## ఆన్‌బోర్డు సిబ్బందితో రసాయనాల పిచికారీ..

రైళ్లలో ఆన్‌బోర్డు క్లీనింగ్ సిబ్బంది ఉంటారు. వారు రైలు ప్రయాణిస్తున్న సమయంలో ప్రయాణికుల నుంచి వచ్చే అపరిశుభ్రత ఫిర్యాదుల ఆధారంగా ఆ బోగీకి చేరుకుని శుభ్రం చేస్తుంటారు. ఇప్పుడు వారి వద్ద వైరస్‌పై ప్రభావం చూపే రసాయనాలను అందుబాటులో ఉంచారు. నిర్ధారిత సమయాల ప్రకారం వారు సీట్లు, హోల్డింగ్ బార్స్, టాయిలెట్లు, తలుపులు, కిటికీల వద్ద వాటిని పిచికారీ చేస్తున్నారు. ప్రత్యేకంగా ప్రయాణికులు ఫిర్యాదు చేసినా వచ్చి ఆ చర్యలు చేపడుతున్నారు. రైల్వే సిబ్బంది, ప్రయాణికుల్లో ఎవరైనా కోవిడ్ లక్షణాలతో ఇబ్బంది పడుతుంటే వెంటనే వారిని రైల్వే ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసే ఐసోలేషన్ వార్డులకు తరలించి చికిత్స అందిస్తారు. దీనికి సంబంధించి ఆయా ఆస్పత్రుల్లోని వైద్యుల్లో కొందరిని ప్రత్యేకంగా ఆ వార్డులకు కేటాయించారు. వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. ఈ ఆస్పత్రుల్లో సాధారణ ప్రజలను కూడా చేర్చుకోవాలా వద్దా అన్న విషయంలో మాత్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదని అధికారులు చెబుతున్నారు. ఇక అన్ని స్టేషన్లలో రసాయన జలాల పిచికారీ చేపట్టారు. ముఖ్యంగా ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండే స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించారు. పారిశుధ్య చర్యలను కూడా పెంచారు.

# లేజర్ కిరణాలతో నక్షత్రాల శక్తి!

## సాధ్యమే అంటున్న ఆస్ట్రేలియా కంపెనీ

- ఫలిస్తే తక్కువ ఖర్చుతో బోలెడంత విద్యుత్తు
- విద్యుత్ కొరతే లేకుండా చేయొచ్చంటున్న పరిశోధకులు

**సాక్షి, హైదరాబాద్:** పెట్రోల్, డీజిల్‌లాగా కాలుష్యం గొడవ లేదు. అణు విద్యుత్తుతో వచ్చే రేడియోధార్మికత, వ్యర్థాల సమస్య ఉండదు. ఛర్నోబిల్, ఫుకుషిమా వంటి అణు ప్రమాదాలకూ ఆస్కారం లేదు. బయటకొచ్చేదంతా హాని చేయని హీలియం. ఉత్పత్తి అయ్యే విద్యుత్తును నేరుగా వాడుకోవడమే.. ఏమిటిదీ.. ఎలా సాధ్యం? ప్రపంచం మొత్తం దశాబ్దాలుగా పరిష్కరించేందుకు మల్లగుల్లాలు పడుతున్న ఈ సమస్యకు ఆస్ట్రేలియాలోని 'హెచ్‌బీ11 ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ ఓ వినూత్నమైన పరిష్కారం కనుక్కుంది. వీరి ఆలోచన విజయవంతమైతే.. భూమ్మీద విద్యుత్తు కొరత అసలే ఉండదు. సూర్యుడితో పాటు నక్షత్రాలన్నింటిలోనూ శక్తి ఉత్పత్తి అయ్యేందుకు కారణమైన కేంద్రక సంలీన ప్రక్రియపై ఆ సంస్థ కన్నేసింది.

**కేంద్రక సంలీన ప్రక్రియ అంటే?**

అణు విద్యుత్ శక్తి ప్లాంట్ల గురించి మనం తరచూ వింటూ ఉంటాం. ఇందులో అణువులను విడగొట్టడం ద్వారా పుట్టే వేడిని విద్యుత్తుగా మారుస్తారు. కేంద్రక సంలీన ప్రక్రియ అనేది దీనికి పూర్తిగా వ్యతిరేక దిశలో జరుగుతుంది. ఇందులో విపరీతమైన వేడిని ఉపయోగించి అణువులను ఒకదాంట్లో ఒకటి లయమయ్యేలా చేస్తారు. సూర్యుడు, ఇతర నక్షత్రాలన్నింటిలోనూ హైడ్రోజన్ హీలియం అణువులు లయమైపోవడం ద్వారానే శక్తి ఉత్పత్తి అవుతుంటుంది. ఈ శక్తిని మనం వెలుతురు రూపంలో అనుభవిస్తున్నాం. అయితే నక్షత్రాల్లో కోటానుకోట్ల ఏళ్లుగా జరుగుతున్న కేంద్రకసంలీన ప్రక్రియను భూమ్మీద సృష్టించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఇప్పటివరకు సఫలీకృతం కాలేదు. హైడ్రోజన్, హీలియం వంటి ఇంధనాలను లక్షల డిగ్రీ సెల్సియస్ వరకు వేడి చేయడం ద్వారా మాత్రమే ఆ రెండు అణువులు కలసిపోతాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇలాంటి ఓ విద్యుదుత్పత్తి రియాక్టర్‌ను నిర్మించేందుకు ఇంటర్నేషనల్ న్యూక్లియర్ ఫ్యూజన్ రీసెర్చ్ పేరుతో అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం ఒకటి ఫ్రాన్స్‌లో ప్రయత్నం చేస్తోంది. అణువులను లయం చేయడం, ఉష్ణోగ్రతలను నియంత్రించడం సాధ్యమైతే? ఆ తర్వాత ఈ ప్రక్రియను అందరికీ అందుబాటులోకి తెచ్చే విషయాన్ని ఆలోచిస్తారు.

**హెచ్‌బీ11.. కాస్త డిఫరెంట్..**

అయితే హెచ్‌బీ11 అభివృద్ధి చేసిన టెక్నాలజీలో ఇంధనాలను వేడి చేయాల్సిన అవసరం ఉండదు. బదులుగా శక్తిమంతమైన లేజర్లను ఉపయోగిస్తారు. అత్యంత సూక్ష్మ సమయం మాత్రమే వెలువడే ఈ లేజర్ల ద్వారా సూర్యుడి కంటే ఎన్నో రెట్లు ఎక్కువ ఉష్ణోగ్రతను పుట్టిస్తారు. ఈ టెక్నాలజీలో లోహంతో తయారు చేసిన ఓ బంతిలాంటి నిర్మాణం ఉంటుంది. దీని మధ్యభాగంలో హెచ్‌బీ11 గుళిక ఉంచుతారు. గుళికపై ఇరువైపులా చిన్న కణతలు ఉంటాయి. అయస్కాంత శక్తితో ఒక లేజర్ ప్లాస్మాను పట్టి ఉంచితే.. రెండో లేజర్ కేంద్రకసంలీన ప్రక్రియ మొదలుపెడుతుంది. ఈ క్రమంలో విడుదలయ్యే ఆల్ఫా కణాలు విద్యుత్తు ఉత్పత్తి చేస్తాయి. ఈ విద్యుత్తును నేరుగా గ్రిడ్‌కు అనుసంధానించవచ్చు. ఈ పద్ధతిలో ఉపయోగించే బోరాన్ ప్రపంచవ్యాప్తంగా విరివిగా లభిస్తుందని, యురేనియం థోరియం వంటి అణు ఇంధనాల కంటే సులువుగా వెలికితీసి వాడుకోవచ్చని హెచ్‌బీ11 వ్యవస్థాపకుడు డాక్టర్ హెన్రిక్ హోరా చెబుతున్నారు. అణు రియాక్టర్లలోలా స్టీమ్ ఇంజన్లను ఉపయోగించాల్సిన అవసరం లేకపోవడం మరో విశేషమంటున్నారు.


హెన్రిక్ హోరా



### అరవై ఏళ్ల ప్రస్థానం..

**1960..** తొలి లేజర్ ఆవిష్కరణ
**1960–78:** లేజర్ల సాయంతో సంలీన ప్రక్రియపై ప్రొఫెసర్ హెన్రిక్ హోరా పరిశోధనలు
**1978:** శక్తిమంతమైన లేజర్లతో హైడ్రోజన్, బోరాన్ –11 (హెచ్‌బీ11)లను బాగా వేడి చేయకుండానే లయం చేయొచ్చని హెన్రిక్ హోరా ప్రకటన.
**1985:** అందుబాటులోకి చిర్ప్‌డ్ పల్స్ ఆంప్లిఫికేషన్ టెక్నాలజీ(సీపీఏ). డోనా స్ట్రిక్‌ల్యాండ్, గెరార్డ్ మౌరూ అనే ఇద్దరు శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఈ టెక్నాలజీ ద్వారా చిన్న చిన్న లేజర్ కిరణాల శక్తిని లక్షల రెట్లు పెంచేందుకు వీలేర్పడింది.
**2005–2015:** సీపీఏ టెక్నాలజీ సాయంతో హెచ్‌బీ11ను లయం చేయొచ్చని, ఇందుకు 2 పదార్థాలను అత్యధిక ఉష్ణోగ్రతలకు వేడి చేయాల్సిన అవసరం లేదని పలువురు శాస్త్రవేత్తల నిరూపణ.
**2014–2017:** కేంద్రక సంలీన ప్రక్రియను సులువుగా సాధించే టెక్నాలజీపై పేటెంట్ హక్కులు నమోదు చేసిన హెచ్‌బీ11
**2018:** డోనా స్ట్రిక్‌ల్యాండ్, గెరార్డ్ మౌరూలకు భౌతిక శాస్త్ర నోబెల్.
**2019:** హెచ్‌బీ11 ఎనర్జీ కంపెనీ ఏర్పాటు. తొలి అమెరికన్ పేటెంట్ మంజూరు!

# కోవిడ్ పై కేరళ యుద్ధం

- ఆ రాష్ట్రంలో పర్యటించిన తెలంగాణ బృందం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు నివేదిక సమర్పణ




**సాక్షి, హైదరాబాద్:** వైరస్ ఏదైనా.. దాన్ని కేరళ రాష్ట్రం ఇట్టే అరికడుతోంది. ఇదే విషయాన్ని ఇటీవల కేరళకు వెళ్లిన తెలంగాణకు చెందిన అధ్యయన బృందం సోమవారం ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొంది. రాష్ట్రంలో తొలి కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైన నేపథ్యంలో.. ఇటీవలే కేరళలో 3 కేసులు నమోదై వారికి చికిత్స అందించిన విధానంపై అధ్యయనం చేసేందుకు తెలంగాణ నుంచి 12 మంది సభ్యుల బృందం ఈ నెల 5న కేరళ వెళ్లింది. వైరస్ నియంత్రణ, సర్వైలెన్స్, నివారణ ప్రణాళికలపై కేరళ తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేసి ఆదివారం రాత్రి రాష్ట్రానికి ఈ బృందం చేరుకుంది. సోమవారం సర్కారుకు నివేదిచ్చింది. ఈ పర్యటనలో భాగంగా త్రివేండ్రంలోని డొమెస్టిక్, అంతర్జాతీయ టెర్మినల్‌లో స్క్రీనింగ్ విభాగాన్ని బృందం పరిశీలించింది. అలప్పుజా జిల్లాలో కోవిడ్ నియంత్రణపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడింది.

## గ్రామస్థాయి నుంచే గుర్తింపు..

వైరస్ ఏదైనా దాన్ని గ్రామస్థాయి నుంచే గుర్తించాలని, పీహెచ్‌సీ పరిధిలో ఐడెంటిఫై చేయాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. అక్కడి గ్రామాలకు విదేశాల నుంచి ఎవరైనా వస్తే వెంటనే స్థానిక వైద్య సిబ్బంది వారిని గుర్తిస్తోంది. వారికి వెంటనే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఏవైనా వైరస్ అనుమానిత లక్షణాలుంటే వెంటనే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ కేంద్రాలకు పంపుతారు. నిపా వైరస్ తర్వాత కేరళ సర్కారు రాష్ట్ర రాజధానిలో కాకుండా ప్రతి జిల్లాల్లో ప్రత్యేక ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. దాంతో ఎక్కడికక్కడే వైరస్ అనుమానిత లక్షణాలున్నవారిని గుర్తించి, ఐసోలేషన్‌లో ఉంచేవారు. విదేశాల నుంచి వచ్చి ఏమాత్రం కొంచెం అనారోగ్యానికి గురైనా వారిని ఇంటికే పరిమితం చేసేవారు. దీంతో వైరస్ ఎటువంటిదైనా దాన్ని ఇట్టే అరికట్టగలిగేది. అక్కడ ఎయిర్‌పోర్టులో ఎలా స్క్రీనింగ్ చేస్తున్నారో బృందం తెలుసుకుంది. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా ఆస్పత్రికి తీసుకెళ్లడం తదితర వివరాలన్నీ నివేదికలో పొందుపరిచారు.

## అక్కడిలా చేశారు..

1. కోవిడ్ నియంత్రణకు కేరళ సర్కారు 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది . సర్వైలెన్స్ టీమ్, కాల్‌సెంటర్ మేనేజ్‌మెంట్ టీమ్, ట్రైనింగ్ అండ్ అవెర్నెస్ జనరేషన్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మీడియా సర్వైలెన్స్, ఐఈసీ మీడియా మేనేజ్‌మెంట్, డాక్యుమెంటేషన్, ప్రైవేటు హాస్పిటల్స్ మేనేజ్‌మెంట్, ఎక్స్‌పర్ట్ స్టడీ కోఆర్డినేషన్, ట్రాన్స్‌పోర్ట్ అండ్ అంబులెన్స్ మేనేజ్‌మెంట్, శాఖల మధ్య సహకారం, వలంటీర్ కోఆర్డినేషన్, సైకలాజికల్ సపోర్టు టీమ్‌లను ఏర్పాటు చేసింది.
2. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు పారామెడికల్ సిబ్బంది, నాన్ పారామెడికల్ సిబ్బంది, అంబులెన్స్ డ్రైవర్స్, అటెండర్స్, ఆశా వర్కర్స్, స్వయం సహాయక బృందాలు, లైన్ డిపార్ట్‌మెంట్ స్టాఫ్, అంగన్‌వాడీలు, స్కూల్, కాలేజీ విద్యార్థులు, టెకీలు, హోటల్స్, రిసార్ట్ ఉద్యోగులందరికీ శిక్షణనిచ్చారు.
3. ఐసోలేషన్, క్వారంటైన్‌లో ఉన్న రోగికి, వారి కుటుంబసభ్యులకు మానసిక బలాన్నిచ్చేవారు.
4. మీడియా సర్వైలెన్స్ కమిటీ వైరస్‌పై, మీడియా, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తుంది.
5. ఐసోలేషన్ కోసం సింగిల్ బెడ్రూమ్స్, సర్కారీ ఆస్పత్రుల్లో పెయిడ్ రూమ్స్ ఏర్పాటు చేశారు. కొన్ని ఐసోలేషన్ గదుల్లో వెంటిలేషన్, ఐసీయూ సౌకర్యాన్ని కల్పించారు.
6. ప్రతిరోజూ కోవిడ్‌పై సాయంత్రం 6 గంటలకు ఒక అధికార మీడియాతో మాట్లాడేలా ఏర్పాటుచేశారు. అలాగే బులిటెన్స్ విడుదల చేసేవారు.
7. 'భయాన్ని తొలగించండి– జాగ్రత్త వహించండి'అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించారు.

### యూనిసెఫ్, డబ్ల్యూహెచ్‌వో భాగస్వామ్యం..

రాష్ట్రంలో కోవిడ్ వైరస్‌పై ప్రభుత్వం చేపట్టిన అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యేందుకు యూనిసెఫ్ ముందుకొచ్చింది. ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు రాష్ట్రంలో సర్కారు చేపడుతున్న చర్యలపై పరిశీలిస్తున్నారు. యూనిసెఫ్ ప్రతినిధులు సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై ఈ విషయాన్ని తెలిపారు.

# కోవిడ్ కాలర్ ట్యూన్‌తో 'కాలయాపన'

- ఎవరికి ఫోన్ చేసినా ఇంగ్లిష్‌లో కోవిడ్ ట్యూన్..
- 30 సెకన్లకు పైగా నిడివి.. అది పూర్తయ్యాకే ఫోన్ చేసిన వ్యక్తికి కాల్
- ప్రతిసారీ వస్తుండటంతో టైమ్ వేస్ట్‌తో పాటు విని విని విసుగేస్తోందంటున్న కొందరు
- ఆంగ్లం అర్థం కాక కాల్స్ కలవడం లేదంటూ మధ్యలోనే కట్ చేస్తున్న గ్రామీణులు



**సాక్షి, హైదరాబాద్:** ఎవరికి ఫోన్ చేసినా మూడు సార్లు దగ్గు.. ఆ తర్వాత ఆంగ్లంలో కోవిడ్–19 వైరస్ గురించి ఆదరాబాదరా ఉపన్యాసం.. చివరకు కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ జారీ చేసిన ప్రకటన అంటూ 30 సెకన్ల తర్వాత ముక్తాయింపు. గత రెండ్రోజులుగా రాష్ట్రంలోని అన్ని నెట్‌వర్క్‌ల మొబైల్ వినియోగదారులకు కోవిడ్ వైరస్ వ్యాప్తి నిరోధం కోసం వస్తున్న కాలర్ ట్యూన్ ఇది. కోవిడ్ వైరస్ వ్యాప్తి చెందకుండా కాలర్ ట్యూన్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేయడంలో ఎవరికీ అభ్యంతరం లేదు కానీ.. ఆంగ్లంలో హడావుడిగా దొర్లుకుంటూ.. చివరకు ప్రజలను గజిబిజి చేసే విధంగా నంబర్లతో ముగించడంతో కాలయాపన తప్ప ప్రయోజనం ఏమీ లేదనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఈ కాలర్‌ట్యూన్ వలన రెండు రకాల ఇబ్బందులు వస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ట్యూన్‌తో పాటు కాల్ కనెక్ట్ కావడం లేదని, ఈ ట్యూన్ పూర్తయ్యాకే మనం ఫోన్ చేసిన వ్యక్తికి లైన్ కలుస్తుండటంతో చాలా టైమ్ వేస్ట్ అవుతోందని, పదేపదే అదే ట్యూన్ వినడం విసుగుపుట్టిస్తోందని మెజార్టీ మొబైల్ వినియోగదారులంటున్నారు. మరో ముఖ్యమైన సమస్య ఏమిటంటే కాలర్ ట్యూన్ ఇంగ్లిష్‌లో ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలకు అర్థం కాక ఫోన్ కలవడం లేదంటూ కట్ చేస్తున్నారు. మొబైల్ అకౌంట్‌లో బ్యాలెన్స్ లేకపోయినా, నెట్‌వర్క్ సమస్యతో ఫోన్ కలవకపోయినా సదరు వినియోగదారుడికి కూడా ఆ నెట్‌వర్క్ ప్రతినిధులు ఇంగ్లిష్‌లోనే వివరిస్తుంటారు. ఇప్పుడు కోవిడ్ కాలర్ ట్యూన్ కూడా ఇంగ్లిష్‌లోనే వస్తుండటంతో ఫోన్ కలవడంలో సమస్య ఉందని, అందుకే ఎవరో ఇంగ్లిష్‌లో చెబుతున్నారనే భావనతో గ్రామీణ నిరక్షరాస్యులు ఫోన్ కట్ చేస్తున్నారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా, ఎవరికి చేసినా ఇదే సమస్య వస్తోందంటూ కొందరు మొబైల్ షాప్‌లకు కూడా వెళ్లాల్సి వస్తోంది. మొత్తంమీద కోవిడ్‌పై చైతన్యపర్చడంలో తప్పేమీ లేదని, కానీ ఇంగ్లిష్ వల్లే ఇబ్బందులొస్తున్నాయనే భావన వ్యక్తమవుతోంది. కాలర్‌ట్యూన్‌ను మాతృభాషలో ఇస్తే అందరికీ అర్థమవుతుందని, తద్వారా తగిన జాగ్రత్తలు తీసుకునే అవకాశముందని చర్చ ఇంగ్లిష్‌లో ఇవ్వడం వల్ల జరిగే ఉపయోగమేంటన్న జరుగుతోంది. మాతృభాషలో ఇచ్చినా రోజుకు రెండు లేదా మూడు సార్లు కోవిడ్ వైరస్ గురించి చెపితే బాగుంటుందని, ప్రతిసారీ ఫోన్ చేయగానే దగ్గు వినిపించడం కూడా మానసికంగా ఇబ్బందేనని ప్రజలంటున్నారు. ఇప్పటికైనా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం ద్వారా తెలుగులో కాలర్ ట్యూన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.